# ముఖ్యమైన సందేశాలు-2

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# ముఖ్యమైన సందేశాలు-2



రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,

మొదటి ముద్రణ : జూలై, 2026
ప్రతులు : 1,000

వెల : రూ. 90/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 20) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 21) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 22) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 23) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 24) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 25) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# "సృష్టిలో మార్పు అన్నది సహజం"

ఈ ముఖ్యమైన సందేశాలు మీలో మార్పు తీసుకురావడానికి ఎంతో ఉపయోగపడతాయి, మీరు ఆధ్యాత్మికంగా ఎదగడానికి సహాయపడతాయి. ఆధ్యాత్మికంగా ఎదగడం అంటే మనిషిలో సంపూర్ణమైన మార్పు తీసుకురావడం. ఆధ్యాత్మికంగా ఎదిగినప్పుడు మీరు దేన్నైనా తట్టుకోగలుగుతారు, దేన్నైనా అధిగమించగలుగుతారు, ఏదైనా సాధించగలుగుతారు, సమాజంలో గొప్పవారిగా నిలబడగలుగుతారు, మంచి పేరు తెచ్చుకోగలుగుతారు, గొప్పవారిగా మారతారు.

ఇప్పుడు ముఖ్యమైన సందేశం తెలుసుకుందాం.

**'సృష్టిలో మార్పు అనేది సహజం'.**

ఇది అంత ముఖ్యమైన సందేశమా అని మీకు అనిపించవచ్చు. కానీ మీ జ్ఞానం పెరిగే కొద్దీ ఇది ఎంత ముఖ్యమైన విషయమో మీకు అర్థమవుతుంది.

సృష్టిలో మాత్రమే కాదు, మీ జీవితంలో కూడా మార్పులు జరుగుతూనే ఉంటాయి. అంతేకాదు, మీ అభిప్రాయాల్లో కూడా మార్పులు వస్తుంటాయి. మొదట్లో మీకు ఉన్న అభిప్రాయాలు ఇప్పుడు అలాగే ఉండవు. చాలా మారిపోయి ఉంటాయి. మిమ్మల్ని మీరు గమనించుకుంటే ఈ విషయం మీకే స్పష్టంగా అర్థమవుతుంది.

మీ ప్రవర్తనలో మార్పులు వస్తాయి, మీ ఆలోచనా విధానంలో మార్పులు వస్తాయి, మీ నడవడికలో మార్పులు వస్తాయి. మీకు ఉన్న వనరులను ఉపయోగించుకునే విధానంలో కూడా మార్పులు వస్తాయి. వనరులు అంటే మీకు ఉన్న నైపుణ్యాలు, సంపద, జ్ఞానం, అలాగే శారీరక నైపుణ్యాలు మరియు ఇంద్రియ నైపుణ్యాలు, వీటిని ఉపయోగించుకునే విధానంలో కూడా

కాలానుగుణంగా ఎన్నో మార్పులు వస్తుంటాయి. మీరు ఒకసారి గమనిస్తే ఈ విషయం మీకే తెలుస్తుంది. మీ ధనం మాత్రమే కాదు, మీ మాటలు కూడా మారతాయి. మీ శక్తి మాత్రమే కాదు, మీ ఆలోచనలు కూడా మారతాయి. జీవితంలో ఎన్నో విషయాలు ఎలా మారిపోయాయో ఒక్కసారి ఆలోచించండి.

సృష్టిలో మార్పు అనేది సహజం. ఇది అంత ముఖ్యమైనదా అని మీకు అనిపించవచ్చు. కానీ మీ జ్ఞానం పెరిగే కొద్దీ ఇది ఎంత గొప్ప సత్యమో మీకు అర్థమవుతుంది. అందుకే "ఎప్పుడూ ఇలానే ఉంటుంది" అని ఎప్పుడూ అనుకోకండి. మీ నమ్మకాలలో కూడా మార్పులు వస్తాయి, మీ కుటుంబ సభ్యుల పట్ల ఉన్న అభిప్రాయాలు మారుతాయి, మీ బంధువుల పట్ల, ఇతరుల పట్ల మీ దృష్టి కోణం కూడా మారుతుంది.

సృష్టిలో మార్పు అంటే కొందరు యుద్ధాలు రావడం, సునామీలు రావడం, కొన్ని దేశాలు నష్టపోవడం, ప్రజలు ఇబ్బందులు పడటం మాత్రమే అనుకోవచ్చు. అవి కూడా మార్పులే. కానీ వాటికంటే ఎక్కువ మార్పులు మీ జీవితాల్లోనే జరుగుతుంటాయి. అవి నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. మీరు ఊహించ లేనంతగా మీలో మార్పులు వస్తాయి. నా జీవితాన్నే తీసుకుంటే, నిజంగా ఊహించలేనంత మార్పు వచ్చింది. పత్రి గారి పరిచయం కాక ముందు ఉన్న జీవితం ఒక విధంగా ఉండేది; ఆయన పరిచయం అయిన తర్వాత జీవితం పూర్తిగా మారిపోయింది. నాలో వచ్చిన తేడా ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అప్పుడు విగ్రహారాధన ఉండేది, ఇప్పుడు ఆత్మారాధన ఉంది, అప్పుడు అసత్యారాధన ఉండేది, ఇప్పుడు సత్యారాధన ఉంది, అప్పుడు అజ్ఞానం ఉండేది, ఇప్పుడు జ్ఞానం వచ్చింది, అప్పుడు ధన కాంక్ష ఎక్కువగా ఉండేది, ఇప్పుడు జ్ఞాన కాంక్ష పెరిగింది.

అప్పుడు ధన సంపాదనే ముఖ్యంగా ఉండేది, ఇప్పుడు జ్ఞాన సంపాదన ప్రధానమైంది, అప్పుడు భోగాలపై ఆసక్తి ఉండేది, ఇప్పుడు యోగంపై ఆసక్తి పెరిగింది.

ఈ మార్పులు సహజం. అందుకే ఈ మాటలు సాధారణమైనవి కావు. మీరు కూడా మీ జీవితాన్ని ఒకసారి పరిశీలించండి. "మీలో వచ్చిన మార్పులు" అని ఒక పుస్తకంలో ప్రత్యేకంగా వ్రాసుకోండి. అప్పుడు మీకే ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకు వ్రాసుకోవాలి అంటే, మీరు ఎంత ఎదుగుతున్నారో మీకు తెలుస్తుంది. అప్పుడు దేహ బంధువులే ముఖ్యంగా కనిపించేవారు, ఇప్పుడు ఆత్మ బంధువులు కనిపిస్తున్నారు. అప్పుడు కుటుంబం కోసమే జీవితం ఉండేది, ఇప్పుడు అందరి కోసం జీవించాలనే భావన పెరిగింది. అప్పుడు "అందరూ వేరు" అనే భావం ఉండేది, ఇప్పుడు "అందరు ఒక్కటే" అనే భావం వచ్చింది. అప్పుడు "నా కోసం, నా కుటుంబం కోసం" అనే ఆలోచన మాత్రమే ఉండేది. ఇప్పుడు "ఈ జీవితం అందరి కోసం" అనే విశాలమైన భావం వస్తుంది.

అప్పుడు సరైన అవగాహన ఉండేది కాదు, చిన్న చిన్న గొడవలు జరిగేవి. కానీ జ్ఞానం, బుద్ధి పెరిగిన తర్వాత పరస్పర అవగాహన పెరిగింది. అందువల్ల ప్రేమ, ఆప్యాయత, ఇష్టం మరింత బలపడ్డాయి. అప్పుడు జీవితం కేవలం కుటుంబానికే పరిమితమై ఉండేది, ఇప్పుడు ఎంతో మందికి ఆదర్శంగా, ఉపయోగకరంగా మారింది. మీలో కూడా ఇటువంటి మార్పులు వస్తున్నాయంటే, మీ బుద్ధి మరియు జ్ఞానం పెరుగుతున్నాయన్న మాట. చిన్న మార్పు వచ్చినా అది ఎదుగుదలకు సంకేతమే. అప్పుడు ఆత్మ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు, ఇప్పుడు పూర్తిగా ఆత్మ గురించే ఆలోచిస్తున్నారు.

అప్పుడు ఆత్మ కోసం ఏమీ చేయలేదు, ఇప్పుడు చేసే ప్రతి పని

ఆత్మ పురోగతికే ఉపయోగపడుతోంది. ఒక విధంగా చెప్పాలంటే, పత్రి గారి పరిచయం కాక ముందు ఉన్న జీవితం ఒక జన్మ అయితే, ఆయన పరిచయం తర్వాత వచ్చిన జీవితం మరో జన్మలాంటిది. అందుకే "ద్విజత్వం" అనే భావన వస్తుంది  అంటే కొత్తగా పుట్టినట్లుగా మారిపోవడం. ధ్యానం, జ్ఞానం వల్ల జీవితంలో ఇంత గొప్ప మార్పు వస్తుంది. అప్పుడు మాట్లాడే అలవాటు ఉండేది కాదు, ఇప్పుడు మాట్లాడకుండా రోజు పూర్తికాని స్థితి వచ్చింది.

నా జీవితంలో "ఇది నిజంగా మరో జన్మలాంటి మార్పు. మేడంలో కానీ, నాలో కానీ వచ్చిన ఈ మార్పు సాధారణం కాదు. అందుకే పత్రి గారు మేడం చేత "మరోజన్మ" పుస్తకం వ్రాయించారు. ఆయన చెప్పిన మాటలు నిజమని ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది.

సృష్టిలో మార్పు అంటే కేవలం బయట జరిగే సంఘటనలు మాత్రమే కాదు, మన అందరి జీవితాల్లో, ఆలోచనల్లో, స్వభావాల్లో వచ్చే మార్పులూ సృష్టిలో భాగమే. మీరు కూడా ఈ సృష్టిలోనే ఉన్నారు కాబట్టి మీలో వచ్చే ప్రతి మంచి మార్పు కూడా సృష్టి మార్పే.

మీరు ఈ ఆధ్యాత్మికంపై ఎంత శ్రద్ధ పెడతారో, అంతకు మించి ఊహించని మార్పులు జీవితంలో వస్తాయి, రావాలి కూడా. ఒకప్పుడు మీరు ఎక్కడా మాట్లాడే వారు కాదు. కానీ ఇప్పుడు మాట్లాడకుండా ఒక్కరోజు కూడా కనిపించడం లేదు. ఇదే ఆధ్యాత్మిక జ్ఞానం తీసుకొచ్చిన మార్పు."

మేము అప్పుడు పుస్తకాలు చదవడమే తెలుసు, ఇప్పుడు పుస్తకాలు వ్రాయగల స్థాయికి ఎదిగాం. అప్పుడు సినిమాలు, వినోదాలపై ఆసక్తి ఉండేది, ఇప్పుడు అవన్నీ తగ్గిపోయాయి. అప్పుడు "అందరూ వేరు" అనే భావన ఉండేది, ఇప్పుడు "అందరం ఒక్కటే" అనే భావం వచ్చింది. మీ అందరిలో కూడా ఇటువంటి ఎన్నో మార్పులు ఉన్నాయి. మీరు ఒకసారి వ్రాసుకుంటే మీకే

తెలుస్తుంది  "నాలో ఇన్ని మార్పులా!" అని ఆశ్చర్యపోతారు.

మీ సమయం, ధనం, మాట, శక్తి, జీవితాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో ఒకసారి గమనించండి. అదే మీ మార్పును తెలియజేస్తుంది. సృష్టిలో మార్పు అంటే కేవలం భౌతిక మార్పులు మాత్రమే కాదు, మనుషుల్లో జరిగే అంతర్గత మార్పులు కూడా సృష్టిలో భాగమే. మార్పు అంటే ఎదుగుదల. మీరు ఎంత ఎదుగుతారో, అంతగా జన్మలు తగ్గుతాయి. జన్మలు తగ్గే కొద్దీ మోక్షానికి దగ్గరవుతారు, అదే నిజమైన లక్ష్యం. ధ్యానం వల్ల, జ్ఞానం వల్ల మీలో వచ్చిన మార్పులను మీరు గమనిస్తే మీకే ఆశ్చర్యం కలుగుతుంది. "నేను నిజంగా ఇంత మారానా!" అని మీరే అనుకుంటారు. ఇంకా ఎక్కువ శ్రద్ధ పెడితే ఇంకా గొప్ప మార్పులు వస్తాయి. ఇటువంటి మార్పులు ఇప్పుడే సాధించకపోతే, మళ్లీ ఎన్నో జన్మలు తీసుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు సాధిస్తే ఆ అవసరం ఉండదు.

మీ ఆహారంలో, అలవాట్లలో, ప్రవర్తనలో, మాటల్లో, ఆలోచనా విధానంలో, నడవడికలో వచ్చిన మార్పులే మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు సూచనలు. అంతకు ముందు దేహానికే ప్రాముఖ్యం ఉండేది, ఇప్పుడు ఆత్మకే ప్రాముఖ్యం పెరిగింది. ఈ విషయాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దు  సృష్టిలో మార్పు అన్నది సహజం, అలాగే మీ జీవితంలో మార్పు కూడా సహజమే.

ధ్యాన మార్గంలోకి వచ్చిన తర్వాత మీ జీవితంలో జరిగే మార్పులన్నీ చివరికి ఆత్మ పురోగతికే ఉపయోగపడతాయి. కొన్ని మొదట నష్టంలా అనిపించవచ్చు, కానీ అవన్నీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు దారితీస్తాయి.

"పత్రి గారు చెప్పినట్టు, ఒక విద్యార్థి పరీక్షలో పాస్ అయితేనే తర్వాతి క్లాస్‌కు వెళ్తాడు, ఫెయిల్ అయితే అదే క్లాస్‌లో మళ్ళీ ఉండాల్సి వస్తుంది. అలాగే మీ జీవితం కూడా ఒక ఆధ్యాత్మిక పాఠశాల లాంటిదే. మీలో ఎంత

మంచి మార్పు వచ్చింది, ఎంత ఆత్మజ్ఞానం సంపాదిస్తామో దాని ఆధారంగానే తదుపరి జన్మ స్థాయి ఉంటుంది. మీ ఆలోచనలు, ప్రవర్తన, సాధనలో ఎదుగుదల లేకపోతే మళ్ళీ అదే రకమైన జన్మను తీసుకుని అదే పాఠాలను నేర్చుకోవాల్సి వస్తుంది.

మీలో ఎంత ఎక్కువ మార్పు సాధిస్తే, అంత ఉన్నత స్థితికి చేరుకుంటారు. లేకపోతే మళ్ళీ అదే స్థాయిలో జన్మలు కొనసాగుతాయి. కాబట్టి జీవితంలో కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా, అవి కూడా మార్పుకు సంకేతాలని గుర్తుంచుకోండి. అవే ఆధ్యాత్మిక ఎదుగుదలకు మార్గాలు. ధ్యానం, జ్ఞానం ఇవి మనిషిని సాధారణ స్థితి నుంచి గొప్ప స్థితికి తీసుకెళ్తాయి. మీరు ఈ మార్గంలో ఉన్నారంటే, మీరు నిజంగా అదృష్టవంతులు.


**తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే**

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# “ఇతరులలో లోపాలు కనిపిస్తున్నాయి అంటే, నీలో లోపం ఉందనే లెక్క.”

మీరు గమనించినట్లయితే ముగ్గురు వ్యక్తులు కలిసినప్పుడు అక్కడ లేని నాలుగో వ్యక్తి గురించి మాట్లాడుకుంటారు. సహజంగా ఏమి మాట్లాడతారు? వారిలో లోపాల గురించే మాట్లాడుతారు. ఎవరిని చూసినా మనకు ఇదే కనిపిస్తూ ఉంటుంది. ఇంట్లో కూడా భార్యాభర్తల మధ్య కూడా ఇలాగే ఉంటుంది.

పత్రి గారు మనకు చాలా సార్లు చెప్పారు. “ఎవరినీ విమర్శించ వద్దు, ఎవరి గురించి నిర్ణయాలు చేయవద్దు” అని. విమర్శ అంటే ఎదుటి వారిలోని లోపాలను చెప్పుకోవడమే విమర్శ. అయినా ఎందుకు మాట్లాడుతూ ఉంటారు? పత్రి గారు వద్దన్నా కూడా మాట్లాడుకుంటూనే ఉంటారు.

నిజంగా ఇద్దరు కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడు, మూడో వ్యక్తి ప్రస్తావన రాకుండా మీరు మాట్లాడుకోగలిగితే, మీరు చాలా ఎదిగినట్టే లెక్క. మీరు మూడో వ్యక్తి ప్రస్తావన లేకుండా మాట్లాడగలరా? లేదా? అని పరీక్షించుకోండి.

ఇది మీరు గమనించండి. వాళ్ళ గురించి వారు మాట్లాడుకోరు, వారి ఇంటి గురించి మాట్లాడుకోరు, వారు చేసే పనుల గురించి మాట్లాడుకోరు. ఎంతసేపు ఇతరుల గురించే మాట్లాడతారు. ఇతరుల గురించి మాట్లాడితే ఏమి మాట్లాడుతారు? వాళ్ల గొప్పతనాన్ని మాట్లాడుతారా? అంటే కాదు, వారి లోపాలనే మాట్లాడుతారు. ప్రతి ఒక్కరిలో కూడా ఈ లక్షణం ఉంటుంది. ఎందుకు లోపాల గురించే మాట్లాడతారు? దానికి ముఖ్య కారణం మీలో లోపాలు ఉండడమే. మీ లోపాలే ఇతరుల్లో కనిపిస్తాయి. మీలో ఏలోపం ఉంటే, అదే లోపం ఇతరుల్లో కనిపిస్తూ ఉంటుంది. మీలో ఏలోపం లేకపోతే,

మీకు ఎవరిలోనూ లోపం కనిపించదు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుని పిలిచి లోకంలో ఎవరైనా చెడ్డవారు ఉంటే చూడమన్నప్పుడు, "నాకు ఎవరూ చెడ్డవారు కనిపించలేదు" అని అన్నాడు. దాని అర్థం ఏమిటంటే ఆయనలో చెడు లేకపోవడం వల్లే, ఆయనకు ఎవరూ చెడ్డవారు కనిపించలేదు.

అందుచేత మీకు ఎవరిలోనైనా లోపం కనిపిస్తే కచ్చితంగా మీలో లోపం ఉంది" అని అర్థం చేసుకోండి. మరి నీలో లోపాలు పెట్టుకుని, ఎదుటి వారిలో లోపాలు ఎందుకు ప్రస్తావిస్తున్నావు? దాని వల్ల నీకు ఏమిటి లాభం? నువ్వు మాట్లాడడం వల్ల వాడు మారిపోతాడా? వాడు తన లోపాన్ని సరిచేసుకుంటాడా? నువ్వు మాట్లాడుతున్న విషయం వాడికి తెలుసా? ఆలోచిస్తే, ఏమీ లాభం కనిపించదు.

ఇలా లోపాలు మాట్లాడుకోవడం వల్ల వచ్చే నష్టం ఏమిటంటే ఈ మాటలు మెల్లిగా విమర్శలకు దారి తీస్తాయి. పత్రి గారు స్పష్టంగా చెప్పారు **"నీ నోటి మాటే నీ నుదిటి వ్రాత"** అని. ఇక్కడ మీరు అర్థం చేసుకోవాలి మానవుడి చేతలే కాదు, మాటలు కూడా కర్మలే. అందుచేత ఆ రకంగా ఎదుటివారిని విమర్శించడం, వారి లోపాల గురించి మాట్లాడడం వల్ల నీ కర్మలను నువ్వే పెంచుకుంటున్నావు. అవి నీకు దుఃఖ రూపంలో ఫలితాన్ని ఇస్తాయి. అందుచేత ఎవరైనా సరే, ఎదుటి వారిని విమర్శించకూడదు. ఎదుటి వారిలో లోపాలు ఎత్తి చూపకూడదు, వాటి గురించి మాట్లాడకూడదు. ఇదే పత్రి గారు చెప్పారు. మరి ఎందుకు మాట్లాడుతున్నావు? ఈ ప్రశ్నను మళ్ళీ మళ్ళీ నీకు నీవే వేసుకుంటే నీ లోపం నీకు తెలుస్తుంది. నీ లోపం ఉన్నందుకే, ఇతరులలో లోపాలు కనిపిస్తున్నాయి. నీలో ఏ లోపమూ లేకపోతే, ఎవరిలోనూ నీకు లోపాలు కనిపించవు. అందుచేత ఈ చెడు లక్షణం నుంచి బయటపడాలి అంటే, ప్రతి ఒక్కరూ తమలో ఉన్న లోపాలను సరిచేసుకోవాలి. తమలో ఉన్న

లోపాలను సరిచేయాలంటే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చెయ్యాలి.

ధ్యానం ఎంత తీవ్రంగా చేస్తే, వారి మనసు అంత శుద్ధి అవుతుంది. మనసులోని చెడులు పోతాయి,లోపాలు పోతాయి, దోషాలు పోతాయి. అప్పుడు వారు ఎవరిని విమర్శించరు. ఎవరి గురించి పట్టించుకోరు.

ఒకవేళ ఏమైనా మాట్లాడినా, వారిలో గొప్పతనం గురించి మాట్లాడుకుంటారు. కానీ లోపాల గురించి మాట్లాడరు. అందుచేత ఎవరైనా సరే, ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానాన్ని తీవ్రంగా చేయాలి. ఎంత తీవ్రంగా చేయాలి అంటే మనసు శుద్ధి అయ్యే దాకా చేయాలి. అందుకే భీమవరం రావాలి అని కూడా చెప్తూ ఉంటాను. ఎందుకంటే, అలా గంటలు, గంటలు ధ్యానం మనకు అంత నిశ్శబ్ద వాతావరణంలో, అంత డిసిప్లిన్‌లో ఎక్కడా కుదరదు.

అందుకే భీమవరం ఒక్కసారి వచ్చినా, ఇంటికి వెళ్లిన తర్వాత ఎన్ని గంటలైనా తేలిగ్గా కూర్చుంటాడు. అందుచేత ఏది ఏమైనా మీకు ఒక చిన్న కష్టం కూడా రాకూడదు అంటే, మీలో చిన్న చెడు కూడా ఉండకూడదు.

మనసును శుద్ధి చేసుకునే ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేయాలి. సాత్వికమైన ఆహారం కూడా తీసుకోవాలి. అందుచేత గుర్తుపెట్టుకోండి ఈ మార్గంలో మీరు వచ్చినప్పుడు, ఆధ్యాత్మికంగా ఎదగాలి అంటే ప్రతి ఒక్కరిలో ఉన్న చెడు తొలగించుకోవాలి, దోషాలు లేకుండా చూసుకోవాలి. ఎప్పుడైతే మనసు శుద్ధంగా ఉంటుందో, మీరు ఎవరి గురించి చెడు మాట్లాడరు.

ఈ విషయం మొదట్లో పత్రి గారు చెప్పినప్పుడు, నేను ఆశ్చర్యపోయాను “ఓహో! మనం మాట్లాడుతున్నాం అంటే మనలో చెడు ఉందన్నమాట!” అని. మన చెడు సరి చేసుకోకుండా, ఇతరుల చెడు గురించి చెప్పుకోవడం. ఎందుకు? చెప్పుకుంటారు ఎందుకంటే “వాడు చెడ్డవాడు, నేను గొప్పవాడిని” అన్న భావం వల్ల. కానీ నిజానికి, అటువంటి చెడు మీలో

ఉంది కాబట్టే, అది మీకు ఇతరుల్లో కనిపిస్తుంది.

మీరు గమనించినట్లయితే ఒక దొంగకు అందరూ దొంగలుగా కనిపిస్తారు. బజార్లోకి వెళ్లినప్పుడు ఒక తాగుబోతుకు అందరూ తాగుబోతుల్లా కనిపిస్తారు. ఎలాంటి వారైతే, అలాంటి వారే కనిపిస్తారు. మంచివాడికి మంచివాళ్ళే కనిపిస్తారు.

అందుచేత బాగా గుర్తుపెట్టుకోండి ఇవి మీరు గుర్తుపెట్టుకున్నప్పుడు, ఏమైనా మాట్లాడుతున్నప్పుడు వెంటనే మీకు అర్థమవుతుంది. "ఏంటి? ఇంకా మాట్లాడుతున్నామా?" "నా లోపాలు ఇంకా పోలేదా?" "నా సాధన సరి పోలేదా?" "ఇంకా తీవ్రంగా చేయాలా?" ఇలాంటి ఆలోచనలు మీలో వెంటనే రావాలి, వాటిని సరిచేసుకోవాలి.

అందుచేత ఇది చాలా ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోకపోతే, ఆచరణలోకి రాకపోతే, సహజ స్వభావం కాకపోతే మీరు ఇంకా ఎదగనట్టు. ఎంత ధ్యానం చేసినా, "నేను ఎదిగాను" అని అనుకున్నా ఈ చిన్న విషయాన్ని సరిచేయకపోతే, పెద్ద విషయాలు ఎలా సరిచేస్తారు? ఎదుటి వారిలో లోపం ఉంటే మీకు ఏం పని? మీలో లోపం ఉంటే దాన్ని సరిచేసుకోవాలి, అదే మీకు లాభం.

మీ లోపాలను ఉంచుకుని ఎప్పుడూ ఎదుటి వారి గురించి ఆలోచించడం ఎందుకు? అందుచేత ఈ విషయం మీద చాలా సీరియస్‌గా ఆలోచించాలి. పత్రి గారు చెప్పినట్టు "నో కామెంట్, నో జడ్జిమెంట్" అనేది అలవాటు చేసుకోవాలి. ఇది అర్థం చేసుకున్నవాడు ఆధ్యాత్మికంగా చాలా ఎదుగుతారు. ఏది ఏమైనా చివరికి  ఎవరైనా సరే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాల్సిందే అన్న సంగతి అర్థమవుతుంది.

# “అంతా ఒక్కటే”

ముఖ్యమైనవి అంటే అన్నింటికంటే గొప్పవి, తెలుసుకోవలసినవి, ఆచరించవలసినవి, మర్చిపోకూడనవి అని తెలుసుకోవాలి. ఇప్పుడు మనం వివరించుకోవలసిన సందేశం...

**“అంతా ఒక్కటే”**

ఇది తెలుసుకునే దాకా, ఇది ఆచరణలోకి వచ్చేదాకా మీరు మోక్షం పొందలేరు, జన్మలేని స్థితికి చేరుకోలేరు, మీ లక్ష్యాన్ని సాధించలేరు, మీ గమ్యాన్ని చేరుకోలేరు, మీకు నిర్దేశించబడిన పూర్ణాత్మ స్థితి పొందలేరు. మీరు చావు పుట్టుల చక్రంలో, కర్మ చక్రంలో పడి నలిగిపోతూ ఉంటారు. ఎలా నలిగిపోతారు అంటే గ్రైండర్‌లో పప్పు వేస్తే ఆ పప్పు ఎలా నలుగుతుందో, జన్మలు తీసుకుని తెచ్చుకున్న కర్మలు అనుభవిస్తూ దుఃఖంలో మీరు నలిగిపోతూ ఉంటారు. లేకపోతే తిరగలిలో పడిన గింజలలా పిండి పిండి అయిపోతూ ఉంటారు. ఏమిటి ఈ బ్రతుకు ఇలా అయిపోయిందని అనుకుంటారు, ఎన్ని అనుకున్నా మీరు అనుభవించవలసిందే!

కానీ “అంతా ఒక్కటే” అన్న సత్యాన్ని తెలుసుకున్నవారు కాదు, అనుభవపూర్వకంగా తెలుసుకొని ఆచరిస్తున్న వారు. అంటే “అంతా ఒక్కటే” అన్నట్టుగా జీవించే వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే తిరగలి మధ్యలో ఒక ఇరుసు ఉంటుంది, ఇనుప ఇరుసు. తిరగలిలో పడిన గింజల్లో కొన్ని గింజలు ఆ ఇరుసు దగ్గర ఉండిపోతాయి. ఆ తిరగలిని ఎన్నిసార్లు తిప్పినా ఆ ఇరుసు దగ్గర ఉన్న గింజలకు ఏమి జరగదు, అలాగే ఉంటాయి.

అలాగే “అంతా వేరు వేరు” అన్నట్టుగా జీవిస్తే తిరగలిలో పడిన గింజలలా అయిపోతారు. “అంతా ఒక్కటే” అన్నట్టుగా జీవించగలిగితే ఇరుసు దగ్గర ఉన్న గింజలలా క్షేమంగా ఉంటారు. మీరు నలగాలి అనుకుంటే జీవితంలో అంతా వేరు వేరు అన్నట్టుగా జీవించండి, మీరు నలగకూడదు

అనుకుంటే అంతా ఒక్కటే అన్న స్థాయికి ఎదగండి. ఇది చెప్పినా కూడా చాలామందికి అర్థం కాదు. "మేము కోటీశ్వరులుగా పుట్టాము, పెద్ద బంగళాలో ఉంటున్నాము, కారులో తిరుగుతున్నాము, గొప్పగా జీవిస్తున్నాము, ఎన్నో సుఖాలు అనుభవిస్తున్నాము కానీ వాడు లేని వాడిగా పుట్టాడు, వాడు కష్టాలు అనుభవిస్తున్నాడు, వాడు మేము ఒక్కటే ఎలా అవుతాము?" అని అంటారు.

ఇప్పుడు ప్రపంచం అంతా కూడా ఇదే అభిప్రాయంతో ఉంది. ఆ దేశం వేరు, మా దేశం వేరు అనుకోవడం వల్లే యుద్ధాలు జరుగుతున్నాయి. వారి మతం వేరు, మా మతం వేరు అనుకోవడం వల్లే మత ఘర్షణలు జరుగుతున్నాయి. చర్చీలు కూల్చుకోవడం, గుళ్ళు, ఆలయాలు కూల్చుకోవడం, కొట్టుకోవడం, ప్రాణాలు తీసుకోవడం, ఎప్పుడూ ద్వేషంతో ఉండడం, శత్రుత్వం వహించడం, మతం కోసమే జీవించడం, ఆ మతం కోసం ఏదైనా చేయడం ఇవన్నీ అంతా వేరు వేరు అనుకోవడమే.

ప్రపంచంలో ఇప్పుడు మతాల ఆధారంగా రాజకీయాలు నడుస్తున్నాయి. ఒక మతానికి చెందిన నాయకుడు వస్తే మిగతా మతాల వారిని హింసిస్తారు. మరో మతానికి చెందిన నాయకుడు వస్తే మిగతా వారిపై ఆధిపత్యం చూపిస్తారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదాలతో ఎన్నో గొడవలు జరుగుతున్నాయి. దీనివల్ల భయం భయంగా జీవిస్తున్నారు. ఇది "అంతా వేరు వేరు" అనుకోవడం వల్లే.

అలాగే కులాల మధ్య భేదాలు, ప్రాంతీయ భేదాలు, కుటుంబ భేదాలు ఇవన్నీ కూడా అంతా వేరు వేరు అనుకోవడం వల్లే. చూడండి అమెరికా, ఇరాను వేరు వేరు అనుకోవడం వల్లే, అమెరికా క్రిస్టియన్ దేశం, ఇరాన్ ముస్లిమ్ దేశం ఎంత యుద్ధం చేస్తున్నారు. వాళ్ళ దగ్గర ఉన్న ఆయుధాలు అయ్యే దాకా యుద్ధం చేశారు, నాశనం చేసుకున్నారు. అమెరికా స్థావరాలని ఇరాన్ నాశనం చేసింది, ఇరాన్ దేశాన్ని అమెరికా నాశనం చేసింది.

ఎంతో వైభవంగా పెద్ద పెద్ద ఆకాశ హర్మ్యాలని నిర్మించుకొని నివసిస్తున్న ఇరాన్ దేశంలో బాంబులు పడడం వల్ల అవన్నీ సర్వనాశనమై వాళ్ళంతా రోడ్డున పడ్డారు. కోట్లు సంపాదించిన వాళ్ళు కూడా ఎన్ని బాధలు పడ్డారో ప్రత్యక్షంగా చూస్తున్నాం. రష్యా, ఉక్రెయిన్ లో జరిగిన యుద్ధం చూడండి ఎంత నాశనం చేసుకున్నారు. వాళ్ళు మళ్ళీ మామూలు స్థితికి రావాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఒక్కసారి ఆలోచించండి. మనకి ఒక గంట కరెంట్ ఆగితే ఎన్ని ఇబ్బందులు పడతాం, ఎన్ని ఆప సోపాలు పడతాం. బయట ఎంత ఎండగా ఉన్నా ఆ కరెంట్ ఉండడం వల్ల ఏసీలు వేసుకుని హాయిగా ఉంటున్నాం. అదే చైనాకి ఇండియాకి యుద్ధం వచ్చి ఆ బాంబులు పడితే బ్రిడ్జీలు కూలిపోయి, బిల్డింగులు పడిపోయి వాళ్ళంతా రోడ్డు మీద పడి తినడానికి కూడా తిండి లేక ఎలా బాధలు పడవలసి వస్తుందో ఆలోచించండి! అంతా వేరు వేరు అనే అభిప్రాయం ఉంటేనే అలా జరిగే అవకాశం ఉంది.

కానీ సృష్టిలో "అంతా ఒక్కటే, అంతా నేనే" అన్న సత్యాన్ని మీరు తెలుసుకుంటే ఇన్ని గొడవలు, ఇన్ని శత్రుత్వాలు, ఇన్ని యుద్ధాలు ఉండవు. శరీరాలు వేరు వేరుగా కనిపిస్తాయి కానీ అందరూ ఆత్మలే, అందరూ ఒకటే. ఈ సత్యాన్ని తెలుసుకోవడం చాలా కష్టం, కానీ జ్ఞానం వచ్చినప్పుడు అర్థమవుతుంది. ధ్యానం చేస్తున్నా కూడా జ్ఞానం లేకపోతే ప్రవర్తన మారదు.

ఎంత ధ్యానులైనా కులాల గురించి ఆలోచిస్తారు, ఒకరు అంటే ఇంకొకరికి పడదు. ఎన్ని సంవత్సరాల నుంచి ధ్యానం చేస్తున్నా ద్వేషభావం పోదు, ఒకరిని ఇంకొకరు విమర్శించుకుంటారు.

పైకి అందరూ ఆత్మలే అంటారు, కాని వేరు, వేరు అన్నట్టుగానే విమర్శించు కుంటారు. దీనికి ముఖ్యకారణం ధ్యానం చేస్తున్నారు కాని, జ్ఞానం లేకపోవడమే!

అందరూ ఒకటే కదా? అందరూ మానవులే కదా? అందరూ ఆత్మలే కదా? అన్న ఆలోచన ఉండదు. అసలు ఎందుకు ధ్యానం చేస్తున్నారో కూడా

తెలియదు. కాని ధ్యానం చేసేది "అంతా ఒక్కటే" అన్న స్థితికి ఎదగడానికి.

నిజంగా మీరు "అంతా ఒక్కటే" అని తెలుసుకున్న రోజున ఎవ్వరినీ ద్వేషించరు, ఎవ్వరినీ మోసం చేయరు, ఎవరికీ అన్యాయం చేయరు, ఎవ్వరినీ కష్టపెట్టరు. వీలైనంత వరకు అందరికీ సేవ చేస్తారు, ఉపకారం చేస్తారు, మంచి చేస్తారు. ఈ స్థితికి మీరు వచ్చిన రోజున మీరు దైవత్వాన్ని పొందినట్టే.

గుడికి వెళ్ళడం, చర్చికి వెళ్ళడం, మసీదుకి వెళ్ళడం కంటే ఈ స్థితి పొందడం ముఖ్యమైనది. భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు ఇవన్నీ ఇదే సత్యాన్ని చెబుతున్నాయి. అందరినీ సమానంగా చూడగలిగినవాడే నిజమైన జ్ఞాని. అందుచేత ప్రతి ఒక్కరూ ధ్యానం ద్వారా ఈ స్థితికి ఎదగాలి. ఈ స్థితి వెంటనే రాదు, కానీ నెమ్మదిగా మార్పు వస్తుంది. అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తీవ్రంగా చెయ్యండి. భీమవరంలో జరిగే 3 రోజుల "ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరంలో " పాల్గొని, జ్ఞానవంతులై "అంతా ఒక్కటే" అన్న సత్యాన్ని ఆచరణలోకి తెచ్చుకోండి.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# “అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి?”

లోకంలో అందరూ ఎంతసేపు జరుగుతున్న ఈ జీవితానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ చనిపోయిన తర్వాత కూడా మీరు ఉంటారు, ఆ జీవితం గురించి కూడా మీరు తెలుసుకోవాల్సింది ఉంది. దాని తర్వాత ఇంకొక జన్మ వస్తుంది, ఆ జన్మలో కూడా ఇప్పుడు చేసుకున్న దాన్ని బట్టే ఆ భవిష్యత్ జన్మ ఆధారపడి ఉంటుంది.

నిజంగా మీరెవరు దేహాలు కాదు, అందరూ ఆత్మలే. ఆత్మలైన మీరు ఆత్మలాభం కోసం చేయవలసిన పనులు చేస్తే అది భవిష్యత్తుకు ఎంతో లాభిస్తుంది, ఆత్మ ఉన్నతికి తోడ్పడుతుంది అని చెప్పుకున్నాం.

ఇది అర్థమైన వాళ్ళకు ఆత్మ కోసం ఏదో చేసుకోవాలి! అనే తపన ఉంటుంది. కానీ సంసారము, ఉద్యోగము, కుటుంబ వ్యవహారాలు, అనుకోని సమస్యలు భౌతికమైన అవసరాలు, మమకారాలు, బంధాలు, బాధ్యతలు వీటన్నిటి వల్ల చెయ్యాలని అనుకున్నా చెయ్యలేక పోతున్నారు.

చాలామంది అంటూ ఉంటారు, మాకు చెయ్యాలని ఉంది కానీ చెయ్యలేకపోతున్నాం అని. నేనేమంటానంటే ఎంత చెయ్య లేకపోయినా, అవకాశం ఉన్నంత మేర, మీకున్న ఖాళీని ఆత్మ కోసం, ఆత్మ లాభం కోసం కృషి చేయండి అంటాను.

అప్పుడు ఈ జన్మలో ఏ ఆటంకాలు, అవరోధాలు అయితే మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయో! వాటి వల్ల చెయ్యాలని అనుకున్నా చెయ్యలేక పోయినా ఖచ్చితంగా మీ భవిష్యత్తు జన్మ అనుకూలమైన జన్మ లభిస్తుంది, అటువంటి ఇబ్బందులు ఉండవు.

ఇప్పుడు మీకు సంసార పరంగా ఇబ్బందులు ఉండొచ్చు , ఎంత చేద్దాం అనుకున్నా! భార్య వల్ల భర్తకు, భర్త వల్ల భార్యకు కూడా ఇబ్బందులు

ఉన్నాయి.

చెయ్యాలనుకున్నా చెయ్యలేకపోతూ ఉండొచ్చు. అలాగే పిల్లల వల్ల కూడా చాలా మంది చెయ్యాలనుకున్నది చెయ్యలేకపోతూ ఉండొచ్చు. కానీ ఎన్ని ఉన్నా మీ పట్టుదల వదలకుండా ఉన్నంతలో చెయ్య గలిగినంత చేస్తూ ఉంటే, అది ఖచ్చితంగా మీ భవిష్యత్ జన్మకి ఎంతో సహకరిస్తుంది.

అంటే ఇప్పుడు మీరు చేసుకున్నది వృధా కాదు. ఇప్పటికీ మీలో చాలామంది కొన్ని సంవత్సరాల నుంచి భీమవరం వస్తూ, ఎంతో జ్ఞానాన్ని నేర్చుకుంటూ, జ్ఞానపరంగా ఎదగడానికి, బుద్ధిని పెంచుకోవడానికి, ఎంతో కృషి చేస్తున్నారు. ప్రపంచం అంతా దేహం కోసం చేస్తూ ఉంటే మీరు మాత్రం ఆత్మ కోసం చేస్తున్నారు నిజంగా మీరు చాలా అదృష్టవంతులు.

అంతే కాదు నెలకు ఒక్కసారి ఈ మూడు రోజులు క్లాసు ఉన్నా, ప్రతిరోజు మార్నింగ్ జూమ్ లో మీరు పాల్గొంటూ ఆత్మకు లాభించే ఎంతో జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. చెప్పిన విషయాలు, సూచనలు, మెళుకువలు నోట్ చేసుకుంటూ ఆచరించే ప్రయత్నం చేస్తున్నారు.

గొప్ప గొప్ప వాళ్ళ సందేశాల ద్వారా ఎన్నో విషయాలు తెలుసు కుంటున్నారు. బ్రేక్ లేకుండా భీమవరం రమ్మంటే వస్తున్నారు. జూమ్‌లో వీడియోలు ఆన్ చేయమంటే ఆన్ చేస్తున్నారు, అంటే చాలా శ్రద్ధ కనపరుస్తున్నారు. అందుచేత ఖచ్చితంగా ఎదుగుతారు, ఇంత శ్రద్ధ ఉంటే జ్ఞానం ఎందుకు పెరగదు!

ఈ మధ్యనే ఒక గొప్ప ఎన్లైటెన్మెంట్ మాస్టర్ సందేశాన్ని నేను చదవడం జరిగింది. ఆ సందేశం నన్ను ఎంతో ఆకర్షించింది. ఈ ప్రపంచంలో నేను దేహం అని అనుకుంటూ బ్రతికే వారి గురించి ఆయన ఒక గొప్ప సందేశం ఇచ్చారు. ఏమిటంటే! ఆ సందేశం.

**"అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి"?**

ఈ ఒక్కవాక్యంలో ఎంత అర్థం ఉందండి. **"అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి?"** ఇది అర్థమవ్వాలి అంటే! ముందు నేను ఆత్మ అన్నది తెలుసుకోవాలి. అంటే ఆత్మైన మీ గురించి ఆయన సంబోధిస్తూ ఈ వాక్యం చెప్పడం జరిగింది. "మీకు దక్కింది ఏమిటి?" మీకు అంటే ఇక్కడ ఆత్మ.

అందరి కోసం బ్రతికినా, అన్నారు. ఇప్పుడు మీరంతా బ్రతికేది ఎవరికోసం? అంటే నిజంగా మీరు బ్రతుకున్నది అందరి కోసం. మీ పిల్లల కోసం, తల్లిదండ్రుల కోసం, దగ్గర బంధువుల కోసం బ్రతుకుతున్నారు, మీ జీవితమంతా వెచ్చిస్తున్నారు. ఇలా ఒక్కొక్కరి కోసం బ్రతుకుతున్నారు.

ఏమండీ! పుట్టినప్పటి నుంచి కుటుంబం కోసం, పిల్లల కోసం బ్రతికారు కదా? అందరి కోసం బ్రతుకుతున్నారు. అందరి కోసం కష్టపడుతున్నారు, సంపాదిస్తున్నారు. అన్ని సమమకూర్చుకున్నారు, అందరినీ సుఖపెట్టాలని జీవితమంతా కష్టపడుతున్నారు. ఇలా అందరి కోసం బ్రతికినా నిజంగా మీ కోసం మీరు బ్రతుకుతున్నారా? అంటే బ్రతకట్లేదు. మీరు అంటే 'ఆత్మ' అంటే ఆత్మ కోసం బ్రతకట్లేదు.

**"వచ్చింది మీ కోసం బ్రతుకుతున్నది అందరి కోసం"** అన్నారు జిడ్డు కృష్ణమూర్తి గారు.

పిల్లలు ఉంటే పిల్లలు, మనవలు ఉంటే మనవలు కోసం. ఆత్మను కూడా త్యాగం చేస్తారు. ఆత్మను త్యాగం చేయడం అంటే తనని తాను త్యాగం చేసుకొంటూ, బ్రతుకుతున్నారు, బాగానే ఉంది. ఆయన ఏమని ప్రశ్నిస్తున్నారు అంటే! సరే బ్రతికావు. అసలు నీకు దక్కింది ఏంటి?

పైకి వెళ్లాక అడుగుతారు అందరి కోసం బ్రతికావు, ఎన్నో చేశావు, ఎన్నో సాధించావు, ఎన్నో సంపాదించావు, ఎన్నో పోగేశావు, ఆత్మ అయిన

నీకు  దక్కేది ఏమిటి? అంటారు.

ఇన్ని చేసి పైకి వెళ్ళాక అర్థమవుతుంది. పైన వాళ్ళు ఇదే ప్రశ్న వేస్తారు, నాయనా! ఒక జీవితం జీవితం అంతా బ్రతికావు,అందరి కోసం బ్రతికావు, అందరి కోసం ఎన్నో చేశావ్. నీకు ఏం దక్కిందిరా? అంటారు.

ఒకావిడ మొగుడు కోసం బ్రతికానంటుంది, ఒకడు పెళ్ళాం కోసం బ్రతికానంటాడు, ఒకడు పిల్లల కోసం అంటాడు. మీకు కావాలంటే భీమవరం రానోళ్ళందరిని అడగండి, ఏదో ఒక కారణం చెప్తారు.

అందుచేత మీరు ఏ పని చేస్తున్నా, ఏమి సంపాదిస్తున్నా,ఏమి సమకూర్చుకుంటున్నా, ముందు ఒక ప్రశ్న వేసుకోవాలి. ఇది నాకు లాభమా? నాకు అంటే ఆత్మకు లాభమా? దేహానికి లాభమా? అని. కానీ ఈ ప్రశ్న నేను చాలా సార్లు వేసుకుంటున్నాను, ఇప్పటికీ వేసుకుంటాను. ఒకవేళ వెళ్ళడానికి బద్ధకించినా ఈ ప్రశ్న వేసుకుంటే మటుకు ఇంటి దగ్గర ఉండ బుద్ధి కాదు.

మీరు దేహం అనే నేను ఒకటి ఉంది, ఆత్మ అనే నేను ఒకటి ఉంది. ఈ రెండు నేనుల్లో అసలు నేను ఎవరు? అన్నది తెలుసుకోవాలి. దేహం నేను అనుకుంటే కిరాణ కొట్టులో కూర్చోవాలి, ఆత్మ నేను అనుకుంటే జూమ్ లోకి రావాలి, భీమవరం రావాలి.

నేను మటుకు పత్రి గారు పరిచయం అయ్యేదాకా దేహం నేను అన్నట్టుగానే జీవించాను. పత్రి గారు పరిచయం అయిన తర్వాత అసలు నేను గురించి తెలిసింది. మొదట్లో కొంచెం ఇబ్బంది అయింది.

కానీ మెల్లిగా గాలి వేస్తే మేఘాలు విడిపోయినట్టు అర్థమైంది? అంటే ఈ మేను నేను కాదు, ఈ మేనులో ఉన్న అసలు నేనే "నేను" అని బాగా అర్థమయింది. అప్పటినుంచి ఈ మేను అనే నేనుకు ప్రాముఖ్యం తగ్గించి అసలు నేనే నేను అన్నట్టుగా జీవించడం మొదలు పెట్టాను. అందుచేత అందరి

కోసం మీరు బ్రతికినా ఏమి చేసినా, సంపాదించినా ఒక్కటి మీకు దక్కదు.

ఈ విషయం పైకి వెళ్లాక తెలుసుకుంటే ఏ ప్రయోజనం లేదు, జీవించి ఉండగానే మీరు తెలుసుకోగలిగితే మీరు అంటే ఆత్మ ధన్యమైనట్టే. ఇది అర్థం చేసుకొని కనీసం ఇప్పటి నుంచి అయినా మేనుకు ప్రాముఖ్యం తగ్గించి అంటే అవసరాలకు పరిమితం అవ్వడం, మేనుకు ప్రాముఖ్యం తగ్గించి 'నేను'కు ప్రాముఖ్యం ఇవ్వండి.

23 ఏళ్ల క్రితం పత్రిగారు పరిచయం అయ్యాక నేను ఆత్మ అని తెలుసుకున్నాక, చాలా బాధపడడం జరిగింది. అప్పటికి నాకు 53 సంవత్సరాలు ఎంత జీవితం వృధా అయిపోయింది. మేను పరంగా చూస్తే కోట్లే సంపాదించాను, నేను పరంగా చూస్తే 53 సంవత్సరాలలో సంపాదించింది జీరో.

నాకు మొదటి నుంచి కూడా, అంటే ధన సంపాదన చేస్తున్నప్పుడు సమయం వృధా చేసేవాడిని కాదు. అందుచేత ఎంత డబ్బున్నా ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకునే వాడిని కాదు. ఇంటి దగ్గర ఉంటే వర్కర్స్ పని చేయకపోతే ఎంత నష్టమో అనిపించేది. వచ్చే డబ్బులు పోతాయి, వచ్చే ధనం పోతుంది అనిపించి వెంటనే బయలుదేరి వెళ్ళేవాడ్ని.

ఇప్పుడు కూడా అదే అలవాటయ్యింది ఎప్పుడైనా బద్ధకించి పడుకుందాము అంటే సంపాదించుకునే జ్ఞానం పోతుందేమో అనే భయంతో నాన్ స్టాప్ గా తిరుగుతూనే ఉంటాను. అప్పుడు ధనం కోసం తిరిగేవాడిని, ఇప్పుడు జ్ఞానం కోసం తిరుగుతున్నాను. పిల్లలు  ఇంటి దగ్గర మీకు ఏం లోటు?  ఇలా రైళ్ళలో తిరగకపోతే హాయిగా పడుకోవచ్చు కదా? అన్ని సౌకర్యాలున్నాయి, ఏ ఇబ్బంది లేదు అని అంటారు. కానీ మాకు అలా ఇష్టం వుండదు.

నన్ను చూసి మేడం కూడా తిరగడం మొదలు పెట్టింది. ఆవిడ అంతే! ఏమండీ మీ అందరికీ ఎప్పుడైనా ఆ ఆలోచన వచ్చిందా? జీవితంలో సుఖపడదాము అంటే ఎప్పుడైనా ఎవరికైనా వీలువుతుంది అంటారా? తన్ని పెట్టుకుని పడుకుందాం అంటే వీలవుతుందా?

చదువు, చదువు అంటారు. ఎలిమెంటరీ స్కూల్ అయిపోయాక హైస్కూలు. హై స్కూల్ అయిపోయాక కాలేజీ, కాలేజీ అయిపోయాక పోస్ట్ గ్రాడ్యు యేషన్. అదీ అయిపోయాక ఉద్యోగం, అదీ అయిపోయాక పెళ్లి. పెళ్లి అయ్యాక మళ్ళీ పిల్లలు. ఏంటో ఎవరికీ పడుకోవడానికి అవకాశం లేదు.

ఏవో దేహం నేను అనుకుంటే ఏమన్నా కొంతసేపు పడుకుంటామేమో కానీ ఆత్మ నేను అనుకుంటే మటుకు అసలు పడుకోలేరు. పత్రిగారిని చూస్తున్నాం కదా? అలా తిరుగుతూనే ఉండేవారు. ఏదో పని చేస్తూనే ఉండేవారు. అందుచేత ఈ వాక్యంలో అంటే **"అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి?"** అన్న దానిలో ఎంత అర్థం వుందండి.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# “ఇతరులు ఏదో అనుకుంటారని ఏదీ చేయకూడదు”

ఇతరులు ఏదో అనుకుంటారని ఏది చేయకూడదు. ఎందుచేతనంటే ఎన్నో పనులు చేస్తూ ఉంటాం. ఏ పని చేస్తున్నా ఆ పని చేసేటప్పుడు మీ స్తోమత చూసుకోవాలి. దాన్ని బట్టి మీరు ఆ పని చేసినప్పుడు మీకు ఏ ఇబ్బందులు రావు.

వాళ్ళు ఏదో అనుకుంటారని వీళ్ళు ఏదో అనుకుంటారని మీ ఆర్థిక స్థితి మించి మీరు చేసినట్లయితే కష్టాల పాలయ్యేది మీరే. ఏ చిన్న పని చేసినా కూడా ఇతరులు ఏమనుకుంటారో అని చేస్తూ ఉంటారు. చిన్న ఫంక్షన్ పెట్టి భోజనాలు పెట్టినా ఒక స్వీట్ అయినా వేయకపోతే ఏమనుకుంటారో అని భయం.

ఒక స్వీట్ చేశారు, వాళ్ళు రెండు వేశారు మనం ఒకటి వేస్తే ఏమనుకుంటారు అని చేసేవాళ్ళు ఉన్నారు. చందాలు ఇచ్చేటప్పుడు కూడా ఇవ్వకపోతే బాగోదేమో వాళ్ళు ఏమనుకుంటారో అనే మొహమాటంతో ఇచ్చి తర్వాత బాధపడతారు. సేవ చేయ్యొచ్చు మంచిదే! చేయాలి కూడా! మీకు వున్నంతలో చేయండి పర్వాలేదు.

ఇతరులకు ఇవ్వడం వల్ల అది సద్వినియోగం అవుతుందా? లేదా? అన్నది మనకు తెలియదు. అది సద్వినియోగం అవ్వకపోతే, అపాత్రదానం అవుతుంది. చాలా కొద్దిమందే వచ్చిన దాన్ని సద్వినియోగం చేస్తారు. లోకంలో ఎక్కువమంది ఈ రోజుల్లో స్వార్థంతో చేసేవాళ్ళే కనిపిస్తున్నారు

వాడేమనుకుంటాడో! వీడేమనుకుంటాడో! అని చేస్తే చేసిన దాని ఫలితం దక్కకపోగా అపాత్రదానం చేసినట్టు అవుతుంది. అందుచేత ఇది ఎప్పుడు మర్చిపోకూడదు. ఇతరులు ఏదో అనుకుంటారని ఏదీ చేయకూడదు.

గొప్పల కోసం ఖర్చు పెట్టే బదులు ఇతరులకు లాభించే లోక కళ్యాణ

కరమైన పనులకు ఖర్చు పెడితే ఆ ఫలితమైన మీకు వస్తుంది. అంతే కానీ ఇతరులు ఏదో అనుకుంటారని చేసింది ఫలితం రాకపోగా విలువైన మీ ధనాన్ని వృధా చేసుకున్న వారు అవుతారు.

మీరు చూడండి జనరల్‌గా వివాహ వేడుకలు ఎంత ఆర్భాటంగా చేస్తున్నారో! ఒకళ్ళకు మించి ఒకళ్ళు ఎంత డెకరేషన్, ఎంత ఖర్చు. మా పిల్లలు పెట్టే ఖర్చు చూస్తూ ఉంటాను. నాకు బయట ఎవరో అక్కర్లేదు మా ఇల్లే సరిపోతుంది పాఠాలు నేర్చుకోవడానికి,

ఎంత డెకరేషన్ చేస్తున్నారు అంటే పెళ్ళికి, మళ్ళీ రిసెప్షన్ అంటూ ఖర్చు పెడతారు. విచిత్రం ఏమిటంటే అన్ని లక్షలు ఖర్చు పెట్టి చేసింది తెల్లవారితే ఏమీ ఉండదు. మా పిల్లల్ని అడిగాను ఎందుకు ఇదంత దండుగ కదా? అంటే? మా అబ్బాయి గాని, మా అమ్మాయి గాని చెప్పిన సమాధానం వాళ్ళని అశ్రద్ధ చేశామని వారు అనుకోకూడదనే మా ఉద్దేశ్యం అని.

కంపారిజన్‌తో, వాళ్ళు ఏదో అనుకుంటారని భోజనాలు పెట్టారు ఆకు 1500, 2000 అట. నేను అక్కడ గమనించాను వీళ్ళు తినేవన్నీ ఒక ప్లేట్ లో పెట్టుకొని తిన్నారనుకోండి. అప్పుడు దాని కాస్ట్ ఎంత ఉందో వీళ్ళకి తెలుస్తుంది. అన్ని ఐటమ్స్‌లో ఎన్ని తినగలరు? అన్ని ఆ ప్లేట్లో పెట్టుకోవాలి. ఆ కాస్ట్ ? 200 మించి ఉండదు. దానికి 2000 అట. వాడు ఊరికే డెకరేషన్ గా స్టాల్స్ పెడతారు, కానీ అన్ని తినేస్తారా? అంటే ఎక్కడ తినగలరు? మరి ఏంటో ఇది. మా చిన్నప్పుడు చేసే పెళ్ళిళ్ళు రెండు స్వీట్లు వేస్తే ఎక్కువ.

అలా మగపెళ్ళి వారు ఏమనుకుంటారో! ఆడపెళ్ళి వారు ఏమనుకుంటారో! అని ఆ శుభలేఖల నుంచి మొదలెడతారు. చూసుకోండి కావాలంటే! ముకేష్ అంబాని శుభలేఖ నాలుగు లక్షలు అట. ఏం చేస్తాడు? ఉన్న డబ్బులు ఏం చేయాలో తెలియక అలా ఖర్చు పెడతారు.

నాకు పిల్లలు ముగ్గురు, ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. వారి పెళ్ళికి శుభలేఖకు ఐదు రూపాయలు మించి నేను ఖర్చు పెట్టలేదు. ఎవరు

ఏమని అనుకున్నా నేను లెక్క చెయ్యలేదు. అలా ఖర్చు పెట్టుబడులు పది మందికి ఉపయోగపడే దానికి ఖర్చు పెడితే ఆ పుణ్యమైనా మనకి దక్కుతుంది అనుకోండి.

ఏది ఏమైనా ఇతరులు ఏమో అనుకుంటారని, ఏది చేయకండి, మీ అర్హతను బట్టి, మీ స్తోమతను బట్టి మీరు ఎంత చేయాలనుకుంటే అంత చేయండి. ఎవరి స్థాయికి తగ్గట్టు వాళ్ళు ఎంతో కొంత ఆదా చేసుకోవచ్చు. దాన్ని లోక కళ్యాణం కోసం ఖర్చు పెట్టండి.

"వృధాగా ఖర్చు చేసేదాన్ని పంచండి" అంతే. ఇవ్వడము అంటే పంచడము అంటే లోక కళ్యాణ పనులకి ఉపయోగించడం.

పత్రిగారి దగ్గర బాగా అర్థం చేసుకున్నాను. అంతా ఒకటే! మనం ఒక్కళ్ళమే బాగుండాలి అనుకుంటే అది స్వార్థము, అందరూ బాగుండాలి అనుకుంటే అది నిస్వార్థం.

మా ఇద్దరికీ ఇంకొక రకమైన సరదాలు, ఎంజాయ్‌మెంట్లు ఏమీ లేవు. మీరందరూ సంతోషంగా ఉంటే అదే మా సంతోషం, మీరందరూ ఆనందంగా ఉంటే అదే మా ఆనందం. అందుచేత ఇతరులు ఏదో అనుకుంటారని ఖర్చు పెట్టకుండా కొంత మీ లాభం కోసం అంటే లోక కళ్యాణం కోసం కేటాయించుకోండి. మీకు ఉన్నవన్నీ ఇవ్వక్కర్లేదు.

అలా ఎవడూ చెప్పడు? వృధా చేసేదాన్ని ఇవ్వండి చాలు. అదే ఎక్కువ. ఈ జన్మకి వృధా చేసేదాన్ని ఇతరుల కోసం ఖర్చు పెట్టండి. మరుజన్మ ఎటువంటి స్థితి మీకు వస్తుంది అంటే మీ జీవితాన్నే అంకితం చేస్తారు. మీరు జీవించేదే ఇతరుల కోసం జీవిస్తారు. ఆ స్థాయికి మీరు రాగలిగారు అంటే చివరి జన్మలకు వచ్చినట్టే!

ఈ జన్మలో మీరు చేసిన దాన్ని బట్టి! జీవించిన విధానాన్ని బట్టి! మరుజన్మ ఆధారపడి ఉంటుంది. ఎప్పుడూ మీరు ఇది గుర్తుపెట్టుకోండి. ఇది ఈ జన్మ అన్నది శాశ్వతం కాదు. మనం అది కూడా చెప్పుకున్నాం. ఏది

శాశ్వతం కాదు అని. ఖచ్చితంగా మరు జన్మ ఉంటుంది, మరు జన్మ ఇంకా గొప్పగా ఉండాలి.

ఈ జన్మలో పంచితేనే మరు జన్మ గొప్పగా ఉంటుంది. మీకు ఇవ్వబడిన, మీరు పొందిన వాటిలో అవసరాలకు ఉపయోగించుకొని ఇతరులు ఏమనుకుంటారో అన్నది లెక్క చేయకుండా ఆదా చేసింది ఇతరుల లాభం కోసం మీరు ఖర్చు పెట్టినప్పుడు ఖచ్చితంగా మరుజన్మ గొప్పగా ఉంటుంది.

ఇతరులు ఏమనుకుంటారో అని గొప్పల కోసం ఖర్చు పెడితే శుభ్రంగా తినేసి వెళ్ళేటప్పుడు చాలా బాగా చేశావురా అంటారు. కానీ బయటికి వెళ్ళి, వీడు బాగా బలిశాడురా అందుకే ఇలా ఖర్చుపెట్టాడు అంటారు.

కానీ ఈ రోజుల్లో ఇంతలా ఆలోచించే వాళ్ళు చాలా తక్కువ ఉంటారు. ఎవరికైతే బుద్ధి పరిపక్వం అవుతుందో అలాంటి వారు మాత్రమే ఈ రకంగా ఆలోచించగలుగుతారు.

పరిపక్వమైన బుద్ధి ఉంటే ఆధ్యాత్మికంగా ఆలోచిస్తారు, ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తారు. పరిపక్వత లేని బుద్ధి ఉన్నవారు ప్రాపంచిక భోగాల కోసం చూస్తారు, దేహం గురించి ఆలోచిస్తారు. అందుకే పత్రి గారు మీ బుద్ధి శాతం పెరిగే కొద్ది ఆధ్యాత్మిక ఆసక్తి ఎక్కువ ఉంటుంది.బుద్ధి శాతం తక్కువ ఉంటే ప్రాపంచిక ఆసక్తి వుంటుంది అంటారు.

అంతా బుద్ధిని బట్టే ఉంటుంది, చేసే ధ్యానాన్ని బట్టి బుద్ధి శాతం పెరుగుతూ ఉంటుంది. మీ బుద్ధి పెరిగే కొద్ది ఆ బుద్ధే మీకు గురువై మిమ్మల్ని నడిపిస్తుంది.

మీరు బుద్ధి పెంచుకునే కొద్ది ఇతరులు ఏమనుకుంటారో అని ఏదీ చేయరు, బుద్ధిని బట్టే మీరు నడుచుకుంటారు. మీ బుద్ధి తప్పుడు నిర్ణయం చేయదు, మీకు నష్టం కలిగించదు, మిమ్మల్ని సరైన విధంగా నడిపిస్తుంది.

# “వర్తమానంలోనే జీవించాలి”

సహజంగా 3 రకాల కాలాలు చెప్పుకుంటాం. 1. భూతకాలం అంటే జరిగిపోయిన కాలం. 2. వర్తమానకాలం అంటే జరుగుతున్న కాలం. 3. భవిష్యత్ కాలం అంటే జరగబోయే కాలం.

లోకంలోని మానవులు సహజంగా ఎక్కువ భూతకాలంలోనే జీవిస్తూ ఉంటారు. అంటే ఎక్కువగా జరిగిపోయిన వాటిగురించే ఆలోచిస్తుంటారు. అలాగే భవిష్యత్తు గురించి కూడా ఆలోచిస్తూ ఉంటారు. కానీ వర్తమానంలో జీవించేవారు చాలా తక్కువ.

పత్రి గారు ఒక గొప్ప మాట చెప్పారు, “వర్తమానమే బహుమానం” అని. ఈ మాటలో ఎంతో లోతైన అర్థం ఉంది. అందుకే ఆయన వర్తమానాన్ని మానవులకు ఇవ్వబడిన అత్యంత విలువైన బహుమానంగా వర్ణించారు. సహజంగా మానవుల మనసు ఎప్పుడూ ఒక చోట స్థిరంగా ఉండదు, కొంతసేపు గతంలో జరిగిపోయిన వాటి గురించి ఆలోచిస్తారు, కొంతసేపు భవిష్యత్తులో జరగబోయేవాటి గురించి ఆలోచిస్తారు, కాని వర్తమానంలో జీవించగలిగేవారు చాలా తక్కువ ఉంటారు.

ఎందుచేతనంటే గతంలో జరిగిపోయిన దుఃఖకరమైన సంఘటన లను గుర్తు చేసుకుంటే బాధపడుతూ అశాంతికి లోనవుతారు. అలా చేసి ఉంటే బాగుండేది, ఇలా చేసి ఉంటే బాగుండేది అనుకుంటూ బాధ పడుతుంటారు. విచిత్రం ఏమిటంటే ప్రస్తుతంలో ఎలాంటి సమస్యలు లేక పోయినా, జరిగిపోయిన విషయాలను మళ్లీ మళ్లీ తలుచుకుంటూ అశాంతికి లోనవుతారు, బాధపడుతూ ఉంటారు.

అలాగే భవిష్యత్తు గురించి కూడా ఆందోళన చెందుతూ ఉంటారు. అంటే జరగని విషయాలు జరుగుతాయేమోనని భయపడతారు, అవ్వని

విషయాలు అవ్వాలని ఆశలు పెంచుకుంటారు. ఇలా ఎవరిని చూసినా వర్తమానంలో ఉండకుండా, ఎప్పుడూ గతం లేదా భవిష్యత్తులోనే జీవిస్తూ ఉంటారు.

ఉదాహరణకు చాలామంది ఆడపిల్ల పుట్టిన వెంటనే, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలు పెడతారు. ఎలా పెళ్లి చేయాలి? ఎంత కట్నం ఇవ్వాలి? ఎంత ఖర్చు అవుతుంది? ఎంత సంపాదించాలి? అని ముందునుంచి ఆలోచిస్తారు. ఇలా తమ సమయాన్ని ఎక్కువగా భవిష్యత్తు గురించి, గతం గురించి ఆలోచిస్తూ జీవితాన్ని ఎంతో వృథా చేస్తున్నారు.

కానీ ఆ సమయాన్ని వర్తమానంలో ఉపయోగిస్తే చెయ్యవలసిన పనులు ఎన్నో చేయగలుగుతారు, సాధించవలసినవి సాధిస్తారు, భవిష్యత్తును బాగా తయారు చేసుకుంటారు. అందుకే పత్రిగారు వర్తమానాన్ని బహుమానంగా భావించ మంటారు. ఎందుకంటే గతంలో జరిగిపోయిన జీవితం గురించి మీరు చేయగలిగింది ఏమీ చేయలేరు. భవిష్యత్తులో ఏమి జరుగుతుందో మీకు తెలియదు. అసలు మీరు అప్పటికి ఉంటారో లేదో కూడా తెలియదు.

అందుచేత మీకు నిజంగా లాభం కలిగించేది వర్తమానమే! ఎందుకంటే ఏమి చేయాలనుకున్నా వర్తమానంలోనే మీరు చేయగలరు. ఎందుకంటే వర్తమానంలో మీరు చేసే పనులే మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. అందుకే "వర్తమానాన్ని బహుమానం" అన్నారు.

ఈ వర్తమానాన్ని మీరు సరిగ్గా ఉపయోగించుకుంటే, మీ భవిష్యత్తును గొప్పగా తయారు చేసుకోవచ్చు. అంతేకాదు మీ భవిష్యత్తును గొప్పగా మార్చే పనులు చేయడానికి అవకాశం ఉన్నది వర్తమానంలోనే.

గతం గురించి మీరు ఇప్పుడు ఏం చేయగలరు? అందుచేత దాని గురించి ఆలోచించడం ఎందుకు? గతం గురించి ఆలోచిస్తూ దానిని ఎందుకు

వృథా చేసుకోవాలి? ఇప్పుడు చేయవలసిన పనులను చేయండి. అవసరం లేని ఆలోచనలతో మీ వర్తమానాన్ని నాశనం చేసుకోకండి. "నా భవిష్యత్తు బాగుండాలి" అని అనుకోవడం మాత్రమే సరిపోదు. మీ భవిష్యత్తు బాగుండాలంటే, మీరు వర్తమానాన్ని సరిగ్గా ఉపయోగించాలి. సవ్యంగా జీవించాలి. మీ దృష్టి ఇప్పుడే చేస్తున్న పనుల మీద ఉంచాలి.

"నేను సరైన విధంగా జీవిస్తున్నానా?", "సరైన పనులు చేస్తున్నానా?", "నా భవిష్యత్తుకు లాభం కలిగించే పనులే చేస్తున్నానా?" అనే ప్రశ్నలపై దృష్టి పెట్టాలి.

అలా జీవించే వ్యక్తి భవిష్యత్తు తప్పకుండా మంచిదవుతుంది. మీకు మూడు రకాల భవిష్యత్తు ఉంది.

ప్రపంచంలో చాలా మంది భవిష్యత్తు గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. ఉదాహరణకు, "వృద్ధాప్యంలో ఎలాంటి లోటు లేకుండా జీవించాలి", "ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలి" అని అనుకుంటారు.

దానికి అనుగుణంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు వేస్తారు. ముఖ్యంగా తిండికి, బట్టకి, ఉండడానికి లోటు ఉండకూడదని చూస్తారు. దానికి అవసరమయ్యేది డబ్బు, అందుకే ఇప్పుడే సంపాదించే ప్రయత్నం చేస్తారు, డిపాజిట్లు వేస్తారు, స్థిరమైన ఆదాయం వచ్చే విధంగా వనరులు సృష్టించు కుంటారు. ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు అంటే, తమ భవిష్యత్తు సురక్షితంగా ఉండాలని. కానీ నేను చెప్పేది ఏమిటంటే ఇప్పుడు ఉన్నది మాత్రమే భవిష్యత్తు కాదు. మీరు చనిపోయిన తర్వాత కూడా మీకు ఒక జీవితం ఉంది.

ఇప్పుడు మీరు శరీరంతో ఉన్నారు. శరీరాన్ని వదిలిన తర్వాత, శరీరం లేకుండానే మీరు ఉంటారు. ఆ జీవితం కూడా బాగుండాలి, దాని గురించి కూడా ఆలోచించాలి. అంతేకాదు, అక్కడ కొంతకాలం ఉన్న తర్వాత

మళ్ళీ  కొత్తగా  జన్మ తీసుకుంటారు, అది కూడా మీ భవిష్యత్తే.

సహజంగా అంత దూరం వరకూ ఆలోచించరు. కాని ఈ జన్మలో మీ జీవితం బాగా లేకపోతే, మీరు ఎంత బాధపడతారు? ఎన్నో కష్టాలు వస్తున్నాయని, నేను ఏ జన్మలో చేసిన పాపమో! అని అనుకుంటారు.

మరి ఇప్పుడువున్న జీవితం కష్టంగా ఉన్నప్పుడు,  మీరు అలాగే అనుకుంటారు. "ఇది నేను గత జన్మలో చేసిన పాపమేమో?" అనుకుంటారు. అంటే, గతంలో ఆలోచించకుండా చేసిన పనుల ఫలితాలే ఇప్పుడు మీరు అనుభవిస్తున్న కష్టాలు. అందుకే మీరు భరించలేని పరిస్థితుల్లో, దుఃఖంలో ఉంటున్నారు.

ఎంతో మంది సమస్యలతో వస్తుంటారు. "జీవితం ఇలా అయి పోయింది, ఇప్పుడు ఏమి చేయాలి?" అని అడుగుతారు. కొంతమంది ఆర్థికంగా దెబ్బతిన్నవారు, కొంతమంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, కొంతమంది కుటుంబ సమస్యల వల్ల విడాకులు తీసుకున్నవారు ఇలా ఎందుకు జరిగిందని బాధపడుతుంటారు.

కానీ వారు ఎందుకు బాధపడుతున్నారు అంటే, గతంలో భవిష్యత్తు గురించి సరిగ్గా ఆలోచించకపోవడం వల్లే. వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తే, చనిపోయిన తర్వాత ఉండే భవిష్యత్తు గురించి ఆలోచించే పనేలేదు.

మళ్ళీ వచ్చే జన్మ గురించి కూడా ఆలోచించవలసిన పనిలేదు. అందుకే మీ భవిష్యత్తు బాగుండాలంటే,వర్తమానాన్ని సరిగ్గా ఉపయోగించు కోవాలి.

ఎందుకంటే ప్రతి ఒక్కరూ గతంలో చేసినదాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. ఇప్పుడు చేస్తున్నదాన్ని భవిష్యత్తులో అనుభవిస్తారు. అందుకే వర్తమానం మనకు ఇవ్వబడిన బహుమానం అంటారు. అంటే వర్తమానం

భవిష్యత్తును తీర్చిదిద్దుకునే గొప్ప అవకాశం. అందుకే పత్రి గారు **“వర్తమానమే బహుమానం”** అని అన్నారు. ఇప్పుడు చాలా మందికి జీవితం సరిగా ఉండదు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, కుటుంబపరంగా సమస్యలు ఉంటాయి. మారితే బాగుంటాది అనుకుంటారు.

కానీ మారాలి అంటే, భవిష్యత్తు మారాలి అంటే, వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీ భవిష్యత్తును మార్చుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉంది, దానికి వర్తమానమే మీకు ఇవ్వబడిన గొప్ప అవకాశం. అందుచేత మీరు ఆలోచించి, వర్తమానంలో ఎలా జీవిస్తే మీ జీవితం మారుతుందో తెలుసుకుని, దానికి అనుగుణంగా జీవిస్తే, కచ్చితంగా మీ భవిష్యత్తు మారుతుంది.

చాలామంది ఆర్థిక ఇబ్బందులు పడుతూ, “ఇంకా మారదా నా పరిస్థితి?” అని అడుగుతారు. “నా జీవితం అంతా ఇలా బాధపడాల్సిందేనా?” అని బాధపడుతారు. అందుకే నేను అందరికీ ఒకటే చెప్తాను ప్రస్తుతం మీకు ఉన్న అవకాశాన్ని ఉపయోగించండి. మీ వల్ల ఇతరులకు ఉపయోగపడే పనులు చేయండి, ఇతరులకు లాభం కలిగించే పనులు చేయండి, ఇతరులను ఆనందింపజేసే పనులు చేయండి. అలా చేస్తే, మీ భవిష్యత్తు జీవితం తప్పకుండా మారుతుంది

ఇప్పుడు మీ పరిస్థితి ఎలా ఉన్నా, దాని గురించి ఎక్కువగా బాధపడవద్దు. అది శాశ్వతం కాదు, తప్పకుండా మారుతుంది. ఇప్పుడే మీరు చేయాల్సింది ఒక్కటే మీ వల్ల ఎవరికీ హాని, నష్టం, కష్టం కలగకుండా జీవించాలి. అంతేకాదు, వీలైనంతమందికి ఉపయోగపడే పనులు చేయండి. అలా చేస్తే, మీ భవిష్యత్తు ఎంతో మంచిగా ఉంటుంది. ఎన్ని సమస్యలు వచ్చినా, ఎన్ని ఉపద్రవాలు జరిగినా, ఇలా జీవించే వారికి ఎలాంటి ఇబ్బంది

ఉండదు.

మీ భవిష్యత్తుకు ఎలాంటి ప్రమాదం ఉండదు. మీ భవిష్యత్ జీవితం గురించి మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈ రహస్యం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటే, మీ జీవితం తప్పకుండా వైభవంగా మారుతుంది.

"ఎలా జరుగుతుంది?", "నా బతుకు ఏమవుతుంది?", "నాకు ఏదైనా అయితే నన్ను చూసేవారు ఎవరు?", "నా పిల్లలే నన్ను పట్టించుకోవడం లేదు", "నేను మంచం మీద పడితే నా పరిస్థితి ఏమవుతుంది?" అని ఆందోళన పడే వారు కూడా చాలా మంది ఉన్నారు. కానీ ఆందోళన అవసరం లేదు. మీరు సరిగా జీవిస్తే, మీ భవిష్యత్తు ఎలాంటి లోటు లేకుండా మారిపోతుంది. మీరు మీ పనులను చేస్తూ, శాంతంగా జీవితాన్ని పూర్తిచేసుకుంటారు. ఏది ఏమైనా, మీరు అనుకున్నట్టు మీ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలంటే, వర్తమానమే అత్యంత గొప్ప మార్గం.

ఈ వర్తమానాన్ని సరిగ్గా ఉపయోగించుకోకుండా, గతం గురించి ఆలోచిస్తూ బాధపడుతూ, "ఇలా అయిపోయింది నా జీవితం" అని చింతిస్తూ, సమయాన్ని వృథా చేయడం చాలా పెద్ద తప్పు. ఇది తెలివితక్కువతనం. అందుకే మీకు ఉన్న వర్తమానాన్ని బాగా ఉపయోగించుకోండి. చాలామంది వర్తమానాన్ని ఎంత వృథా చేస్తారంటే, అవసరం లేని సినిమాలు చూస్తూ, సీరియల్స్ చూస్తూ, పనికిరాని మాటలు మాట్లాడుతూ, అర్థం లేని పనులు చేస్తూ కాలక్షేపం చేస్తారు.

ఇలా జీవిస్తూ, "మేము బాగా జీవిస్తున్నాం" అని అనుకుంటారు. కానీ నిజానికి వారు తమ వర్తమానాన్ని పూర్తిగా వృథా చేసుకుంటున్నారు. గుర్తుపెట్టుకోండి ఇది మీ భవిష్యత్తుకే నష్టం. అందుకే భవిష్యత్తుకు లాభం కలిగించే పనులను వర్తమానంలో చేయండి. అప్పుడు మీకు నిజం

అర్థమవుతుంది. పెద్దలు "వర్తమానమే బహుమానం" అని ఊరికే చెప్పలేదు. పత్రి గారు కూడా ఎన్నో సార్లు ఇదే చెప్పారు. పనికిరాని పనులు ఎందుకు చేయాలి? పనికిరాని మాటలు ఎందుకు మాట్లాడాలి? పనికిరాని ఆలోచనలు ఎందుకు ఆలోచించాలి?

దాని బదులుగా, ఏది చేస్తే నా భవిష్యత్తుకు లాభంకలుగుతుంది? ఏది మాట్లాడితే ఇతరులకు ఉపయోగపడుతుంది? అని ఆలోచించాలి. "నీ మాటే నీ నుదిటి వ్రాత" అని అంటారు. అంటే, మీరు ఇప్పుడు మాట్లాడే మాటలే మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. మీరు ఇతరులకు ఉపయోగపడే మాటలు మాట్లాడితే, మీ భవిష్యత్తు కూడా మంచిదవుతుంది. మీరు చేసే పనులే మీ భవిష్యత్తు. గతంలో మీరు తెలుసుకుని లేదా తెలియక చేసిన పనుల ఫలితాలను ఇప్పుడు అనుభవిస్తున్నారు. అందుకే దాని గురించి బాధపడటం అవసరం లేదు, జరిగిపోయింది ఏదో జరిగిపోయింది.

కానీ ఇప్పుడు మీకు అవకాశం ఉంది. ఇప్పుడు సరిగా చేస్తే, మీ భవిష్యత్తు మారుతుంది. గతంలో మీరు చేసినదాని వల్లే ఈ పరిస్థితి వచ్చింది. అయితే ఇప్పుడు సరిగా చేస్తే భవిష్యత్తు ఎందుకు మారదు? అన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి. కాస్త దృష్టి పెట్టాలి. అందుకే "సమయాన్ని వృథా చేయవద్దు" అని అంటారు. ఖాళీగా కూర్చోకండి, ఏదో ఒక మంచి పని చేయండి.

ఇతరులకు ఉపయోగపడే పని చేయండి. అది చివరికి మీకే ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఎన్ని సమస్యలు వచ్చినా, మీరు సత్యంగా, ధర్మంగా జీవిస్తే, మీకు ఎలాంటి భయం అవసరం లేదు. ఎంతో మంది ప్రమాదాల్లో కూడా కాపాడబడిన ఉదాహరణలు ఉన్నాయి. ఓ బస్ యాక్సిడెంట్ లో 50 మంది ఉంటే 49 మంది చనిపోవచ్చు కానీ మీకు ఏమీ జరగదు. కార్ యాక్సిడెంట్ లో అందరికీ కాళ్ళు, చేతులు ఇరిగితే మీకు ఏమి జరగదు.

అలా ఎన్నో కేసులు చూస్తున్నాం. ఎందుకంటే మీరు ఎవరికి అపకారం, హాని చేయకపోతే, మీకు కూడా హాని జరగదు. అందుకే ధైర్యంగా ఉండండి. మీ ఖాళీ సమయాన్ని "ఎంజాయ్‌మెంట్" పేరుతో వృథా చేయకండి. అది నిజమైన ఆనందం కాదు.

మీకు, ఇతరులకు ఉపయోగపడే పనులు చేయండి, అది నిజమైన సంతృప్తిని ఇస్తుంది. మనకు పత్రి గారు లభించడం ఎంతో అదృష్టం, ఆయన ఎన్నో మార్గాలు చూపించారు. మనం సులభంగా సాధన చేయవచ్చు. సాధన అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచడం,

ఆత్మపై అంటే పర బ్రహ్మపై దృష్టి నిలపడం. పనికిరాని విషయాలపై దృష్టి పెట్టడం కాదు సాక్షాత్ పర బ్రహ్మపై దృష్టిపెట్టాలి. పరమాత్మను ఆశ్రయించినవాడు చివరకు మోక్షాన్నే పొందుతాడు. ఇంతటి గొప్ప అవకాశం మీకు లభించింది.

అందుకే ఖాళీ సమయాన్ని వ్యర్థంగా గడపకండి. అనవసరమైన మాటలు, పనులు చేయడానికి కాదు, ధ్యానం చేయడానికి ఉపయోగించండి. ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవండి. ఆత్మజ్ఞానం అంటే ఆత్మను, పర బ్రహ్మను, సృష్టికర్తను తెలుసుకోవడం. ఆ జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నించండి. అటువంటి సందేశాలను వినండి. యూట్యూబ్‌లో మహానుభావులు చెప్పిన ఉపదేశాలను సులభంగా వినగలుగుతున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరు ఏదైనా సేవ చేయగలిగితే, తప్పకుండా చేయండి. ఇంట్లో కూర్చుని కూడా సేవ చేయవచ్చు. ఇప్పటికే చాలామంది మంచి పనులు చేస్తున్నారు. ఇతరులకు జ్ఞానం అందించే సేవ చేస్తున్నారు. పుస్తకాలు కరెక్షన్ చేస్తున్నారు, ట్రాన్సలేషన్ చేస్తున్నారు, ఇంకా ఎన్నో రకాలైనటువంటి సేవలు చేస్తున్నారు, క్లాసులు అరేంజ్ చేస్తున్నారు,

ఇలా ఎన్నో విధాలుగా సేవ చేసే అవకాశాలు ఉన్నాయి.


ఖాళీగా ఎందుకు కూర్చోవాలి? ఒక్కరికి అయినా మంచి చేయ గలిగితే, అది మీ భవిష్యత్తుకే లాభం. అందుకే వర్తమానాన్ని బాగా ఉపయోగించుకోండి. ఇదే పత్రి గారు చెప్పిన "వర్తమానమే బహుమానం" అనే సత్యం. ఈ వర్తమానాన్ని ఒక గొప్ప అవకాశంగా భావించండి. కొంతమంది ఖాళీగా కూర్చొని అర్థంలేని మాటలు మాట్లాడుతారు. కొంతమంది అవసరం లేని పనుల్లో సమయాన్ని గడుపుతారు. ఇంకొంతమంది ఇల్లంతా శుభ్రం చేస్తూ కాలక్షేపం చేస్తారు. మరికొంతమంది రోజంతా గార్డెనింగ్ చేస్తూ ఉంటారు. అవి తాత్కాలిక పనులు మాత్రమే. ఒక మొక్క పెరుగుతుంది, కొన్ని సంవత్సరాల తర్వాత అది పోతుంది, మళ్లీ కొత్త మొక్క పెంచుకోవాలి.

కానీ ఆ సమయాన్ని ఆధ్యాత్మిక అభివృద్ధికి వినియోగిస్తే, మీ భవిష్యత్తు మారుతుంది. ఇతరులకు నష్టం కలిగించే పనులు చేస్తే, మీరు మీ భవిష్యత్తునే నాశనం చేసుకుంటారు. ఎప్పుడైనా మీరు సమయాన్ని వృథా చేస్తున్నట్టు అనిపిస్తే,"నేను ఇలా ఎందుకు గడుపుతున్నాను?" అని మీరే ప్రశ్నించుకోండి. అప్పుడు మీరు ఏదో ఒక మంచి పని చేయడం ప్రారంభిస్తారు. ఖాళీగా కూర్చోకుండా, ఎప్పుడూ ఉపయోగపడే పనిలో నిమగ్నం అవ్వాలి.

ఉదాహరణకు, వేసవికాలంలో క్లాసులు నిర్వహించడం కష్టంగా అనిపించవచ్చు. ఈ వేసవికాలం క్లాస్‌లకు వెళ్ళినా జనం పెద్దగా రారు, ఇంత ఎండలో కొన్ని చోట్ల ఎ.సి. హాల్స్ ఉంటాయి, కొన్ని చోట్ల ఉండవు. అందుకని మేడం, నేను మే నెల క్లాసులకు వెళ్లడం లేదు. కానీ నాకు అనిపించింది ఊరికే ఉండిపోతే ఈ నెల అంతా వృథా చేసినట్లే కదా? అనిపించి, అప్పుడు మన వాళ్ళందరి దగ్గరికి ఈ సెలవుల్లో ఒకసారి వెళ్తే బాగుంటుందని. అలా అనుకునే హైదరాబాద్లో, విజయవాడ, గుంటూరులో, నిజామాబాద్, రామగుండంలో కూడా అందరి ఇళ్ళకు వెళ్ళాము. నేను వెళ్లడం వాళ్ళందరికీ

ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఏదో వాళ్ళు చెప్తూ ఉంటారు. ఆ సందర్భాన్ని బట్టి నేను ఇచ్చే ఒక్క సందేశం అయినా సరే వారికి ఉపయోగపడుతుంది. తర్వాత ఇంటికి వెళ్లి కూర్చుని కరెక్షన్స్ అయి చేసుకుంటూ, ఇన్నీ జరుగుతాయి కానీ మొత్తం మీద ఖాళీగా ఉండను ఏదో పని చేస్తాను. అందుకే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. మనకు ఖాళీ సమయం లభించినప్పుడు, దాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

"జిడ్డు కృష్ణమూర్తి" గారు కూడా చెప్పారు "ఆధ్యాత్మికంగా పరిపూర్ణ స్థితికి చేరినవాడు ఎప్పుడూ వర్తమానంలోనే జీవిస్తాడు." మీరు వర్తమానంలో జీవించకపోతే, మీ ఆధ్యాత్మిక ప్రగతి ఇంకా పూర్తికాలేదు అన్న మాట. మీరు ఎంత వర్తమానంలో జీవిస్తే, అంతగా మీరు ఆధ్యాత్మికంగా ఎదిగినట్టే. అందుకే అనవసరమైన మాటలు, అర్థంలేని సంభాషణలు తగ్గించండి. మీ దృష్టిని వర్తమానంపై కేంద్రీకరించండి. అది మీ జీవితాన్ని, మీ భవిష్యత్తును, మరియు మీ ఆధ్యాత్మిక మార్గాన్ని ఉన్నతంగా మార్చుతుంది.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

# "జీవితం ఒక నాటకం"

గత కొన్ని రోజులుగా ముఖ్యమైన విషయాల గురించి చెప్పు కుంటున్నాము. ఎవరైతే ఈ విషయాలు మరల, మరల మననం చేసుకుంటూ ఆచరించే ప్రయత్నం చేస్తారో వారి జన్మలు చాలా వరకు తగ్గిపోతాయి.

చాలామంది అడుగుతూ ఉంటారు "మోక్షం పొందాలంటే ఏం చేయాలి?" అని. ఏదో ధ్యానం చేసుకో అంటారు, లేకపోతే పుస్తకాలు చదువు అంటారు, లేకపోతే గురువుని ఆశ్రయించు అంటారు. కానీ ఒకటే గుర్తుపెట్టుకోండి ఎవరు మోక్షం పొందాలనుకుంటారో వారి ప్రవర్తన పూర్తిగా సృష్టికి అనుగుణంగా ఉండాలి. మీ ప్రవర్తన సృష్టికి అనుగుణంగా, ఉండడానికే మీకు బోధించడం జరిగింది.

ఇప్పుడు ఇంకొక ముఖ్యమైన విషయం చెప్పుకుందాం:

**"జీవితం ఒక నాటకం అని తెలుసుకోవాలి."**

ఇక్కడ మీరు ఒకటే ఆలోచించాలి. మిమ్మల్ని ఏదైనా సందేశం ఇవ్వమన్నప్పుడు, ఏదైనా ఉపన్యాసం ఇవ్వమన్నప్పుడు మీరు చేయవలసింది ఏమిటంటే ఏదో ఒక విషయం తీసుకోండి, లేకపోతే ఒక వాక్యం తీసుకోండి, లేకపోతే ఒక పదం తీసుకోండి. దాన్ని జాగ్రత్తగా విని బాగా విశ్లేషణ చేసుకోండి.

ఇప్పుడు ఇక్కడ గమనించండి. **"జీవితం ఒక నాటకం"** అన్నాం. ఇక్కడ రెండు పదాలు ఉన్నాయి "జీవితం" ఒకటి, "నాటకం" ఇంకొకటి. ఈ విషయాన్ని ఇతరులకు అర్థమయ్యేలా చెప్పాలంటే ముందు జీవితం గురించి అవగాహన ఉండాలి, నాటకం గురించి అవగాహన ఉండాలి. అప్పుడు మాత్రమే మీరు ఈ విషయాన్ని సరిగా వివరించగలుగుతారు.

అందుచేత ముందు "నాటకం" అన్న పదానికి వివరణ తీసుకుందాం. పూర్వకాలంలో నాటకం అనేవారు, ఇప్పుడు అదే సినిమా, సీరియల్ రూపంలో

కనిపిస్తున్నాయి. అప్పట్లో టెక్నాలజీ లేకపోవడం వల్ల స్టేజ్ మీద నాటకాలు ప్రదర్శించేవారు. అవి ప్రదర్శిస్తున్నంత సేపు నిజంగానే జరుగుతున్నట్టుగా అనిపించేది. కానీ అయిపోయాక అది నాటకం మాత్రమే అని అర్థమయ్యేది.

అక్కడ పాత్రధారులు స్టేజ్ మీదకు వచ్చి మాట్లాడేవారు, పాత్రలు పోషించేవారు. నాటకం అయిపోయాక బయటకు వచ్చి కనిపించేవారు, కార్లలో ఎక్కి వెళ్ళిపోయేవారురు. అప్పుడు తెలుస్తుంది ఇప్పటిదాకా చూసింది నాటకం మాత్రమే, నిజం కాదు అని. టెక్నాలజీ పెరిగి సినిమాలు, సీరియల్స్ వచ్చిన తర్వాత చూస్తున్నంతసేపు నిజంగానే జరుగుతున్నట్టుగా ఉంటుంది, కానీ అది కూడా నాటకమే. కొంతమంది యాక్టర్లు కలిసి ప్రదర్శించినదే.

అలాంటిదే ఈ జీవితం కూడా. అందుకే పెద్దలు "జీవితం ఒక నాటకం అని అన్నారు" నాటకం అంటే జరగని దాన్ని జరుగుతున్నట్టుగా చూపించడం. అలాంటిదే మన జీవితం కూడా. మన జీవితంలో ప్రతి ఒక్కరికీ భార్య లేదా భర్త, తల్లి, తండ్రి, పిల్లలు, బంధువులు, స్నేహితులు ఉంటారు. ఇవన్నీ నిజంగానే జరుగుతున్నాయని భావిస్తూ ఉంటారు. అందుకే గొడవలు పడతారు, కొట్టుకుంటారు, బాధపడతారు. దెబ్బలు తగిలితే డాక్టర్ దగ్గరకు వెళ్తారు, మందులు వాడతారు. ఇవన్నీ నిజంగానే అనిపిస్తాయి. కానీ ఇదంతా నిజమా? నిజంగా జరుగుతుందా? ఆలోచించాలి.

మీరు వ్యాపారం ప్రారంభించి కోటి రూపాయలు సంపాదించారు అనుకోండి. ఎంతో సంబరపడిపోతారు. "నా కష్టం, నా తెలివితేటలు" అని గర్వపడతారు. ఇంకొకడిని చూసి "అతను కష్టపడలేదు కాబట్టి సాధించ లేకపోయాడు" అంటారు. ఇవన్నీ నిజంగానే జరిగినట్టుగా భావిస్తారు.

చదివి ర్యాంక్ తెచ్చుకున్నవాడు "నేను కష్టపడి చదివాను" అంటాడు. ఉద్యోగం వస్తే ఎంతో తృప్తిపడతాడు. ఉద్యోగం రాకపోతే నిరుత్సాహానికి గురవుతాడు. యాక్సిడెంట్ అయింది, కాలు విరిగింది, హాస్పిటల్‌లో చేర్చారు

ఇవన్నీ కూడా నిజంగానే అనిపిస్తాయి.

ఎలక్షన్‌లో గెలిచాడు, దండలు వేశారు, పొగిడారు, సన్మానించారు. “నేనే గెలిచాను” అని నిజంగానే భావిస్తాడు. ఓట్లు పడ్డాయి, కౌంటింగ్ జరిగింది, మెజారిటీ వచ్చింది ఇవన్నీ కళ్ళకు కనిపిస్తున్నాయి కాబట్టి నిజమే అనుకుంటాడు.

ఒకడు వ్యాపారంలో నష్టపోయాడు, అప్పులు మిగిలాయి. వాటిని తీర్చలేక పోతున్నాడు, బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయి, అప్పు ఇచ్చినవాళ్లు కూడా గొడవ చేస్తున్నారు. వారి మాటలు, వారి తిట్లు, వారి ఒత్తిడి తట్టుకోలేక చివరకు ఆత్మహత్య చేసుకుంటాడు. అలాంటి సమయంలో వారి కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్ళి “అయ్యో ఎందుకు బాధపడుతున్నారు? ఇదంతా ఒక నాటకమే” అని అంటే వారికి కోపం వస్తుంది. “నాటకమా? మా కళ్లముందు నిజంగా జరుగుతుంది కదా!” అంటారు.

అలాగే ఒకడు పెద్ద స్థాయికి ఎదిగాడు అనుకోండి. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నాడు. అందరూ దండలు వేసి సన్మానం చేశారు. అప్పుడు అతడు “ఇదే నిజం” అనుకుని పొంగిపోతాడు. కానీ ఇంకొకడు వచ్చి అతడిని విమర్శిస్తాడు, పేరు పెట్టి తిడతాడు. అప్పుడు “నన్నే తిడుతున్నాడు”, “నా పరువు తీస్తున్నాడు” అని భావించి తీవ్రంగా స్పందిస్తాడు. వాడు ఒకటి తిడితే వీడు పది తిడతాడు.

అప్పుడు మీరు “అది కూడా ఒక నాటకంలోని సన్నివేశమే కదా, దానికి ఎందుకు అంతగా స్పందిస్తున్నావు?” అని అంటే అతడు నవ్వుతాడు. “ఇది నాటకమా? నా ఎదురుగానే తిట్టాడు. నేను స్పష్టంగా విన్నాను!” అంటాడు.

పిల్లలు పుడతారు. “నా పిల్లలు” అని మమకారం పెంచుకుంటారు. వారి కోసం తప్పులు చేస్తారు, అధర్మంగా సంపాదిస్తారు. కానీ ఇవన్నీ కూడా నాటకంలోని పాత్రలే.

అందుకే విలియం షేక్స్పియర్ ఒక గొప్ప మాట చెప్పాడు:

"All the world is a stage.
We are all mere actors."
Distruct in form
Do our part and then depart

ఈ ప్రపంచమంతా ఒక నాటక రంగం, మనమంతా పాత్రధారులం. పాత్ర పోషించడం అయిపోయాక నిష్క్రమిస్తాం.

పత్రి గారు కూడా ఎన్నో సార్లు చెప్పారు:

**"పాత్ర పోషిస్తున్నంతసేపు జీవించు. కానీ అది పాత్ర మాత్రమే, వాస్తవం కాదు అని గుర్తుంచుకో"** అన్నారు.

"ఈ ప్రపంచమంతా ఒక నాటక రంగం. మనమంతా కేవలం నటులమే." ఈ సత్యాన్ని షేక్స్పియర్ చెప్పారు. పత్రి గారు కూడా ఎన్నో సార్లు ఇదే విషయాన్ని వివరించారు. మనమంతా ఈ ప్రపంచంలో పాత్రదారులం మాత్రమే. కొన్ని అనుభవాలు పొందడానికి, కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి ఇక్కడికి వచ్చాము. మన పాత్ర పూర్తయిన తర్వాత నిష్క్రమిస్తాము.

కానీ మనిషి ఈ ప్రపంచాన్ని నాటకంగా చూడకుండా, ఇదే సత్యం అన్నట్టుగా జీవిస్తున్నాడు, అందుకే బాధపడుతున్నాడు, ద్వేషాలు పెంచుకుంటున్నాడు, కర్మలను సృష్టించుకుంటున్నాడు. కానీ ఎప్పుడైతే "ఇది ఒక నాటకం మాత్రమే" అనే అవగాహన వస్తుందో, అప్పుడే జీవితం సరైన దారిలో నడవడం ప్రారంభమవుతుంది.

ఎందుకంటే అప్పుడు మనిషి పాత్రను పోషిస్తాడు కానీ పాత్రలో మునిగిపోడు. పత్రి గారు "పాత్ర పోషిస్తున్నంతసేపు పూర్తిగా జీవించు, అది కేవలం పాత్ర మాత్రమే, నీ అసలు స్వరూపం కాదని ఎప్పుడూ గుర్తుంచుకో."

అని చెప్పారు. ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రకృతి కూడా సహాయం చేస్తుంది. అందుకే కలలను చూపిస్తుంది. కలలో కూడా మనం నవ్వుతాం, ఏడుస్తాం, భయపడతాం, సంతోషపడతాం. కానీ మేల్కొన్న వెంటనే “అరే! ఇదంతా కలే!” అని తెలుస్తుంది.

అలాగే ఈ జీవితం కూడా ఒక పగటి కలలాంటిదే. ఇప్పుడు ఇది నిజమని అనిపిస్తున్నా, ఒకరోజు ఇది కూడా నాటకమే అని అర్థమవుతుంది. ఈ అవగాహన వచ్చినప్పుడు మనిషిలో ప్రశాంతత వస్తుంది, ద్వేషాలు తగ్గిపోతాయి, ఆశలు తగ్గుతాయి, జ్ఞానం పెరుగుతుంది.

ప్రతి మనిషి కలలు కంటాడు, కలలు కనని వాడు ఎవరూ ఉండరు. కలలో ఎన్నో సంఘటనలు జరుగుతాయి, కష్టాలు వస్తాయి, హత్యలు జరుగుతాయి, యాక్సిడెంట్లు జరుగుతాయి, జబ్బులు వస్తాయి. అలాగే హాస్పిటల్‌లో బాధపడుతున్నట్టు కనిపిస్తుంది, వ్యాపారంలో నష్టపోయినట్టు అనిపిస్తుంది. ఇప్పుడు జీవితంలో నిజంగా జరుగుతున్నాయని మీరు అనుకునే ప్రతిదీ, కలలో కూడా జరుగుతుంది.

కొన్నిసార్లు మీరు పెద్ద సినిమా హీరో అయినట్టు కల వస్తుంది, ఎవరో ప్రసిద్ధ నటిని పెళ్ళి చేసుకున్నట్టు ఉంటుంది. పెద్ద సినిమా తీసి వంద రోజులు ఆడినట్టు ఉంటుంది, మరోసారి సినిమా ఫెయిలై బాధపడినట్టు ఉంటుంది. మంచి కలలు వచ్చినప్పుడు ఎంతో సంబరపడతారు, భయంకరమైన కలలు వచ్చినప్పుడు తీవ్రంగా బాధపడతారు. కొంతమందికి కలలో జైల్లో వేసినట్టు ఉంటుంది, పోలీసులు కొడుతున్నట్టు కనిపిస్తుంది. “నా జీవితం నాశనం అయిపోయింది” అని బాధపడుతుంటారు. అంతలో ఎవరో నిద్రలేపుతారు, కళ్ళు తెరిచిన వెంటనే “అరే! ఇదంతా కలేనా?” అని ఆశ్చర్యపడతారు.

మరికొంత మందికి కలలో డైమండ్ నెక్లెస్ కొన్నట్టు ఉంటుంది,

అందరూ పొగిడినట్టు ఉంటుంది, తీరా లేచి చూస్తే ఏమీ ఉండదు, అప్పుడు నిరుత్సాహపడతారు. భయంకరమైన కల వచ్చినప్పుడు, "అది కల మాత్రమే" అని తెలిసిన వెంటనే ఉపశమనం కలుగుతుంది. మంచి కల వచ్చినప్పుడు, "ఇది నిజం కాదు" అని తెలిసిన వెంటనే బాధ కలుగుతుంది.

అంటే కలలో ఉన్నంత సేపు అది నిజంగానే అనిపిస్తుంది, మేల్కొన్నాక అది కల అని తెలుస్తుంది. అలాగే ఇప్పుడు మీరు జీవిస్తున్న ఈ జీవితం కూడా ఒక పగటి కల లాంటిదే. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి గురువులు, సద్గురువులు ఎన్నో విధాలుగా బోధించారు. కానీ మనిషి దీనిని నిజమని భావించి పాపాలు చేస్తాడు, మోసాలు చేస్తాడు, అధర్మంగా సంపాదిస్తాడు, కర్మలను పెంచుకుంటాడు, జన్మలను పెంచుకుంటాడు.

కాని ఇది ఒక నాటకం అని తెలుసుకుంటే ఎవరినీ ద్వేషించరు, ఎవరినీ అవమానించరు, కక్షలు పెట్టుకోరు, మోసాలు చేయరు. ఎవరూ తిట్టినా, "ఇది ఒక పాత్ర మాత్రమే" అని అర్థం చేసుకుంటారు. భార్య, భర్త, తండ్రి, కొడుకు, స్నేహితుడు ఇవన్నీ పాత్రలే. నాటకంలో నటుడు ఒకరోజు తండ్రి పాత్ర వేస్తాడు, మరుసటి రోజు కొడుకు పాత్ర వేస్తాడు, ఇంకోసారి రాజు పాత్ర వేస్తాడు. అలాగే ఈ జన్మలో మీరు ఒక పాత్రలో ఉన్నారు, మరుజన్మలో ఇంకో పాత్రలో ఉంటారు.

ఇది అర్థమైతే జీవితం మారిపోతుంది, జ్ఞానం వస్తుంది, బుద్ధి శుద్ధమవుతుంది, మూడో కన్ను తెరుచుకుంటుంది. అప్పుడు ఈ ప్రపంచం మొత్తం ఒక నాటకం అని స్పష్టంగా తెలుస్తుంది. రాత్రి కల నుండి మేల్కొన్నప్పుడు అది కల అని తెలిసినట్టే, జీవితం ముగిసిన తర్వాత "ఇదంతా ఒక పగటి కలే" అని అర్థమవుతుంది.

# “చేయవలసినవి చేస్తే, పొందవలసినవి ఆటోమేటిక్‌గా పొందుతారు.”

ఈ విషయాలను ఎప్పుడూ గుర్తుంచుకుంటూ, వాటి మీద విశేషమైన అవగాహన కలిగి ఉంటే, మీ జీవితం మారిపోయినట్టే, మీరు గొప్ప జ్ఞాన స్థితిలో ఉన్నట్టే, జ్ఞానాన్ని అపారంగా పెంచుకున్నట్టే. ఈ విషయాలను మీరు విన్నారు, వ్రాసుకున్నారు కూడా. కానీ వాటి మీద సరైన అవగాహన ఉండాలి. అవగాహన ఉంటే మీ ప్రవర్తన ఒక విధంగా ఉంటుంది, అవగాహన లేకపోతే మరో విధంగా ఉంటుంది. అందుచేత ఈ ముఖ్యమైన విషయాలు ఇలా విని అలా వదిలేసేవి కావు. జ్ఞాన పరంగా మీరు ఎదగాలనుకున్నప్పుడు, ఇవి తప్పనిసరిగా తెలుసుకొని ఆచరించాల్సిన విషయాలు.

ఇప్పుడు చెప్పుకునే విషయం ఏమిటంటే?

**“చేయవలసినవి చేస్తే, పొందవలసినవి ఆటోమేటిక్‌గా పొందుతారు.”**

ఇది సృష్టిలో ఉన్న అద్భుతమైన ఏర్పాటు. కానీ ఈ విషయంపై అవగాహన లేని వారు ఎన్నో రకాలుగా జీవిస్తూ ఉంటారు. ఎప్పుడూ ఏదో పొందాలని కోరుకుంటూ, దాని కోసం అనేక విధాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ వారు చేయవలసిన పనిని సరిగ్గా చేయడంపై దృష్టి పెట్టరు. వాస్తవానికి మీరు చేయవలసినది సక్రమంగా చేస్తే, పొందవలసినది సరైన సమయంలో పొందుతారు.

ఎందుచేతనంటే, ఈ లోకంలో కోటానుకోట్ల మంది మనుషులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఎన్నో అవసరాలు ఉంటాయి, కోరికలు ఉంటాయి, ఆశలు ఉంటాయి. ఎన్నో విషయాలను పొందాలని కూడా అనుకుంటూ ఉంటారు. కానీ వాటిని పొందడానికి, సంపాదించుకోవడానికి చేయకూడని పనులు చేస్తూ ఉంటారు. తప్పులు, పాపాలు చేస్తారు. అధర్మంగా వ్యవహరిస్తారు,

సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. దేని కోసం అంటే తాము కావాలనుకున్నవి పొందడానికి.

కానీ అనుకున్నవి "రమ్మంటే" వస్తాయా? కావాలనుకున్నంత మాత్రాన వస్తాయా? అందుకే వాటిని పొందడానికి మనుషులు ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. కొంతమంది డబ్బు ఖర్చుపెట్టి పొందాలనుకుంటారు. డబ్బు లేని వారు అడ్డ మార్గాలు వెతుకుతారు. ఒక్కో మనిషికి జీవితంలో ఎన్నో కావాలి. వాటిని సంపాదించుకోవడానికే అంత తిప్పలు పడుతూ ఉంటారు, కొన్ని విషయాలు డబ్బుతో పొందవచ్చు. కానీ డబ్బు లేకపోతే పొందలేరు. మరికొన్ని విషయాలు డబ్బు ఉన్నా కూడా పొందలేరు. అయినా కూడా "అది నాకు కావాలి... ఎలా అయినా సంపాదించుకోవాలి" అనే తీవ్రమైన కాంక్ష, తపన మనిషిలో ఉంటుంది. అలా అడ్డ మార్గాలు తొక్కడం వల్ల కోరుకున్నవి రాకపోవచ్చు కానీ ఆ ఫలితంగా జీవితంలో అంతులేని కష్టాలు మాత్రం తప్పకుండా వస్తాయి.

అప్పుడు వారు ఎన్నో బాధలు పడుతూ "ఏమిటి ఇలా జీవితం అయిపోయింది? ఎందుకు ఈ కష్టాలు వచ్చాయి?" అని బాధపడుతూ ఉంటారు. కానీ ఆ కష్టాలన్నీ తాము చేసిన పనుల ఫలితమే. అవి ఎందుకు చేశారు అంటే తాము అనుకున్నవి పొందడం కోసం. అంటే కోరికల కోసం మనుషులు తమ జీవితాన్నే నరకప్రాయంగా మార్చుకుంటున్నారు. ఎవరిని చూసినా కొన్ని విషయాలు పొందగలుగుతున్నారు, కానీ అన్నీ పొంద లేకపోతున్నారు. అయినా కూడా అన్నీ పొందాలనే తీవ్రమైన కోరిక ఉంటుంది. ఆ వ్యామోహం వల్ల వారి దృష్టి అంతా వాటి మీదే ఉంటుంది. "ఏమైనా సరే సాధించాలి" అనుకుంటూ రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు.

లోకంలో ఇంకొక అవగాహన ఏమిటంటే తన వల్ల కాకపోతే, దిక్కులేకపోతే "దేవుడే దిక్కు" అని భావించి దేవుణ్ణి ఆశ్రయిస్తారు. ఒక్కొక్కరికి

ఒక్కో దేవుడంటే ఇష్టం, నమ్మకం. ఎవరికీ నచ్చిన దేవుణ్ణి వారు ఆశ్రయిస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరూ బలంగా నమ్ముతారు "దేవుడు చేయ లేనిది లేదు, దేవుడు ఇవ్వలేనిది లేదు" అని. అందుచేత ఆయన్ని పట్టుకుంటే, ఆశ్రయిస్తే, పూజిస్తే, ప్రార్థిస్తే, నమాజ్ చేస్తే ఇలా ఒక్కో మతంలో ఒక్కో రకమైన ఆచారాన్ని పాటిస్తే, తాము అనుకున్నది సాధించొచ్చని, దైవం నుంచి పొందొచ్చని భావిస్తారు. అలా హిందువులు పూజలు చేస్తారు, క్రైస్తవులు ప్రార్థనలు చేస్తారు, ముస్లింలు నమాజ్ చేస్తారు. ఇంకా రకరకాల దేవుళ్లను ఆరాధిస్తూ ఉంటారు.

కానీ ఎంత చేసినా తాము అనుకున్నది జరగకపోతే, దేవుడిమీద నమ్మకం కోల్పోయి ఆ దేవుణ్ణే మార్చేసే వారు కూడా ఉన్నారు, మతాలు కూడా మార్చుకుంటున్నారు. ఎందుకంటే "ఈ దేవుడివల్ల మన పని కాలేదు. ఆ దేవుడు గొప్పవాడు కావచ్చు" అనే భావన వస్తుంది. అలా గమనిస్తే, భారతదేశంలో హిందూ మతం నుంచి ఇతర మతాల్లోకి మారిపోతున్నారు. ఇతర దేశాల్లో ముస్లిం మతం నుంచి, క్రైస్తవ మతం నుంచి హిందువులుగా మారిపోతున్నారు. అంటే మతాలు మార్చుకుంటున్నారు. దానికి కారణం "ఈ దేవుడు వల్ల మనకు ఉపయోగం కాలేదు" అనే భావం. విదేశాల్లో క్రైస్తవులు విసిగిపోయారు. భారతదేశంలో హిందువులు విసిగిపోయారు. ఎంత ఆరాధించినా, ఎన్ని రకాలుగా పూజించినా, ఏమి చేసినా "దేవుడు కనికరించట్లేదు" అనే భావంతో మతాలు మార్చుకుంటున్నారు.

అక్కడ ఏం జరుగుతుందో ఇక్కడా అదే జరుగుతుంది. ఇక్కడ ఏం జరుగుతుందో అక్కడా అదే జరుగుతుంది. అలా వారు ఇటు మారుతుంటే, వీరు అటు మారుతుంటారు. ఈ లోపల వారి జీవితమే ముగిసిపోతుంది. కానీ ఎవ్వరూ కూడా సృష్టిలో ఉన్న ఈ గొప్ప ఏర్పాటు తెలుసుకోవడం లేదు. అవగాహన చేసుకోవడం లేదు. "కోరితే రాదు, చేసుకున్నదాన్ని బట్టి వస్తుంది, కృషిని బట్టి వస్తుంది." ఈ సత్యం అవగాహన లేకుండా ఎన్ని చోట్ల తిరిగినా

ప్రయోజనం లేదు, ఎన్ని మొక్కినా ప్రయోజనం లేదు, ఏమి చేసినా ప్రయోజనం లేదు.

నిజంగా కూడా పత్రీ గారు ఎంతో గొప్ప జ్ఞానాన్ని ఇచ్చారు. సృష్టిలోని ఆయన చెప్పిన విషయాలన్నీ రాసుకుంటూ ఉంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన చెప్పకపోతే మనకు ఇవి ఎలా తెలుస్తాయి? ఎక్కడి నుంచి తెలుస్తాయి? ఆ మూఢత్వంలోనే అలాగే కొట్టుకుపోయే వారం. కళ్ళు మూసుకుపోయిన మనకు కళ్ళు తెరిపించిన గురువు పత్రీ గారు. నిజంగా అలాంటి గురువును పొందిన మీరు ఎంతో అదృష్టవంతులు. ఇప్పుడు ఈ ముఖ్యమైన విషయాలన్నీ కూడా పత్రీ గారి ద్వారా తెలుసుకున్నవే. ఇవన్నీ సృష్టిలో ఉన్న గొప్ప నియమాలు, ఏర్పాట్లు. వాటిని అవగాహన చేసుకుంటే జీవితంలో దుఃఖం ఉండదు. లేకపోతే దుఃఖమే అని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. ప్రారంభ జన్మల్లో "కోరింది రాదు అర్హతను బట్టి వస్తుంది" అని చెప్పారు. మధ్యస్థ జన్మల్లో కూడా "కోరింది రాదు, కావలసిందే వస్తుంది" అని చెప్పారు. చివరి జన్మల్లో అయితే "ఏది లోక కళ్యాణానికి ఉపయోగపడుతుందో అదే వస్తుంది" అని చెప్పారు. ఒక వ్యక్తికి ఇంకా 500 జన్మలు, 600 జన్మలు ఎత్తాల్సి ఉంటే, ఆ జన్మల్లో కూడా కోరింది రాదు. అలా ఇన్ని వందల జన్మల్లో కూడా కోరింది రాకపోతే, ఒక్క ఈ జన్మలో కోరినవి ఎలా వస్తాయి? అని మీరు ఆలోచించాలి.

ఈ అవగాహన, కనీసం ఆ మాత్రం బుద్ధి మీలో ఉంటే, మీరు ఎప్పుడూ కోరికల కోసం పూజలు, వ్రతాలు చేయరు, అభిషేకాలు, ప్రార్థనలు, నమాజ్‌లు చేయరు. ఇవన్నీ పూర్వం నుంచి ఆచారంగా వస్తున్నాయి అంతే గానీ. చాలామంది అంటారు "మేము అవి చేయడం వల్లే మా జీవితం మారింది. అనుకున్నవి జరిగాయి" అని. కానీ అవి జరగడానికి కారణం, వారు గతంలో సంపాదించుకున్న అర్హత. ఆ విషయం వారికి తెలియదు.

ఇప్పుడే చెప్పుకున్నాం కదా **"చేయవలసింది చేస్తే, పొందవలసింది**

**పొందుతారు."** అని. ఈ "చేయవలసింది" ఈ జన్మలో చేసినదైనా కావచ్చు... గత జన్మల్లో చేసిన వైనా కావచ్చు, ఈ సృష్టిలో పొందే అర్హతను సంపాదించు కుంటారు. కానీ ఆ ఫలితాన్ని మీరు ఎప్పుడు పొందాలో నిర్ణయించేది ప్రకృతి అంటే భగవంతుడు. ఏ జన్మలో, ఏ సమయంలో అది మీకు రావాలో నిర్ణయించేది ప్రకృతే. ఉదాహరణకు, మీరు ఈ జన్మలో ఎన్నో దానధర్మాలు చేశారు అనుకుందాం. వాటి ఫలితం వెంటనే రావాలని అవసరం లేదు. మీరు "నేను మంచి పనులు చేస్తున్నాను" అనే భావంతో చేసుకుంటూ పోతే అప్పుడు మరుజన్మలో దాని ఫలితాన్ని అనుభవిస్తారు. ఆ జన్మలో మీ జీవితంలో అకస్మాత్తుగా అన్ని కలిసి వస్తూ ఉంటాయి. మీరు దానిని "అదృష్టం" అంటారు. "నా అదృష్టం బాగుంది" అంటారు. "భగవంతుడు నాకు ఈ అదృష్టం కల్పించాడు" అంటారు. కానీ నిజానికి అలా కలిసి రావడం అంటే, గతంలో మీరు చేసుకున్న దాని ఫలితమే. కొంతమంది చిన్న వ్యాపారం పెట్టుకొని ఎంతో కష్టపడి పనిచేస్తూ ఉంటారు. మొదట్లో ఏమీ బాగోదు కానీ మెల్ల మెల్లిగా వారికి బాగా కలిసి వస్తుంది. ఆ వ్యాపారం పెద్ద స్థాయికి వెళ్తుంది, అప్పుడు వారు "భగవంతుడు నాకు ఈ అదృష్టం ఇచ్చాడు" అని అనుకుంటారు.

కానీ అది భగవంతుడు కొత్తగా కల్పించడం కాదు. వారు గతంలో అర్హత సంపాదించుకున్నారు, ఇప్పుడు ఆ అర్హత ఫలితాన్ని అనుభవించే సమయం వచ్చింది అంతే. అందువల్ల వారి జీవితంలో అన్నీ కలిసి వచ్చి, ఆ వ్యాపారం ఎంతో అభివృద్ధి చెందుతుంది. కానీ ఆ గతం గురించి వారికి తెలియదు, వారు చేసుకున్నదాన్నే ఇప్పుడు అనుభవిస్తున్నారు.

అలాగే ఇంకొంత మంది కూడా అదే రకమైన వ్యాపారం చేస్తారు. జీవితాంతం కష్టపడతారు, కానీ కొంచెం కూడా అభివృద్ధి ఉండదు, పైగా నష్టాలు వస్తూ ఉంటాయి, అదే వస్తువు వీరి దగ్గర అమ్ముడు పోదు.

ఇద్దరూ ఒకే రకమైన వ్యాపారం చేస్తున్నారు. కానీ ఒకరికి కలిసి

వస్తుంది, ఇంకొకరికి కలిసి రావడం లేదు. దానికి కారణం ఒక్కటే అర్హత. కలిసి వచ్చినవాడు గతంలో సంపాదించుకున్నాడు, కలిసి రానివాడు ఇంకా సంపాదించుకోవాలి.

అందుకే ఈరోజు మీరు తెలుసుకున్న గొప్ప విషయం ఏమిటంటే "చేయవలసింది చేస్తే, పొందవలసింది ఆటోమేటిక్‌గా పొందుతారు." ఇలా రకరకాల ప్రయత్నాలు చేసి, చివరికి చాలామంది ధ్యానంలోకి కూడా వస్తారు. "ధ్యానం చేస్తే అన్నీ కలిసి వస్తాయి", "నీ కోరికలు తీరిపోతాయి", "నీ ధనం పెరుగుతుంది", "నువ్వు అనుకున్నవన్నీ జరుగుతాయి" అని చాలామంది చెబుతూ ఉంటారు.

ఇలా ఎన్నో ప్రయత్నాలు చేసి ఫలితం రాకపోయినవారు ధ్యానంలోకి వస్తారు. "రోగాలు తగ్గుతాయి", "జీవితం మారిపోతుంది" అని చెప్పినప్పుడు, వారికి ధ్యానం చెప్పే రకరకాల మాస్టర్లు ఎదురవుతారు. వారిలో కొందరు ఏమి చేస్తారంటే ఈ ప్రజలంతా కోరికలతో, ఆశలతో వచ్చారని తెలుసుకొని, వారిని ఆకర్షించడానికి "సంకల్పం పెట్టుకొని ధ్యానం చేయి. నీ కోరిక తీరిపోతుంది" అని చెబుతారు. ఇది వారికి బాగా నచ్చుతుంది. "సంకల్పం పెట్టి ధ్యానం చేస్తే అనుకున్నది జరుగుతుంది. కావలసింది వస్తుంది" అని నమ్మి, ఆ మాస్టర్ల దగ్గరకు వెళ్లి సంవత్సరాల తరబడి ధ్యానం చేస్తూ ఉంటారు. అయినా కూడా చాలామందికి వారి పని జరగదు. అయితే కొద్దిమందికి మాత్రం సంకల్పంతో ధ్యానం చేసిన తర్వాత అనుకున్నది జరిగినట్టు కనిపిస్తుంది.

కానీ అది ధ్యానం వల్ల కొత్తగా వచ్చినది కాదు. వారు గతంలో సంపాదించుకున్న అర్హత, ఆ సమయంలో ఫలితంగా బయటపడింది అంతే. ఎంత సంకల్పించినా, ఎంత కోరుకున్నా జరగలేదు అంటే, ఆ వ్యక్తికి ఆ ఫలితాన్ని పొందే అర్హత ఇంకా రాలేదని అర్థం. అందుకే అతనికి అది జరగలేదు.

నిజంగా సంకల్పం పెట్టుకుంటేనే అన్నీ జరిగిపోతే, ప్రతి ఒక్కరికీ అనుకున్నవి జరగాలి కదా? మరి ఎందుకు జరగడం లేదు? కారణం ఇదే. అందుకే ఒకటే గుర్తుపెట్టుకోండి "చేయవలసింది చేస్తే, పొందవలసింది పొందుతారు. చేయవలసింది చేయకుండా, పొందవలసింది పొందలేరు."

ఈ విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మొదట్లో మీరు కూడా సాధారణ అవగాహనలోనే ఉండేవారు. కానీ తర్వాత ధ్యానంలోకి వచ్చి, పత్రి గారిని బాగా అనుసరించిన తర్వాత, ఆయన చెప్పిన సందేశాలను లోతుగా అవగాహన చేసుకున్న తర్వాత ఈ సత్యం పూర్తిగా అర్థమైంది. "చేయవలసిన దాని మీద దృష్టి పెడితే, పొందవలసినవి ఆటోమేటిక్‌గా వస్తాయి." కానీ చేయవలసింది మానేసి, రకరకాల మార్గాల్లో సంపాదించాలనుకుంటే మాత్రం రాదు.

కొంతమంది లాటరీలలో డబ్బు సంపాదించాలనుకుంటారు. కొంతమంది పేకాటలో సంపాదించాలనుకుంటారు. ఇంకొంత మంది క్రికెట్ బెట్టింగ్స్, బిట్‌కాయిన్స్ అంటూ అడ్డదారులు వెతుకుతారు. కానీ అర్హత లేకుండా ఎలా వస్తుంది? ఏమీ చేసుకోకుండా "ఇవాళే వచ్చేయాలి" అనుకుంటే వస్తుందా? పైగా ఉన్నది కూడా పోతుంది. అందుకే మీరు కూడా చేయడం మీద దృష్టి పెట్టాలి. కోరడం మీద, పొందడం మీద దృష్టి పెడితే ఉపయోగం లేదు. సృష్టిలో ఉన్న ఏర్పాటు ఏమిటంటే కోరిక పెట్టినంత మాత్రాన భగవంతుడు ఇవ్వడు. ఈ లోకంలో కోట్లాది మంది ఉన్నారు. ప్రతి ఒక్కరి కోరికను తీర్చడం సాధ్యమేనా?

ఒక ఊరిలో లక్ష మంది జనాభా ఉన్నారు అనుకుందాం. ప్రతి ఒక్కరూ "100 ఎకరాల రైతు కావాలి" అనుకుంటే, ఆ ఊరిలో ఉన్న మొత్తం భూమే 10 వేల ఎకరాలు అయితే, మరి 100 ఎకరాలు ఎక్కడి నుంచి వస్తాయి?

ఇదే విధంగా నలుగురు ఎన్నికల్లో నిలబడ్డారు అనుకుందాం. నలుగురూ తమ తమ దేవుణ్ణి ప్రార్థిస్తారు. నలుగురూ పూజలు చేస్తారు. కానీ గెలిచేది ఒక్కరే. దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవ్వాలి భగవంతుడు ఎవరి కోరికలనూ ప్రత్యేకంగా తీర్చడు. సృష్టిలో ఉన్న ఏర్పాటు ఒక్కటే "చేయవలసింది చేస్తే, పొందవలసింది పొందుతారు." ఈ గొప్ప సత్యాలను, సృష్టిలో ఉన్న నియమాలను, ధర్మాలను పత్రీ గారు ఎంతో స్పష్టంగా బోధించారు.

మన అదృష్టం కొద్దీ అలాంటి గురువు దొరికారు. అందుకే ఈ సత్యాలు మనకు తెలిసాయి. నిజంగా ఇది గొప్ప అదృష్టం. ఇవి తెలుసుకోకపోతే ఇంకా ఇంకా పతనం అయ్యే వాళ్ళం. అంతులేని దుఃఖంలో మునిగిపోయే వారం. అందుకే ఊరికే కూర్చున్నా రాదు. సంకల్పాలు పెట్టుకున్నా రాదు, ఎన్ని మొక్కులు పెట్టినా, ఎన్ని తిప్పలు పడినా, ఏమి చేసినా రాదు. "చేసుకున్నదాన్ని బట్టే వస్తుంది" అనే విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

అందుకే పెద్దలు కూడా చెప్పారు "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా" అని. కానీ కానీ ఎక్కడా కూడా "కోరుకున్న వాడికి కోరుకున్నంత మహాదేవా" అని చెప్పలేదు. ఎందుకంటే కేవలం కోరుకోవడం వల్ల ఏమీ రాదు. చాలామంది కష్టపడకుండా, ఏమీ చేయకుండా, ఊరికే సంపాదించాలనుకుంటారు. కానీ జీవితంలో ఏదీ అలా రాదు. నా జీవితంలో కూడా ఇదే ప్రాక్టికల్ అనుభవం. దాదాపు 50 సంవత్సరాలు ఏ వ్యాపారం చేసినా సక్సెస్ అయ్యాను, బాగా సంపాదించాను, ఆస్తులు పెంచుకున్నాను. కానీ ఒక దశకు వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇంతకుముందు ఏం చేసినా సక్సెస్ అయితే, ఇప్పుడు అన్నీ ఫెయిల్యూర్ అవ్వడం ప్రారంభమైంది. రైస్ మిల్లులు ఆగిపోయాయి. ఫైనాన్స్ వ్యాపారాలు నడవలేదు. పెట్టిన ప్రతి చోట దెబ్బలు తగిలాయి. ఏమీ అర్థంకాని పరిస్థితి.

అలాంటి సమయంలోనే పత్రీ గారి పరిచయం జరిగింది. ఎందుకో

తెలియదు కానీ, ఆయన మాటలకు, సందేశాలకు ఆకర్షితులయ్యాను. ఆయన చెప్పిన విషయాలు లోతుగా అర్థమయ్యాయి. "నేను దేహం కాదు... ఆత్మ" అనే సత్యం అర్థమైంది. "నాకు నిజంగా కావలసింది ధనం కాదు... జ్ఞానం" అనే విషయం స్పష్టమైంది. అప్పుడు ధన మార్గాన్ని వదిలి, జ్ఞాన మార్గంలో ప్రవేశించాను. ఒక సమయంలో ఎన్నో కోట్ల ఆస్తులు ఉన్నా, చేతిలో డబ్బు లేని పరిస్థితి వచ్చింది. అయినా కూడా నేను దానిని లెక్కచేయలేదు. 2002 నుంచి 2012 వరకు పది సంవత్సరాలు ఎంతో కష్టంగా గడిచాయి. అది త్యాగ జీవితం లాంటిదే. ఆ సమయంలో నేను దేనిమీదా దృష్టి పెట్టలేదు. చేయవలసిన దాని మీద మాత్రమే దృష్టి పెట్టారు.

పత్రీ గారు చెప్పారు **"జ్ఞానం సంపాదించుకోవడం, జ్ఞానం పంచడం కంటే గొప్ప పని లేదు."** అందుకే అదే పని చేశాను. భీమవరంలో మూడు రోజుల క్లాసులు ప్రారంభించాను. పుస్తకాలు చదివాను. సందేశాలు విన్నాను. ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఆ సమయంలో ఎన్ని ఇబ్బందులు వున్నా ఆ మార్గాన్ని వదల్లేదు. కానీ పది సంవత్సరాల తర్వాత ఎంతో మార్పు వచ్చింది, ప్రత్యేకంగా సంపాదించలేదు. కానీ అప్పటివరకు లక్షల విలువ ఉన్న ఆస్తులు కోట్ల విలువకు పెరిగాయి. అనుకోకుండా బిల్డింగులు కట్టడం, వాటిపై రెంట్స్ రావడం, ఆదాయం పెరగడం  ఇలా జీవితంలో అవకాశాలు పెరిగాయి.

అప్పుడు స్పష్టంగా అర్థమైంది "చేయవలసింది చేస్తే, పొందవలసింది ఆటోమేటిక్‌గా పొందుతామని" అందుకే ఇప్పటికీ చేయవలసిన దాని మీదే దృష్టి పెడుతున్నాను. ఎందుకంటే "చేసింది ఎక్కడికీ పోదు." "నా పరిస్థితి బాగోలేదు" అని బాధపడకుండా, మీకు ఉన్నంతలో చేయడం మీద దృష్టి పెట్టండి. పొందడం మీద కాదు,  ఇవ్వడం మీద దృష్టి పెట్టండి. మీ సమయాన్ని ఇవ్వండి. అది కూడా ఒక దానమే. మీ వాక్కును ఇవ్వండి. అది కూడా ఒక సేవే.

మీకు ఎంత సమయం అవకాశం ఉంటే, అంత సమయాన్ని ఈ జ్ఞాన ప్రచారానికి కేటాయించండి.

పత్రీజీ మనం చేయవలసిన పనులన్నింటికంటే గొప్ప పని చెప్పారు. చాలామంది అడుగుతారు "మాకు ఇవ్వాలని ఉంది. ఏమి ఇవ్వాలి?" అని. పత్రీజీ నుంచి నేర్చుకున్న గొప్ప విషయం ఏమిటంటే ఆయనకి ఎందుకు అంత క్రేజ్ వచ్చిందో నేను రెండు విషయాల్లో గమనించాను. ఆ రెండు ఏమిటంటే **"సరైన ధ్యానం, సత్య జ్ఞానం".** ఈ రెండు మాత్రమే ఆయన ప్రపంచానికి ఇచ్చారు. నేను కూడా అదే గ్రహించి, అదే ఇవ్వడం ప్రారంభించాను.

"సరైన ధ్యానం... సత్య జ్ఞానం..." అంతే. అవి ఇచ్చి ఆయన ఎంత గొప్ప స్థాయికి వెళ్లారో చూడండి. ఒకప్పుడు టీ తాగడానికి కూడా అవకాశం లేని స్థితి నుంచి, విమానాల్లో తిరిగే స్థాయికి ఎదిగారు. దీన్ని బట్టి మీరు అర్థం చేసుకోవాలి ఆయన ఏం చేశారు? ఏమీ ప్రత్యేకంగా చేయలేదు. చేయవలసింది చేశారు. అందుకే పొందవలసింది పొందారు.

జ్ఞానం చెప్పడానికి మీకు పెద్ద సంపద అవసరమా? జ్ఞానం సంపాదించుకోండి. సత్య జ్ఞానం తెలుసుకోండి. దాన్ని పంచండి. ఇప్పుడు మేము కూడా అదే చేస్తున్నాం కదా! "జ్ఞానం సంపాదించుకోండి. అన్ని చోట్లకు తిరిగి ఆ జ్ఞానాన్ని పంచండి" అని చెబుతున్నాం. ఊరూరూ తిరిగి పంచండి. మీరు చేస్తున్న ఉద్యోగం మానేయమని ఎవరూ చెప్పడం లేదు. ఉద్యోగం చేసుకోండి. మీ డ్యూటీ చేయండి. అందులో తప్పేమీ లేదు. కానీ ఖాళీ సమయం ఉంటుంది కదా, ఆదివారాలు ఖాళీగా ఉంటాయి. శనివారాలు ఖాళీగా ఉంటాయి. సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చిన తర్వాత కూడా కొంత సమయం ఉంటుంది. ఆ సమయంలో దగ్గర్లోనో, చుట్టుప్రక్కల ఊళ్ళలోనో తిరిగి ఈ జ్ఞానాన్ని పంచండి. "వాడు వినడం లేదు... వీడు పట్టించుకోవడం లేదు..."

అని ఎందుకు బాధపడాలి?

మీరు చేయవలసింది చేయండి. ఎవరు విన్నా మీకేం? ఎవరు వినకపోయినా మీకేం? నేను కూడా అలాగే తిరిగేవాడిని. ఎన్ని ఊర్లు తిరిగానో! ఎవరి ముక్కు మొహం కూడా తెలియని ఊర్లకు వెళ్లి జ్ఞానం పంచేవాడిని. అప్పుడు వినేవారు తక్కువమంది. కానీ ఇప్పుడు వందల మంది వినే స్థాయికి వచ్చింది. అందుకే మరొక్క సారి గుర్తుంచుకోండి సృష్టిలో ఉన్న గొప్ప సిద్ధాంతం, గొప్ప నియమం, గొప్ప ఏర్పాటు ఏమిటంటే **"చేయవలసింది చేస్తే, పొంద వలసింది పొందుతారు."**

ఈ ఒక్క అవగాహన మొత్తం మీ జీవితాన్నే మార్చేస్తుంది. కానీ చాలామంది ఇంకా అంటూనే ఉంటారు "నాకు అది వద్దండి... ఇదే కావాలి..." అని. "నాకు డబ్బు కావాలి" అంటారు. సరే, మీకు ఏది కావాలో అదే ఇవ్వండి. డబ్బు కావాలంటే డబ్బు ఇవ్వండి. ఎందుకంటే ఏది ఇస్తే అదే వస్తుంది. మీకు ఆనందం కావాలంటే ఆనందం ఇవ్వండి. శాంతి కావాలంటే శాంతిని ఇవ్వండి. అందరినీ శాంతిగా జీవించనివ్వండి. ఏ కోడినీ, ఏ మేకనీ హింసించకండి. వాటిని కూడా ప్రశాంతంగా జీవించనివ్వండి. అంతేకానీ, ఊరికే "రా" అంటే ఎలా వస్తుంది? ఏమీ చేయకుండా ఎలా లభిస్తుంది? చేస్తేనే వస్తుంది.

ఈ ఒక్క మాటలో ఎంత లోతైన అర్థం ఉందో గమనించండి. ఈ ప్రపంచాన్ని, ఈ సృష్టిని నడిపిస్తున్న సృష్టికర్త కొన్ని నియమాలు, ధర్మాలు, సిద్ధాంతాలు ఏర్పాటు చేశాడని ఎప్పుడూ మరచిపోవద్దు. మీరు వాటిని అనుసరించి జీవించాలి. వాటికి అనుగుణంగా ప్రవర్తించాలి. ఆ నియమాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే, దాని వల్ల వచ్చే కష్టాలకు, పడే శిక్షలకు మీరే బాధ్యులు. సృష్టిని అనుసరించి జీవిస్తే మీ జీవితం మీ చేతుల్లో ఉంటుంది. సృష్టికి విరుద్ధంగా జీవిస్తే మీ జీవితం మీ చేతిలో ఉండదు. అందుకే జీవితాన్ని

తేలికగా తీసుకోకండి. "నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను" అంటే కుదరదు. ఎవరైనా సరే, సృష్టి నియమాల ప్రకారం జీవించాల్సిందే.

చాలామంది అంటారు "నా ఇష్టప్రకారం చేస్తాను. నువ్వెవరు అడగడానికి?" అని. గుర్తుంచుకోండి చేయడానికి మీకు అధికారం ఉంది. కానీ దాని ఫలితం మీ చేతిలో లేదు. ఇదే భగవద్గీత లో చెప్పబడింది "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అంటే కర్మ చేయడానికే మీకు అధికారం ఉంది. కానీ కర్మ ఫలాన్ని ఆశించే అధికారం మీకు లేదు.

ఉదాహరణకు, కోడిని కోసుకొని తినే అధికారం మీకు ఉంది. కోడి జాయింట్లు తినవచ్చు. కానీ "నేను తింటాను, నాకు ఏమీ కాదు" అనుకుంటే కుదరదు. ఫలితం మాత్రం మీ చేతిలో ఉండదు. ఈరోజు మీరు చేసే హింస, రేపు ఏ రూపంలో ఫలితంగా వస్తుందో మీకు తెలియదు. అందుకే భగవద్గీతలో ప్రతిదీ ఎంతో స్పష్టంగా చెప్పబడింది. మన అదృష్టం ఏమిటంటే పత్రీజీ లాంటి గురువు దొరికారు. ఈ సృష్టి నియమాలన్నీ మనకు అర్థమయ్యేలా చెప్పారు. వాటికి అనుగుణంగా జీవించమని బోధించారు.

అందుచేత ఎవరు ఏ స్థితిలో ఉన్నా, ముందుగా చేయడం మీద దృష్టి పెట్టాలి. అదే విషయాన్ని పదే పదే చెబుతున్నారు "చేయవలసింది చేయండి." కానీ ఆ స్థాయికి రావాలంటే బుద్ధి పెరగాలి. బుద్ధి పెరగాలంటే సరైన ధ్యానం తప్పనిసరి. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని చేసే ప్రతి ధ్యానం నిజమైన ధ్యానం కాదు. సాత్వికమైన ఆహారం తీసుకోండి.

సాత్వికమైన ఆలోచనలు పెంచుకోండి. మీ బుద్ధి పెరిగితే, సృష్టికి అనుగుణంగా మీరే ప్రవర్తించడం ప్రారంభిస్తారు. అప్పుడు మీ బుద్ధే మీకు గురువై మిమ్మల్ని నడిపిస్తుంది.

# “త్రికరణ శుద్ధి-అంతరాత్మ ప్రబోధం”

త్రికరణ శుద్ధి ఉన్నవారికే అంతరాత్మ ప్రబోధం అన్నది స్పష్టంగా తెలుస్తుంది. అంతరాత్మ అంటే ప్రతి ఒక్కరి అంతరంలో ఉన్న ఆత్మ, ఆ ఆత్మే సత్యం, అదే భగవంతుడు, అదే పర బ్రహ్మ. ఆ పర బ్రహ్మ యొక్క గొప్పతనం మీరు తెలుసుకోగలిగితే, మీ అంతరంలో ఉన్న ఆత్మ ఎంత గొప్పదో మీకు అర్థమవుతుంది.

సృష్టిలో రెండు ముఖ్యమైన విషయాలు ఉన్నాయి సత్యము మరియు ధర్మము. ఇక్కడ అంతరంలో ఉన్న ఆత్మే సత్యము. అలాగే సత్యాన్ని ఆశ్రయించిన వారే ధర్మాన్ని ఆచరించగలుగుతారు. అంటే అంతరాత్మను ఆశ్రయించిన వారే ధర్మాన్ని ఆచరించగలుగుతారు.

ధర్మం గురించి బ్రహ్మర్షి పత్రి గారు ఒక గొప్ప నిర్వచనం ఇచ్చారు. “అంతరాత్మ నుండి సహజంగా ఉబికేదే ధర్మము” అని చెప్పారు.

అంటే సృష్టిలో ధర్మం ఎవరు చెప్పగలరు? అంటే గొప్ప గొప్ప పండితులైనా కొంతవరకే చెప్పగలరు. కాని సంపూర్ణంగా ఆత్మకే తెలుస్తుంది.

ఆత్మ అంటే పర బ్రహ్మ అని మీరు తెలుసుకున్నారు. ఆ పర బ్రహ్మే ఈ సృష్టిని సృష్టించాడు, సృష్టిని నడిపిస్తున్నాడు, సృష్టికి ఆధారంగా ఉన్నాడు. ఈ సృష్టి సక్రమంగా నడవడానికి కొన్ని నియమాలు, సిద్ధాంతాలు, ధర్మాలు ఏర్పాటు చేశాడు. కాబట్టి, వాటి అసలైన స్వరూపం ఆయనకే పూర్తిగా తెలుసు.

అందుచేత ఎవరైనా ధర్మంగా జీవించాలంటే అంతరాత్మను ఆశ్రయించాలి, అంతరాత్మ ప్రబోధాన్ని వినగలగాలి. త్రికరణ శుద్ధి ఉన్నవారికే ఆ అంతరాత్మ బోధించే ధర్మాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఇటువంటి ధర్మాన్ని ఆచరించినందువల్లే ధర్మరాజు అంత గొప్పవాడయ్యాడు. అందుకే ఆయన జీవితం ధర్మానికి ప్రతీకగా నిలిచింది.

త్రికరణ శుద్ధి ఉన్నవారికే అంతరాత్మ ప్రబోధం స్పష్టంగా తెలుస్తుంది.

అంటే ఎవరికైతే త్రికరణ శుద్ధి ఉంటుందో వారే అంతరాత్మ ప్రబోధాన్ని సరిగా అర్థం చేసుకోగలుగుతారు. త్రికరణ శుద్ధి గురించి మీరు ఎన్నో సార్లు తెలుసుకున్నారు. మీరు **"ఏది ఆలోచిస్తారో అదే మాట్లాడాలి, ఏది మాట్లాడతారో అదే చేయాలి".** అంటే ఆలోచన, మాట, చేత ఈ మూడూ ఒకే విధంగా ఉండాలి. ఇలా ఎవరిలో ఉంటుందో వారినే త్రికరణ శుద్ధి ఉన్నవారు అంటారు.

ఎందుకు త్రికరణశుద్ధి ఉన్నవారికే అంతరాత్మ ప్రబోధం తెలుస్తుంది? అంటే మనస్సు, ఆలోచన, పనులు శుద్ధంగా ఉన్నట్టయితే అంతరంలోవున్న ఆత్మ సందేశాలు స్పష్టంగా తెలుసుకో గలుగుతారు. వారు ఆత్మనుంచి అంటే భగవంతుని నుంచి వచ్చిన సందేశాలు ఆచరించగలుగుతారు. అందుకే **"త్రికరణ శుద్ధి ఉన్నవారిని లోకం మెచ్చుకుంటుంది, దైవం కూడా మెచ్చుకుంటుంది"** అన్నారు.

మానవుడు మాట్లాడే మాటల్లో కానీ, చేసే పనుల్లో కానీ ఏదైనా తేడా ఉన్నా, తప్పు ఉన్నా, అధర్మంగా ఉన్నా, సృష్టికి విరుద్ధంగా ఉన్నా, శరీరంలో ఉన్న ఆత్మ ఊరుకోదు, వెంటనే "నువ్వు తప్పు చేస్తున్నావు, తప్పుగా మాట్లాడుతున్నావు" అని బోధిస్తుంది. అంతరాత్మ నుంచి వచ్చిన ఆ బోధను అర్థం చేసుకున్నవాడు నేను తప్పు చేస్తున్నాను అని వెంటనే తనను తాను సరిచేసుకుంటాడు మారిపోతాడు.

కానీ అంతరాత్మ చెప్పేది అర్థం కాకపోతే, మనిషి తప్పు చేస్తూనే ఉంటాడు. ఆ తప్పుకు ఆ ఫలితమే శిక్షగా అనుభ వించవలసి వస్తుంది.

శిక్ష అంటే జీవితంలో వచ్చే కష్టాలు. ఆ కష్టాలు ఎందుకు వస్తాయి అంటే, అంతరాత్మ హెచ్చరించినా వినకుండా చేసిన తప్పుల వలన వస్తాయి. అంతరాత్మ అంటే ఎవరో కాదు, సాక్షాత్తు పర బ్రహ్మ యొక్క అంశ. భగవంతునిలో భాగమైన ఆ ఆత్మ, మీరు నష్టపోకుండా ఉండాలని ఎప్పటికప్పుడు మీలో నుంచే ధర్మాన్ని బోధిస్తూ ఉంటుంది. మీరు సన్మార్గంలో నడవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది.

మనసు శుద్ధిగా ఉన్నవాడు ఆ బోధను అర్థం చేసుకొని ఆచరిస్తాడు, శుద్ధత లేనివాడు ఆ బోధను పట్టించుకోడు. ఫలితంగా తప్పులు చేసి నష్టపోతాడు, కష్టాలను అనుభవిస్తాడు. మనిషి కష్టాలు పడకుండా ఉండటానికే భగవంతుడు అంతరాత్మ రూపంలో శరీరంలో ఉండి ప్రతి క్షణం ధర్మాన్ని బోధిస్తున్నాడు. కానీ ఇవన్నీ మీకు సరిగా అర్థం కావు.

నిజంగా అంతరాత్మ చెప్పేది అర్థం చేసుకున్నవాడు ఎంతో అదృష్ట వంతుడు. ఎందుకంటే మీరు గమనిస్తే, జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు వెంటనే గుడికి వెళ్తారు, చర్చికి వెళ్తారు, మసీదుకు వెళ్తారు, లేదా ఏదో ఒక ప్రార్థనా మందిరానికి వెళ్తారు. అక్కడికి వెళ్లి దేవుణ్ణి ప్రార్థిస్తూ, “నాకు ఈ కష్టాలు వచ్చాయి, ఇవి తొలగించు. మళ్ళీ రాకుండా చేయి” అని కోరుకుంటారు.

కానీ ఆలోచించండి మీకు ఈ కష్టాలు రాకుండా ఉండాలని భగవంతుడు ముందుగానే అంతరాత్మ ద్వారా మీరు చేసే తప్పులను బోధిస్తూ ఉంటాడు. “ఇది తప్పు, ఇలా చేయకూడదు” అని లోపల నుంచే హెచ్చరిస్తూ ఉంటాడు.

కానీ మీరు ఆ బోధను పట్టించుకోకుండా తప్పు చేస్తారు. తరువాత విగ్రహం దగ్గరకు వెళ్ళి “నన్ను రక్షించు” అని అడుగుతారు. అప్పుడు భగవంతుడు ఏమి చేయగలడు? మీరు బాధ పడకూడదనే ఉద్దేశంతో ముందే హెచ్చరించాడు, కానీ మీరు వినలేదు. మరి ఆ ఫలితాన్ని ఎవరు అనుభవించాలి? మీరే అనుభవించాలి.

అందుకే పత్రి గారు చెబుతుంటారు **“నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవు”** అని. అంటే మీ జీవితంలో జరిగే సంఘటనలకు కారణం మీరే. అంతరాత్మ చెప్పిన బోధను వినొద్దని ఎవరూ చెప్పలేదు. తప్పు చేయమని కూడా ఎవరూ చెప్పలేదు.

మరి తప్పు చేసిన తర్వాత కష్టాలు రాకుండా ఎలా ఉంటాయి? ఇప్పుడు బాధపడుతూ కూర్చుంటే ఎవరు ఏమి చేయగలరు? భగవంతుడు

ముందుగానే మిమ్మల్ని హెచ్చచాడు. కానీ విచిత్రం ఏమిటంటే, లోకంలో తప్పు చేయడం చాలా తేలిక. కానీ ఆ తప్పు వల్ల వచ్చిన కష్టాన్ని అనుభవించడం మాత్రం చాలా బాధాకరం. ఇదే సృష్టిలోని విచిత్రం.

అందుచేత జీవితంలో కష్టాలు రాకూడదనుకుంటే ప్రతి ఒక్కరూ అంతరాత్మ బోధించే ధర్మాన్ని పాటించాలి. ఈ అంతరాత్మ చెప్పేది మీకు స్పష్టంగా తెలియాలంటే మీరు త్రికరణ శుద్ధి సాధించాలి. అంటే మనసు, మాట, చేత ఈ మూడు శుద్ధిగా ఉండాలి. త్రికరణ శుద్ధి రావాలంటే ముందుగా మనసును శుద్ధి చేసుకోవాలి. ఎందుకంటే ఆలోచించేది మనసే. ఆలోచనలను మాటల రూపంలో బయటకు తెచ్చేది కూడా మనసే. శరీరంలోని ఇంద్రియాలన్నీ కూడా మనసును బట్టే పనిచేస్తాయి. కళ్ళు, చెవులు, ముక్కు, నోరు ఇవన్నీ మనసు చెప్పినట్టే పనిచేస్తాయి. అలాగే మనం మాట్లాడే మాటలు, చేసే పనులు కూడా మనసు ఆధారంగానే జరుగుతాయి. అందుచేత ఈ మూడింటికి మూల కారణం మనసే.

ఎవరైతే మనసును శుద్ధి చేసుకుంటారో, వారి ఆలోచనలు శుద్ధిగా ఉంటాయి, వారు మాట్లాడే మాటలు శుద్ధిగా ఉంటాయి, వారు చేసే పనులు కూడా శుద్ధిగా ఉంటాయి. అటువంటి వారినే త్రికరణ శుద్ధి సాధించినవారు అంటారు. అలాంటి వారికి అంతరాత్మ ప్రబోధం చాలా స్పష్టంగా వినిపిస్తుంది. వారు ఎంత సూక్ష్మమైన తప్పు చేసినా వెంటనే అర్థం చేసుకుంటారు. సాధారణంగా మనిషి తన తప్పులను పట్టించుకోడు.

ఒకసారి చెప్పుకున్నాము ఒక వ్యక్తి ఎవరిదో మామిడి కాయను అనుమతి లేకుండా కోసుకొని తీసుకొచ్చి నాకు ఇచ్చాడు. కానీ ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే ఎవరిదైనా వస్తువు వారి అనుమతి లేకుండా తీసుకోవడం ధర్మం కాదు.

అలాంటి సమయంలో అంతరాత్మ లోపల నుంచే చెబుతోంది "ఇది

నీది కాదు, దీనిని ముట్టుకోకూడదు, దీనికి దూరంగా ఉండాలి” అని. కానీ మనసు శుద్ధిగా లేకపోవడం వల్ల ఆ బోధ వినిపించదు. అందుచేత తప్పు చేస్తాడు.

ఒకటి మాత్రం ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. ధర్మంగా సంపాదించిన మజ్జిగ మెతుకులైనా శరీరంలోకి వెళ్లిన తర్వాత అమృతతుల్యంగా మారతాయి. కానీ అధర్మంగా సంపాదించిన ఆహారంతో పంచ భక్ష్య పరమాన్నాలు తిన్నా అవి శరీరంలోకి వెళ్లిన తర్వాత విషతుల్యంగా మారతాయి. ఇది తప్పకుండా గుర్తుపెట్టుకోవాలి. బ్రహ్మర్షి పత్రి గారు ఎంతో స్పష్టంగా ఒక విషయం చెబుతుంటారు  మనకు వంట చేసే వారి స్వభావాన్ని బట్టి కూడా ఆహారం యొక్క ప్రభావం ఆధారపడి ఉంటుంది. హింస చేసే వారు, మాంసాహారం తీసుకునే వారు, క్రూర స్వభావం కలిగిన వారు వంట చేస్తే ఆ ఆహారం మీ ఆధ్యాత్మిక పురోగతికి పూర్తిగా సహకరించదు. అందుకే “మీరే స్వయంగా వండుకొని తినండి” అని చెప్పేవారు. శాకాహారులు లేదా ధ్యానం చేసే వారు చేసిన ఆహారం మనసుకు, శరీరానికి, ఆత్మకు కూడా ఎంతో మేలు చేస్తుంది.

ఎందుకంటే మీరు తీసుకునే ఆహారం మీ ఆలోచనలపై, మనసుపై, ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. అందుచేత ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి నియమాలను పాటించినప్పుడే మోక్షానికి దగ్గరవుతారు.

ఈ విషయాలన్నీ వినడానికి, తెలుసుకోవడానికి మీలో ఆసక్తి ఉంది కాబట్టే మీరు ఇంత శ్రద్ధగా వింటున్నారు. కానీ వినడం మాత్రమే సరిపోదు, విన్న కొద్దీ ఆచరించే ప్రయత్నం చేయాలి. మీలో ఉన్న లోపాలను ఒక్కొక్కటిగా సరిచేసుకోవాలి. తప్పులను నెమ్మదిగా తొలగించుకోవాలి. ఒక్కసారిగా పూర్తిగా మారిపోవడం సాధ్యం కాదు. కానీ మీరు ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, మీ జీవితంలో ఇప్పటికే ఎన్నో తప్పులను మానేశారని మీకే అర్థమవుతుంది. “ఈ అబద్ధం చెప్పడం మానేశాను, ఈ తప్పు సరిచేసుకున్నాను” అని మీరు

గమనించగలుగుతారు. ఇంకా మిగిలిన లోపాలను కూడా సరి చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి.

సహజంగా ధర్మంగా జీవించేవారికి జీవితంలో కష్టాలు రావచ్చు. ధర్మాన్ని ఆచరించడం కొన్ని సందర్భాల్లో చాలా కష్టంగా అనిపించవచ్చు. కానీ ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని వదలకుండా నిలబడగలిగితే, మీ కంటే గొప్ప వారు ఎవరూ ఉండరు. ఒక విషయం ఎప్పుడూ మర్చిపోకూడదు మీరు చేసే ప్రతి పనిని పై లోక వాసులు గమనిస్తూ ఉంటారు. అంటే ఈ సృష్టికర్త అయిన భగవంతుడు అన్నింటినీ చూస్తూనే ఉంటాడు. మీరు చేసే మంచి పనులు అయినా, తప్పులు అయినా ఆయనకు తెలుస్తూనే ఉంటాయి.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు చేసే ప్రతి పని మీ ఖాతాలో రికార్డు అవుతూ ఉంటుంది. మీ గదిలో ఒక సీసీ కెమెరా పెట్టినట్లయితే అది ప్రతి కదలికను రికార్డు చేస్తుంది కదా! అలాగే భగవంతుడు కేవలం చూస్తూ ఉండడమే కాదు, ప్రతి కర్మను నమోదు చేస్తూ ఉంటాడు. అంతేకాదు, సమయానుసారంగా ఆ కర్మలకు తగిన ఫలితాన్ని కూడా ఇస్తాడు.

అందుచేత మీరు సరిగా జీవించాలంటే అంతరాత్మ ప్రబోధాన్ని వినగలగాలి. అంతరాత్మ చెప్పేది అర్థం కావాలంటే త్రికరణ శుద్ధి ఉండాలి. త్రికరణ శుద్ధి రావాలంటే మనసు శుద్ధి కావాలి. మనసు శుద్ధి కావాలంటే తీవ్రంగా "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాలి. ఎన్ని విషయాలు విన్నా, తెలుసుకున్నా, ఆచరణ లేకపోతే ప్రయోజనం ఉండదు. మీలో మార్పు రావాలి. అందుకోసమే ప్రతినెలా ఖచ్చితంగా భీమవరం రావాలి. అంతరంలో ఉన్న ఆత్మ నిరంతరం ధర్మాన్ని బోధిస్తూనే ఉంటుంది అన్న విషయాన్ని ఎప్పుడూ మర్చిపోకండి. ఆ బోధను వినడానికి ప్రయత్నించండి, విన్న దాన్ని జీవితంలో ఆచరించండి.

# "తప్పులు చేయని వాడు గొప్పవాడు కాదు, తప్పులు సరిచేసుకునే వాడే గొప్పవాడు"

లోకంలో మనం గమనించినట్లయితే రెండు రకాల వాళ్ళు మనకు కనిపిస్తూ ఉంటారు. ఒకడు తప్పులు చేసేవాడు, ఇంకొకడు తప్పులు సరిచేసుకునే వారు ఉంటారు.

చాలామంది ఉద్దేశం, ఎవరైతే తప్పులు చేయరో వాడే గొప్పవాడు అనే భావంలో ఉంటారు. కానీ పత్రి గారు ఏమన్నారంటే, తప్పులు చేయని వాడికంటే కూడా ఎవరైతే తప్పులు సరిచేసుకుంటూ ఉంటారో వారే గొప్ప వారు అని చెప్పారు.

ఎందుకంటే లోకంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన తప్పు చేస్తూనే ఉంటారు. అసలు ఏ తప్పూ చేయకపోతే భూమిపై జన్మ ఎందుకు తీసుకోవాలి? అందుచేత భూమి పైకి వచ్చిన ప్రతి మనిషి తనలో ఉన్న తప్పులను సరిచేసుకునే ప్రయత్నం చేయాలి. పత్రి గారు చెప్పారు, ఒక మానవ జన్మలో ప్రవేశించిన తర్వాత జన్మ లేని స్థితికి ఎదగడానికి సుమారు 400 నుంచి 500 జన్మలు పడతాయని. మరి ఈ జన్మలన్నిటిలో తనలో ఉన్న లోపాలను మరియు తప్పులను సరిచేసుకుంటూ ముందుకు సాగుతాడు. మానవ జన్మ అనేది కేవలం ఎంజాయ్ చేయడానికి కాదు, ఎంటర్టైన్మెంట్ కోసం కాదు. తన జీవితంలో తాను చేసే తప్పులను తెలుసుకుని వాటిని సరిచేసుకుంటూ ఉండడానికే ఈ మానవ జన్మ లభించింది.

ప్రతి ఒక్కరూ ఎన్నో జన్మలు ఎత్తారు. కాని 350 జన్మలు దాటితే తప్ప జ్ఞాన మార్గంలోకి రాలేరు. మరి అంతవరకు ఏమి చేయ లేదా? అంటే, ప్రారంభ జన్మల్లో ఎన్నో తప్పులు చేశారు. మధ్యస్థ జన్మల్లో కొన్ని తప్పులు సరిచేసుకున్నారు. ఇంకా చాలా వరకు సరిచేసుకోవాల్సి ఉంది. చివరి జన్మలోకి వచ్చేసరికి పూర్తిగా తప్పులు సరి చేసుకోవడంపైనే దృష్టి ఉంచుతారు.

మీరు అంతకుముందు క్లాసుల్లో, ముఖ్యంగా 70-80 ఎపిసోడ్లలో,

మానవుని లో ఎన్ని రకాల చెడు ఉంటుందో తెలుసుకున్నాం. వాటన్నింటినీ విశ్లేషించుకున్నాం. తప్పులు చేయడం సహజమే, కానీ వాటిని కొనసాగిస్తూ పోవడం మంచిది కాదు. వాటిని తెలుసుకుని సరిచేసుకోవాలి, అలా సరిచేసుకునే వాడే తెలివైనవాడు.

సహజంగా ప్రారంభ జన్మల్లో మరియు మధ్యస్థ జన్మల్లో మనుషులు తమోగుణం, రజోగుణంలో ఉంటారు. ఈ తమోగుణం, రజోగుణంలో ఉన్న వాళ్ళు తప్పులు చేస్తూనే ఉంటారు. దానికి ముఖ్య కారణం వారి గుణ లక్షణాలే. ఆ గుణాలలో ఉన్నవారు సహజంగానే తప్పులు చేస్తూ ఉంటారు.

కానీ మధ్యస్థ జన్మలను దాటి ముందుకు వచ్చినవారు సాత్విక గుణంలోకి ప్రవేశిస్తారు. ఇక్కడ బుద్ధి వికసించడం ప్రారంభమవుతుంది. మంచి ఏది, చెడు ఏది అనే తేడా అర్థమవుతుంది. ఈ అవగాహన కలగడం వల్ల "ఇది చేయకూడదు, ఇది చేయాలి" అనే జ్ఞానం వస్తుంది. అప్పుడు చేయకూడనివి మానేస్తాడు, చేయవలసినవాటిని చేస్తూ ఉంటాడు. ఆ సాత్విక గుణం ఇంకా పెరుగుతూ ఉంటే, తనలోని తప్పులను మరింత సరిచేసుకుంటూ ముందుకు సాగుతాడు.

అవతార్ మెహర్ బాబా వారు ఏమన్నారు అంటే, జన్మ తీసుకున్న తర్వాత ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ముళ్ళు వేసుకుంటూ ఉంటారు అని చెప్పారు. జీవితంలో ముళ్లు వేయడం అంటే కర్మలు పెంచుకోవడం. ఈ ముళ్ళు ఎంత ఎక్కువ పెరుగుతాయో, వారి జీవితం అంత నరకప్రాయంగా మారుతుంది. అక్కడ సరి చేసుకోవడం ఉండదు, తప్పులు చేస్తూ ఉండడం, వాటి ఫలితాలను అనుభవిస్తూ ఉండడమే ఆ జన్మలో వారి పని అవుతుంది.

తర్వాత కర్మలు చేసే కొద్దీ వాటి ఫలితంగా కష్టాలు వస్తాయి. అప్పుడు మనిషి ఆలోచనలో పడతాడు ఈ కష్టాలు ఎందుకు వస్తున్నాయి? అని. ఈ ఆలోచన రాకపోతే ఎలాంటి మార్పు ఉండదు. కానీ ఎప్పుడైతే ఈ ఆలోచన మొదలవుతుందో, అప్పుడు అర్థమవుతుంది.

పుస్తకాలు చదవడం వల్ల, గురువులను కలవడం వల్ల, వారి సందేశాలు వినడం వల్ల మనిషికి అవగాహన కలుగుతుంది. "నువ్వు చేసిన కర్మల ఫలితమే నీ కష్టాలు" అని తెలుసుకుంటాడు. అప్పుడు ఆలోచిస్తాడు "నేను ఇది చేయకపోయి ఉంటే ఈ కష్టం వచ్చేది కాదు కదా? నేను చేసిన పనుల వల్లే ఈ పరిస్థితి వచ్చింది. ఇప్పుడు నేను దాన్ని భరించలేకపోతున్నాను" అని బాధపడతాడు. కొందరికి ఈ బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కూడా వస్తాయి.

ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది అంటే, నేను చేసిన కర్మల వల్లే అని వాడికి అవగాహన కలుగుతుంది. అప్పుడు గురువుల దగ్గరకు వెళ్ళడం, ఉపన్యాసాలు వినడం, సత్సంగాలకు హాజరవడం, పండితుల మాటలు వినడం మొదలవుతాయి. యవ్వనంలో ఉన్నప్పుడు చాలా మంది వీటివైపు వెళ్ళరు. కానీ జీవితంలో ఒక స్థాయికి ఎదిగిన తర్వాత ఇవన్నీ వింటూ, తెలుసుకుంటూ ఉంటారు.

మొదట్లో తెలుసుకోవడం ప్రారంభమవుతుంది. తెలుసుకున్న తర్వాత కొంత ప్రయత్నం చేస్తూ ఉంటారు. "ఇవి చేయకూడదు" అని అనుకుంటారు. మొదట్లో ఈ స్థితిని "పురాణ వైరాగ్యం" అంటారు. పురాణ వైరాగ్యం అంటే, కష్టాలు వచ్చిన సమయంలో లేదా ఉపన్యాసాలు విన్నప్పుడు కొంతకాలం వైరాగ్యం కలగడం, కానీ కొంత సమయం తర్వాత మళ్లీ పాత అలవాట్లలోకి వెళ్ళిపోవడం జరుగుతుంది.

పురాణ వైరాగ్యం అంటే, మనిషి పురాణాలు వినడానికి వెళ్తాడు, అక్కడ మంచి విషయాలనే చెబుతారు. మంచి పనులు చేయమని, తప్పులు చేయవద్దని, పాపాలు చేయవద్దని ఉపదేశిస్తారు. ఎందుకంటే పాపాలు కష్టాలను తీసుకొస్తాయని, పుణ్యాలు శుభ ఫలితాలను ఇస్తాయని వివరిస్తారు. అలాగే కథలు, ఉదాహరణలు చెప్పి జీవిత సత్యాలను అర్థమయ్యేలా చెబుతారు. అవన్నీ వింటున్నప్పుడు వాడికి "ఇవి కరెక్టే కదా! ఇక మీదట నేను తప్పులు

చేయకూడదు. నా జీవితాన్ని మార్చుకోవాలి" అని అనిపిస్తుంది. కానీ ఇంటికి వెళ్ళిన తర్వాత మళ్ళీ యథావిధిగా పాత అలవాట్లతోనే జీవిస్తూ ఉంటారు. ఆ క్షణంలో మాత్రమే వైరాగ్యం కలుగుతుంది. దీనినే "పురాణ వైరాగ్యం" అని అంటారు.

ఇలా జీవితం సాగుతుండగా కష్టాలు మరింత పెరుగుతాయి. అప్పుడు మనిషిలో ఆలోచన ఎక్కువ అవుతుంది. "నేను ఈ కష్టాలను భరించలేక పోతున్నాను, వీటి నుంచి బయట పడాలి, ఇలా జీవించలేను" అనే తీవ్రమైన తపన కలుగుతుంది. అప్పుడు సద్గురువుల కోసం వెతుకుతాడు. వెతికి సద్గురువును ఆశ్రయించినప్పుడు, గురువు ఇలా చెబుతాడు "నాయనా! నువ్వు చేసుకున్న తప్పుల వల్లే నీ జీవితం ఇలా మారింది, ఇకపై తప్పులు చేయకు, వీలైనంత వరకు మంచి పనులు చేయి. అలాంటి మార్పు రావాలంటే ధ్యానం చేయాలి, ధ్యానం చేస్తే నీలో మంచి మార్పులు వస్తాయి, ఇతరులకు ఉపకారం చేయగలవు. అప్పుడు నీ కష్టాలు తగ్గుతాయి" అని కర్మ సిద్ధాంతం గురించి వివరంగా బోధిస్తారు.

సద్గురువులు "గతంలో నువ్వు చేసిన కర్మల ఫలితాలను ఇప్పుడు అనుభవిస్తున్నావు. ఇప్పుడు నువ్వు చేసే మంచి పనులు, సేవలు నీ భవిష్యత్తును మారుస్తాయి, అప్పుడు నీకు కష్టాలు తగ్గుతాయి" అని చెబుతారు. ఆ మాటలు విన్న తర్వాత వారు మంచి మార్గంలో నడవడానికి ప్రయత్నం చేయడం ప్రారంభిస్తారు.

నా జీవితంలో ఇలాంటి ఎన్నో సంఘటనలు చూశాను. ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవారు, కుటుంబ గొడవల్లో చిక్కుకున్నవారు, తిట్టుకునేవారు, కొట్టుకునేవారు, ఒకరినొకరు చూడలేని స్థితికి చేరుకున్నవారు, విడాకులు తీసుకున్నవారు, తీవ్రంగా బాధపడి ఆత్మహత్యలు చేసుకున్నవారు కూడా ఉన్నారు. అలాగే అకస్మాత్తుగా వచ్చే అనేక రకాల రోగాలతో బాధపడేవారు కూడా ఉన్నారు. "వీపునొప్పి, మోకాళ్ల నొప్పి, కడుపునొప్పి,

తట్టుకోలేని బాధ" అని చాలా మంది వచ్చి చెబుతుంటారు.

అప్పుడు నేను వారిని ఒకటే ప్రశ్న అడుగుతాను "మీరు ఇంకా మాంసాహారం తింటున్నారా?" అని. కొందరు "లేదండి, మానేశాం" అంటారు. "ఎప్పటి నుంచి మానేశారు?" అని అడిగితే, "నాలుగు నెలలు అయ్యింది, ఆరు నెలలు అయ్యింది, ఏడాది అయ్యింది" అని చెబుతారు. అప్పుడు నేను చెబుతాను "అప్పటి వరకు తిని పాపం చేశావు కదా? ఇప్పుడు దాని ఫలితాన్ని అనుభవిస్తున్నావు. కనీసం ఇప్పటి నుంచైనా పూర్తిగా మానేయి". వాళ్లు "మానేశాం గానీ నొప్పులు తగ్గడం లేదు" అంటారు. అప్పుడు నేను అడుగుతాను "మాంసం వండుతున్నావా?" అని. "వండుతున్నాం" అంటారు, అప్పుడు నేను చెబుతాను "నువ్వు తినకపోయినా వండుతున్నావు కదా? వండాలంటే ఆ జంతువును చంపాలి కదా? ఆ హింసలో నువ్వూ భాగస్వామివే, మరి ఆ కర్మల నుంచి ఎలా బయటపడగలవు?" అని నిర్మొహమాటంగా చెబుతాను.

సాధారణంగా చాలామంది "ధ్యానం చేయండి, కష్టాలు పోతాయి, పిరమిడ్‌లో కూర్చోండి" అని మాత్రమే చెబుతారు. కానీ అసలు కష్టం ఎందుకు వచ్చిందో అవగాహన కల్పించాలి. ఒకసారి ఆ కారణం అర్థమైతే, మనిషి మళ్ళీ అలాంటి తప్పులు చేయడానికి భయపడతాడు. అందుకే కొత్త ప్రదేశాలకు వెళ్ళినప్పుడు కర్మ సిద్ధాంతం గురించి అవగాహన కల్పించాలి. కర్మ సిద్ధాంతం ఎంత బాగా అర్థమైతే, అంత మార్పు వస్తుంది.

కొంతమంది వెంటనే అర్థం చేసుకోరు, ఎంత చెప్పినా పట్టించుకోరు. కానీ కొందరికి మాత్రం "కరెక్టే కదా!" అని బలంగా అనిపిస్తుంది. అప్పుడు ఎక్కడైనా మాంసాహారం తినే అవకాశం వచ్చినా, "ఇదే కదా నా కష్టాలకు కారణం" అని గుర్తుకు వచ్చి తినడం మానేస్తారు. ఇలా మనుషులు రకరకాల స్థాయిల్లో ఉంటారు.

అందుకే ఒక విషయం గుర్తుంచుకోవాలి ఎవరైతే తమ తప్పులను సరిచేసుకుంటూ ఉంటారో, వారే గొప్ప స్థితికి ఎదిగినవారు. అవతార్ మెహర్

బాబా వారు కూడా ఇదే చెప్పారు. ప్రారంభ జన్మల్లో మనిషి తన జీవితంలో ముళ్ళు వేసుకుంటూ ఉంటాడు. అంటే కష్టాలను పెంచుకుంటూ ఉంటాడు. ముళ్ళు పెరిగే కొద్దీ జీవితం బాధతో నిండిపోతుంది. కానీ చివరి జన్మల్లో సద్గురువును ఆశ్రయించి సాధనలోకి వచ్చిన తర్వాత ఆ ముళ్ళను ఒక్కొక్కటిగా తీసేస్తూ ఉంటాడు.

ఈ కష్టాలను అనుభవించడం ద్వారా కర్మలు కరిగిపోతాయి. అంటే వేసుకున్న ముళ్ళను తీసేసుకున్నట్టే. ఎప్పుడైతే అన్ని ముళ్ళూ పూర్తిగా తొలగిపోతాయో, అప్పుడు జన్మలేని స్థితికి ఎదుగుతాడు.

అంతులేని కర్మలను ఎలా దహనం చేయాలి అనే మార్గాన్ని భగవద్గీత లో శ్రీ కృష్ణుడు "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అని చెప్పారు. అంటే జ్ఞానం అనే అగ్నిలో కర్మలు దగ్ధం అవుతాయి. అందుకోసం సద్గురువును ఆశ్రయించి జ్ఞానాన్ని పెంచుకోవాలి. తీవ్ర ధ్యాన సాధన చేయాలి. "శ్వాసపై ధ్యాస" ఉంచాలి, సాత్విక ఆహారం తీసుకోవాలి, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి, ఆత్మజ్ఞాన సందేశాలు వినాలి, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి.

చివరి దశలో ఉన్నవారికి సేవల్లో కూడా రెండు రకాలున్నాయని అర్థమవుతుంది  దేహ సేవలు మరియు ఆత్మ సేవలు. దేహ సేవలు తాత్కాలికమైనవి, కానీ ఆత్మ సేవలు శాశ్వతమైనవి, గొప్పవి. అందుకే వారు ఆత్మ సేవలో ఎక్కువగా పాల్గొంటారు. అప్పుడు తమలోని తప్పులను సులభంగా గుర్తించి సరిచేసుకునే స్థితికి చేరుకుంటారు.

మీలో ఎన్నో రకాల చెడు లక్షణాలు, తప్పులు ఉన్నాయని మీరు తెలుసుకున్నారు. వాటిని తెలుసుకోవడమే కాదు, వాటిని సరిచేసుకునే మార్గాలను కూడా తెలుసుకున్నారు. మనసు శుద్ధి అయ్యే కొద్దీ తప్పులు తగ్గిపోతాయి. తర్వాత బుద్ధి వికసిస్తుంది. "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్ర ధ్యానం చేస్తే బుద్ధి మరింత వికసిస్తుంది, వివేకం, విచక్షణ పెరుగుతాయి. అప్పుడు చేయకూడనివి చేయరు, చేయవలసినవే చేస్తారు.

ఇలా సాధన పెంచుకొని జ్ఞానం సంపాదించుకున్నవారు తమలోని లోపాలను పూర్తిగా సరిచేసుకోగలుగుతారు. భవిష్యత్తులో తప్పులు చేయకుండా జీవించగలుగుతారు. అంతేకాదు, జ్ఞానం పెరిగే కొద్దీ గత జన్మ కర్మలను కూడా దహనం చేసుకోగలుగుతారు.

ఇప్పుడు మీరంతా  తప్పులు సరిచేసుకునే స్థాయిలోనే ఉన్నారు. మీరు తప్పులను తెలుసుకుంటున్నారు. వాటిని సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని ప్రాపంచిక పరిస్థితుల వల్ల తప్పులు జరుగుతున్నా, వాటిని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నారు.

పత్రి గారు చెప్పినట్లుగా  "తప్పులు చేయని వాడు గొప్పవాడు కాదు, తప్పులు సరిచేసుకునే వాడే గొప్పవాడు." మీ దృష్టి ఎప్పుడూ "నేను ఎన్ని తప్పులు చేస్తున్నాను? వాటిలో ఎన్ని సరిచేసుకోవాలి?" అన్నదానిపై ఉండాలి.

ఈ జన్మలో ఎక్కువ తప్పులు సరి చేసుకోగలిగితే, అంత గొప్పవారిగా ఎదగగలుగుతారు. తనలోని లోపాలను సరిచేసుకున్న వాడే నిజమైన గొప్పవాడు. అవసరాలకు సరిపడా సంపాదించుకుని, మిగిలిన జీవితాన్ని ఆత్మశుద్ధి కోసం వినియోగించాలి.

అదృష్టవశాత్తు మీరు ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చారు. అందుకే ఈ విషయాలన్నీ తెలుసుకో గలుగుతున్నారు. మనసు శుద్ధి అయితే కొన్ని తప్పులు పోతాయి,  బుద్ధి వికసిస్తే ఇంకా ఎక్కువ తప్పులు తొలగిపోతాయి. జ్ఞానం సంపాదిస్తే తప్పులు పూర్తిగా నశించిపోతాయి. అందుకే  అందరు నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉండాలి.

# “సత్యమే ఎప్పుడూ జయిస్తూ ఉంటుంది, అసత్యం అపజయం పాలు అవుతుంది”

మనం ఒక ముఖ్య విషయం గురించి తెలుసుకుందాం. ముఖ్య విషయం అని ఎందుకు అన్నాను అంటే ఇది మర్చిపోకూడనటువంటి విషయం, నిరంతరం గుర్తుంచుకోవాల్సినటువంటి విషయం. ఎప్పుడైతే ఈ విషయాన్ని అంతలా గుర్తుంచుకుంటారో జీవితంలో దాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు, వారు అంతులేని లాభాన్ని పొందుతారు.

ప్రతి ఒక్కరు ఏమనుకుంటారంటే? జీవితంలో నేను ఏం చేసినా జయం కలగాలి, ఫెయిల్యూర్ అవ్వకూడదు అని అనుకొంటారు. ఏది తలపెట్టినా, ఏది అనుకున్నా, ఏది చేసినా సక్సెస్ అవ్వాలనుకుంటారు. మరి అలా సక్సెస్ అవ్వాలి అంటే ఎవరు సక్సెస్ అవ్వగలరు? సత్యాన్ని ఆశ్రయించిన వారే సక్సెస్ అవుతారు.

అందుచేత ముందు సత్యం అంటే ఏమిటి? అసత్యం అంటే ఏమిటి? తెలుసుకుందాం.

సత్యం అంటే నిత్యమైనది, శాశ్వతమైనది, ఎల్లప్పుడూ ఉండేది, మార్పు చెందనిది, కాలమే కాదు యుగాలు మారినా కూడా మారనిది. అలాంటిది ఈ సృష్టిలో ఒక్కటే ఒకటి అదే భగవంతుడు, అదే ఆత్మ. ఆత్మే సత్యము.

అసత్యము అంటే ఆత్మ కానివన్నీ అసత్యమే.

ఇంకా ఈ రెండింటికీ తేడా ఏమిటంటే? సృష్టింపబడనిది సత్యము, సృష్టిచేయబడింది అసత్యం.

కనపడనిదే సత్యము, కనపడేవన్నీ అసత్యమే! సత్యం అంత గొప్పది అంటే భగవంతుడు అంత గొప్పవాడు, అంటే ఆత్మ అంత గొప్పది. ఇది మీరు అర్థం చేసుకుంటే ఎప్పుడూ సత్యాన్నే ఆశ్రయిస్తారు, అసత్యం మీద

ఆసక్తి చూపించరు.

మన అదృష్టం కొద్దీ మనందరి గురువు గారైనటువంటి పత్రి గారు సత్యాన్ని ఆశ్రయించే అద్భుతమైన మార్గాన్ని అందించారు. నిజంగా ఆయనే కనుక పరిచయం కాకపోతే సత్యం అంటే ఏమిటో కూడా మనకు తెలియదు.

ఎందుచేతనంటే సృష్టిలో మీరు ఏది చూస్తున్నా, మీకు ఏది కనబడుతున్నా అన్నీ సత్యం నుంచే ఉద్భవించాయి. కోటాను కోట్ల లోకాలు కానీ, కోటాను కోట్ల జీవరాశులు కానీ అన్నీ సత్యం నుంచి ఉద్భవించినవే. అంటే ఇవన్నీ అశాశ్వతమైనవే, ఎప్పుడో ఒకప్పుడు అదృశ్యమయ్యేవే.

అందుచేత తెలివైన వారు ఏం చేస్తారు అంటే సత్యాన్నే ఆశ్రయిస్తారు. సత్యాన్ని ఆశ్రయించిన వారు పొందనిది అంటూ ఉండదు, తెలుసుకోలేనిదంటూ ఏదీ ఉండదు. సత్యాన్ని ఆశ్రయించడం వల్ల మీరు పొందేవన్నీ కూడా మీ కూడా వస్తాయి, దానివల్ల మీకు ఆనందం పెరుగుతుంది, ఎన్నో లాభాలు కూడా కలుగుతాయి.

ఎందుచేతనంటే సత్యం శాశ్వతం కాబట్టి, సత్యాన్ని ఆశ్రయించిన వారు పొందేవన్నీ శాశ్వతంగా ఉంటాయి. మీరు అసత్యాన్ని పొందినట్లయితే అశాశ్వతమైనవి పొందినట్టు. అవి ఎప్పుడో ఒకప్పుడు అదృశ్యమైపోతాయి.

మీరు భార్యను పొందారు, లేకపోతే భర్తను పొందారు. భార్య అయినా భర్త అయినా ఏవరైతే సృష్టింపబడ్డారో వారు అసత్యం అని చెప్పుకున్నాం. మీరు గమనిస్తే ఈ అసత్యమైనవి పొందినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. కానీ వారు శాశ్వతం కాకపోవడం వల్ల ఎప్పుడో ఒకప్పుడు వారు మీకు దూరమవుతారు.

అప్పుడు మీరు అంతులేని దుఃఖానికి లోనవుతారు, విలపిస్తారు, ఆ దుఃఖాన్ని తట్టుకోలేరు. కానీ మీరు పొందేటప్పుడే ఇవి శాశ్వతం కావు ఎప్పుడో ఒకప్పుడు ఇవన్నీ దూరమయ్యేవే అని గుర్తుంచుకొంటే మీకు ఆ

దుఃఖం వుండదు. భార్యా, భర్త, మీ పిల్లలు, మీ సంపదలు, మీ పదవులు, మీ ఉద్యోగం, కనిపించేది ఏదైనా సరే అసత్యమే! అశాశ్వతమే.

అందుచేత పొందినప్పుడు తాత్కాలికంగా బాగానే ఉంటుంది. దూరమైనప్పుడు అంతులేని దుఃఖానికి లోనవుతారు. అందుకే అసత్యాన్ని పొందిన వారు, అసత్యం మీదే దృష్టి పెట్టిన వారు, అసత్యాన్ని సంపాదించాలనుకునే వారు చివరికి దుఃఖం పొందవలసిందే!

కానీ మీరు ఎప్పుడైతే సత్యాన్ని పొందుతారో అది పొందినప్పుడు అనిర్వచనీయమైన ఆనందానుభూతిని పొందుతారు. అంత ఆనందం పొందిన వాళ్ళకు ఇక దేని మీద దృష్టి ఉండదు.

దేన్నైనా సరే దేనికోసం పొందాలని చూస్తారు? వాటి వల్ల వచ్చే సంతోషం వల్ల. సంతోషం ఎప్పుడూ అశాశ్వతం. ఆనందం ఒక్కటే శాశ్వతం. మనకి పత్రి గారు అలెగ్జాండర్ స్టోరీ చెప్తూ ఉంటారు.

అలెగ్జాండర్ ప్రపంచాన్ని జయించాడు. అపారమైన సైన్యాన్ని పెంచుకున్నాడు, ఎన్నో రాజ్యాలు జయించాడు. తిరుగులేకుండా ప్రపంచమంతా పర్యటించాడు, కాని తిరిగి వెళ్ళేటప్పుడు దారిలో డయోజినిస్ అనే ఒక గొప్ప యోగిని కలిశాడు.

ఆయనతో మాట్లాడదాం అనుకుంటే డయోజనీస్ రానన్నాడు. చివరికి అలెగ్జాండర్ ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఏంటి నువ్వు అంత గొప్పవాడివా? ప్రపంచానికే నేను చక్రవర్తిని, నేను కబురు చేస్తే ఎందుకు రాలేదు అన్నాడు. సరే నా గురించి చెప్తాను ముందు నీ గురించి చెప్పు అన్నాడు.

నేను ఈ ప్రపంచాన్ని జయించిన గొప్ప చక్రవర్తిని. నేను ఇప్పుడు ఎన్నో దేశాలు జయించి ఇక్కడ ఉన్న సంపదలన్నిటిని కొల్లగొట్టి నా రాజ్యానికి వెళ్తున్నాను అన్నాడు. అప్పుడు డయోజీనస్ అడిగాడు, ఇంతమందిని చంపి

ఇంత ధనం తీసుకుని దేశానికి వెళ్తున్నావు, ఏం చేస్తావ్? అన్నాడు. నేను గొప్ప ప్యాలస్ కట్టి హాయిగా ఉంటాను అన్నాడు.

అప్పుడు డయోజనిస్ అన్నాడు నువ్వు హాయిగా సంతోషంగా ఉండడానికి ఇంత మందిని చంపావే! నేను ఏమీ చేయకుండా ఎప్పుడూ తృప్తిగా, సంతోషంగా ఉంటున్నాను. ఇన్ని చేశావు కానీ చివరికి నువ్వు నీ దేశం దాకా చేరుకుంటావో? లేదో? కూడా నాకు సందేహమే అన్నాడు.

డయోజనిస్ అన్నట్టు అలెగ్జాండర్ తన దేశం చేరే లోపులోనే చనిపోవడం జరిగింది. అంటే అశాశ్వతమైనవి ఎన్ని సంపాదించినా, అసత్యాలు ఎన్ని పోగేసుకున్నా అవి కూడా రావు, వాటి వల్ల ఆనందం ఉండదు.

అందుచేత పత్రి గారు ఏం చెప్తారంటే సత్యాన్ని ఆశ్రయించండి అంటారు. మన అదృష్టం కొద్దీ పత్రి గారు సత్యాన్ని ఆశ్రయించే అద్భుతమైన ధ్యాన సాధన ఇచ్చారు. అదే "శ్వాస మీద ధ్యాస". ఎప్పుడైతే మీరు "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తారో మీరు సత్యాన్ని ఆశ్రయించిన వారు అవుతారు అంటే ఆత్మను ఆశ్రయించిన వారు అవుతారు.

అప్పుడు అన్ని విషయాల్లో మీరు జయం సాధిస్తారు. ఎందుచేతనంటే ధ్యానంలో కళ్ళు మూసుకున్నప్పుడు శరీరం లోపల ఉంటారు, తరువాత ఆలోచనలు వస్తాయి. ఆలోచనలు కట్ చేసి శ్వాస మీద పెట్టినప్పుడు మనసు కూడా ఆగిపోతుంది. అక్కడ ఆత్మ అంటే సత్యం ఒకటే ఉంటుంది.

అప్పుడు మీరు సత్యాన్ని ఆశ్రయించిన వారు అవుతారు. సత్యాన్ని ఆశ్రయించిన వారికి ఎప్పుడూ జయమే, ఆనందమే, ఆరోగ్యమే.

అందుకే చూడండి చాలామంది హాస్పిటల్స్ మధ్యలో ఉంటారు. ఏదో ఒక రోగంతో ఇబ్బంది పడతారు. కానీ ఋషులు, మహర్షులు, యోగులు, బాలయోగులు హిమాలయాల్లోనో, అడవుల్లోనో, ఆశ్రమాల్లో ఉంటారు. మరి వాళ్ళకి ఏ జబ్బు ఉండదు, సాధన చేసుకుంటూ ఆనందానుభూతిలో ఉంటారు.

వారికి అంతకన్నా ఏం కావాలి.

మీకు అన్నీ వుండి కూడా రోజూ దుఃఖమే! దాని గురించి, దీని గురించి ఆలోచించి అది అవ్వలేదని, ఇది అవ్వలేదని, వారికి అది జరగలేదని, వీడికి ఇది జరగలేదని, దుఃఖ పడుతూ ఉంటారు.

అందుచేత  అదృష్టం కొద్దీ సత్యాన్ని ఆశ్రయించే సాధన పత్రిగారు ఇవ్వడం జరిగింది. కానీ "శ్వాస మీద ధ్యాస" తప్ప ఇంకే రకమైన ధ్యానం చేసినా వారు అసత్యంతోటే ఉంటారు. అసత్యాన్ని ఆశ్రయించిన వారు తాత్కాలికంగా కొన్ని లాభాలు పొందొచ్చు కానీ చివరికి వాళ్ళు అపజయం పాలవుతారు.

అందుచేత సత్యాన్నే మీరు ఆశ్రయించాలి. మరి ఈ విషయం పత్రి గారు ఒకసారి భీమవరం వచ్చినప్పుడు కూడా  చెప్పడం జరిగింది. అప్పుడు ఏం చెప్పారంటే;

"ఎక్కడ సత్యం ఉందో మీరు అక్కడికి వచ్చారు, మీరు సత్యం దగ్గరికి వెళ్తే మీరు కూడా సత్యం అవుతారు. మీరు సత్యం అయితే మీ దగ్గరికి వచ్చేవాళ్ళు కూడా సత్యం పొందుతారు. సత్యం నుంచి ఆరోగ్యము, ఆనందం, సంతోషము.

అసత్యంలో ఆరోగ్యం ఉంటుందా? ఏంటి? సత్యంలో ఆరోగ్యం ఉన్నప్పుడు అసత్యంలో అనారోగ్యం ఉంటుంది. సత్యంలో ఆనందం ఉంటుంది, అసత్యంలో దుఃఖం ఉంటుంది.

"సత్యమేవ జయతే" అన్నది ఉపనిషత్ వాక్యం. సత్యమేవ అంటే సత్యం మాత్రమే, జయతే అంటే జయిస్తుంది. అసత్యం ఎప్పుడు అపజయంగానే ఉంటుంది" అన్నారు.

అందుకే నేను ఎవరు ఎన్ని చెప్పినా, ఎన్ని అన్నా ఎంతమంది ఎన్ని విమర్శలు చేసినా ఈ "శ్వాస మీద ధ్యాస" వదలలేదు. ఎందుకంటే నాకు అర్థమైంది. "శ్వాస మీద ధ్యాస"  ద్వారా మాత్రమే మనం సత్యాన్ని

ఆశ్రయించగలుగుతాం.

అది కాకుండా మీరు మ్యూజిక్ పెట్టుకున్నా, గైడింగ్లు చేసినా, సంకల్ప ధ్యానాలు చేసినా, ఎన్ని రకాలు చేసినా అసత్యమైన మనసు దగ్గరే ఆగిపోతారు. అదేదో తాత్కాలికంగా తృప్తి కలిగించొచ్చు, కానీ చివరికి వాళ్ళు అపజయం పాలవుతారు. అసలు మళ్ళీ కనబడరు, ఎలా అదృశ్యం అయిపోతారో మనకు తెలియదు.

అందుచేత సత్యం యొక్క గొప్పతనం నేను తెలుసుకున్నాను కాబట్టే ఈ "శ్వాస మీద ధ్యాస" వదలకుండా పట్టుకోవడానికి కారణం. మరి అంతలా పట్టుకున్నాను కాబట్టే నేను కానీ, మేడం కానీ ఇన్ని పుస్తకాలు వ్రాయగలిగాం, ఇన్ని వీడియోలు చేయగలిగాం, ఇన్ని చోట్ల తిరగగలుగుతున్నాం, ఇన్ని చెప్పగలుగుతున్నాం.

ఎక్కడికి వెళ్ళినా ఆవిడ నోటి వెంట ఏవో కొత్త విషయాలు వస్తాయి, నా నోటి వెంట ఏవో కొత్త విషయాలు వస్తాయి. కారణం సృష్టిలో జ్ఞానం అనంతం. అనంతమైన జ్ఞానం సత్యాన్ని ఆశ్రయించిన వారే చెప్పగలరు, బోధించగలరు. నేను అందుకే మిమ్మల్ని కూడా భీమవరం మానకుండా రండి, మార్నింగ్ జూమ్ మానకుండా కూర్చోండి, సత్యాన్ని ఆశ్రయించండి అని చెప్తాను.

రోజులో రెండు గంటలు, బ్రహ్మ ముహూర్తంలో రెండున్నర గంటలు! సత్యాన్ని ఆశ్రయించడానికి మంచి అవకాశం! మిగతా 22 గంటలు దేనికైనా కేటాయించుకోండి. సత్యాన్ని రెండున్నర గంటలు ఆశ్రయించలేరా? నెలలో 30 రోజులు ఉంటే మూడు రోజులు భీమవరం కేటాయించలేరా? అదే మళ్ళా చెప్తున్నాను సత్యమే ఎప్పుడూ జయిస్తుంది, అసత్యం అపజయం పాలవుతుంది అని మర్చి పోకండి. ఇది వేదాల్లో ఉన్నటువంటి సందేశము.

# ‘పంచింది పెంచబడుతుంది’

ఈ విషయాన్ని నేను పత్రి గారి దగ్గర తెలుసుకున్నాను. ఆయన దగ్గర తెలుసుకున్న ఈ చిన్న వాక్యం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది, ఎంతో లాభాన్ని కలిగించింది, నన్ను చాలా ఆలోచింపజేసింది.

లోకంలో ప్రాపంచికంగా జీవించే వారు ఉన్నారు, ఆధ్యాత్మికంగా జీవించేవారు కూడా ఉన్నారు. ప్రాపంచిక లాభాలు కోరుకునే వారు ఉన్నారు, ఆధ్యాత్మిక లాభాలు కోరుకునే వారు కూడా ఉన్నారు. ప్రాథమిక జన్మలలో ఉన్నవారు ప్రాపంచిక లాభాలను కోరుకుంటారు, చివరి జన్మలలో చేరుకున్న వారు ఆధ్యాత్మిక లాభాలను కోరుకుంటారు. కానీ సృష్టిలో ఉన్న ఈ సూత్రం అందరికీ వర్తిస్తుంది.

ప్రతి ఒక్కరి ఆత్మ స్థితిని బట్టి వారి కోరికలు ఉంటాయి. ప్రాపంచికంగా సంపాదించుకోవాలనుకునేవారు ఉంటారు, ఆధ్యాత్మికంగా సంపాదించుకోవాలనుకునేవారు కూడా ఉంటారు. ప్రాపంచికంగా ధనం కావాలనుకుంటారు, ఆధ్యాత్మికంగా జ్ఞానం కావాలనుకుంటారు. ప్రాపంచికంగా ధనం పెంచుకుంటే గొప్పవాడని అనుకుంటారు, ఆధ్యాత్మికంగా జ్ఞానం పెంచుకుంటే గొప్పవాడని అనుకుంటారు.

కానీ ఎవరికైనా ఒకే సూత్రం వర్తిస్తుంది. ఏదైనా పెరగాలంటే పంచాలి, పంచకుండా ఎవరూ ఏదీ పొందలేరు. లోకంలో సహజంగా కోరుకోవడం అలవాటు అయిపోయింది. కానీ కోరుకుంటే పెరగదు, పంచితేనే పెరుగుతుంది.

ప్రాపంచికంగా చూస్తే ఆర్థికంగా చాలా స్థాయిల్లో మనుషులు ఉంటారు. పేద వారి నుండి కోటీశ్వరుల వరకు ఉంటారు. వారు గతంలో పంచిన దాన్ని బట్టి వారి ప్రస్తుత జీవితం ఉంటుంది. ఉన్నదానితో సంతృప్తి

లేకపోతే ఇంకా పెంచుకోవాలంటే తప్పనిసరిగా పంచాలి. ఈ సృష్టి రహస్యాన్ని అర్థం చేసుకున్నవారు ఉన్నదాంట్లో పంచి, పెంచుకుంటారు.

అలాగే ఆధ్యాత్మికంగా కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. గతంలో పంచిన జ్ఞానం ఆధారంగా ప్రస్తుత జ్ఞాన స్థితి ఉంటుంది. ఇంకా జ్ఞానం పెంచుకోవాలంటే పంచాలి. దానికి ఉదాహరణగా మా ఇద్దరి అనుభవమే చెప్పవచ్చు. పదిహేను సంవత్సరాల క్రితం మేము చెప్పిన విషయాలు ఇప్పుడు వింటే, ఎంత మార్పు వచ్చిందో తెలుస్తుంది. మాలో ఎంత ఎదుగుదల జరిగిందో అర్థమవుతుంది.

మీ అందరిలో కూడా ఇదే మార్పు నేను గమనించాను. ఐదు లేదా పది సంవత్సరాల క్రితం మీ జ్ఞానం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో చూస్తే చాలా తేడా ఉంటుంది. ఈ మార్పు ఎందుకు వచ్చింది అంటే, మీరు ఈ సూత్రాన్ని పాటించడం వల్లే. మీరు పొందిన జ్ఞానాన్ని పంచే ప్రయత్నం చేస్తున్నారు. సందేశాల ద్వారా, పుస్తకాల ద్వారా, సేవల ద్వారా ఇతరులకు జ్ఞానాన్ని పంచుతున్నారు. దాని ఫలితంగా మీలో కూడా మార్పు కనిపిస్తుంది.

పత్రి గారి పరిచయం అయినప్పుడు "నేను ఆత్మను" అనే జ్ఞానం నాకు తెలిసింది. ఆత్మకు లాభం కలిగించేది జ్ఞానమే అని అర్థమైంది, ఎంత జ్ఞానం ఉంటే వాడు అంత గొప్పవాడని తెలుసుకున్నాను. అయితే జ్ఞానం పెంచుకోవాలంటే ఏమి చేయాలి? దానికి తేలికైన మార్గం పంచడమే అని పత్రి గారి సందేశం ద్వారా తెలుసుకున్నాను.

ఆ రోజు నుండి "శ్వాస మీద ధ్యాస"తో ధ్యానం చేయడం ప్రారంభించాము. ఆత్మజ్ఞానం బోధించే పుస్తకాలు చదవడం మొదలుపెట్టాము, సందేశాలు వినడం ప్రారంభించాము. మేము పొందిన జ్ఞానాన్ని వీలైనంతగా పంచుతున్నాము, ఊరూరా తిరిగి పంచుతున్నాము. మా సమయం, శక్తి, వాక్కు, వనరులను ఈ సేవకే వినియోగిస్తున్నాము.

ఇతరులకు జ్ఞానం పంచడానికి ఇంద్రియ శక్తులను కూడా ఉపయోగిస్తున్నాము. దాని ఫలితంగా మాలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది, అందుకే మీ అందరికీ చెబుతున్నాను మీరు ఎంత తెలుసుకుంటే అంత పంచండి, అవకాశం ఉన్న చోట క్లాసులు చెప్పండి. త్వరగా జ్ఞానం పెంచుకోవాలంటే ఇదే సులభమైన మార్గం, ముందు జ్ఞానం సంపాదించుకోండి, తర్వాత దాన్ని పంచండి.

అయితే పంచడంలో స్వార్థం ఉండకూడదు అంటే లాభాపేక్ష ఉండకూడదు. ఈ ప్రపంచంలో ధ్యాన మార్గంలో ఉన్నవారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు.

ఆ మార్గంలో ఉన్నవారిలో కూడా జ్ఞాన మార్గంలోకి వచ్చే వారు చాలా కొద్దిమంది మాత్రమే. అలాంటి వారిలో మీరు ఒకరు. కాబట్టి ఇతరులతో పోల్చుకోవద్దు.

మీకు ఏది కావాలో దాని కోసం ఈ సూత్రాన్ని పాటించండి. మీరు సుఖంగా ఉండాలంటే ఇతరుల సుఖం కోసం కూడా కృషి చేయండి, మీరు సంతోషంగా ఉండాలంటే ఇతరులను సంతోషపరచండి, మీరు ఆనందంగా ఉండాలంటే ఇతరులను ఆనందింపజేయండి. మీరు ధ్యానంలో ఎదగాలంటే అందరికీ ధ్యానం పంచండి, మీరు శాంతిగా ఉండాలంటే అన్ని ప్రాణులు శాంతిగా ఉండేలా చూడండి. మీకు నచ్చనిది ఇతరులకు చేయవద్దు, మీకు కావలసిన దాన్ని ఇతరులకు చేయండి.

అప్పుడు మీ జీవితం ఎలా మారుతుందో మీరు చూడగలుగుతారు. కాబట్టి ఏది పెరగాలన్నా పంచాలి అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

# “ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు”

ఇది అర్థం చేసుకొని మీ జీవితంలో అన్వయించుకుంటే జీవితంలో దుఃఖం కలగదు. ముఖ్యంగా మీ విషయంలోనే మీరు చూసుకుంటే ముందు బాల్యావస్థలో ఉండేవారు, అలాగే శాశ్వతంగా ఉన్నారా? అంటే లేదు. కొన్నాళ్ళకి ఆ అవస్థ మారిపోతుంది.

యవ్వనావస్థ వస్తుంది, పోన్లే అది శాశ్వతంగా ఉంటుందా? అంటే కొన్నాళ్ళకి అది పోతుంది. కౌమారావస్థ వస్తుంది, అది శాశ్వతంగా ఉంటుందా? అంటే అది ఉండదు, కొన్నాళ్ళకి అది పోయి వృద్ధాప్యం వస్తుంది. అదీ శాశ్వతంగా ఉండదు, అది కొన్నాళ్ళు ఉంటుంది, చివరకు జీవితమే అయిపోతుంది.

ఒకప్పుడు ఉన్న మీరు ఏమయ్యారో తెలియదు, ఎవరిని చూసినా అంతే! ఎవరు శాశ్వతం కాదు, ఎవరి జీవితము శాశ్వతం కాదు. మీరు గమనించండి యవ్వనంలో ఉన్నప్పుడు స్త్రీ ఎంతో అందంగా ఉంటుంది, ఆకర్షణగా ఉంటుంది. నిజంగా ఆ సమయంలో స్త్రీలు ఎంతో గర్వంతో, అహంకారంతో విర్రవీగిపోతూ ఉంటారు.

విచిత్రం ఏమిటంటే చూస్తూ ఉండగానే యవ్వనం పోయి వార్ధక్యం వస్తుంది. ఆ అందం ఉండదు, పూర్తిగా మారిపోతుంది. అందరిలో ఫోజు కొట్టిన వాళ్ళ ఆకారం వాళ్ళకే అసహ్యంగా కనిపిస్తుంది. వారు బయట కనిపించడానికి కూడా ఇష్టపడరు, రారు కూడా! సడన్ గా వాళ్ళని చూసిన వాళ్ళు ఏంటి వీళ్ళు ఇలా అయిపోయారు అని ఎంతో ఆశ్చర్యపోతారు.

ముఖ్యంగా మీరు సినిమా యాక్టర్స్ ని చూస్తే ఇది అర్థమవుతుంది. ఇప్పుడు మీకు యూట్యూబ్‌లో ఒకప్పుడు ఎంత అందంగా ఉండేవారు ఇప్పుడు ఎలా ఉన్నారో! రెండు ఫోటోలు వేస్తున్నారు.

వైజయంతిమాల, హేమమాలినిని చూస్తే అప్పుడు వున్న అందము లేదు, యవ్వనమూ లేదు, అంటే ఏది శాశ్వతం కాదు అని తెలుస్తుంది. అలాగే పురుషులు యవ్వనంలో మంచి కండలతో పుష్టిగా, సౌష్టవంగా ఉంటారు. గర్వంతో వాడెంత, వీడెంత అంటారు. కొన్నాళ్ళకి కండలు కరిగిపోతాయి, శరీరం వంగిపోతుంది, మాటలు తడబడతాయి, కంటి చూపు తగ్గిపోతుంది, చెవులు కూడా వినపడవు, శరీరం ముడతలు పడుతుంది. అంటే ఏదీ శాశ్వతం కాదు అని తెలుసుకోవాలి. ఎవరిని చూసినా అంతే!

ఇది అర్థమైనవాడు ఉన్నప్పుడు గర్వపడడు, అహంకరించడు. స్త్రీలు తమ అందం చూసుకొని విర్ర వీగరు. శాశ్వతం కాని దాని గురించి విర్రవీగేదేంటి? అలా విర్ర వీగినోళ్లే జుట్టు తెల్లబడితే రంగు వేసుకోవడానికి నానా తిప్పలు పడతారు,

అలాగే వాళ్ళకు ఉన్న ఉద్యోగం చూసి చేతిలో ఎంతో అధికారం, పెత్తనం వుంటే భూమ్మీద ఉండరు. కానీ కొన్నాళ్ళకి రిటైర్ అయిపోతారు. పదవి శాశ్వతమా? అంటే అది శాశ్వతం కాదు. కొంతమంది వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదిస్తారు, నా ప్రతిభే అని గర్విస్తాడు. కొన్నాళ్ళకి వాడి పిల్లలు బయలుదేరుతారు. వీడికి ఓపిక తగ్గిపోయి పిల్లల చేతిలో పెడతారు. వాళ్ళు ఉన్నదంతా తగలేస్తారు, ఇంక చూడండి వాడి ఏడుపు.

అందుచేత పదవులు కానీ, ఉద్యోగాలు కానీ, వ్యాపారం కానీ, ఆస్తులు కానీ ఏది చూసినా గర్వించడానికి, అహంకరించడానికి ఏమీ లేదు. అందుకే పత్రి గారు ఏమంటారంటే!

**"వస్తే రాని, ఉంటే ఉండని, పోతే పోని"** అంటే **"వచ్చిందని సంబరపడకు, ఉందని గర్వపడకు, పోయిందని బాధపడకు."**

సదానంద యోగి గారు బోధించినటు వంటి ఒక గొప్ప సందేశం ఏమిటంటే ?

**" కోరి సాధించరాదు,**

**కోరక వచ్చింది కాదనరాదు,**

**వస్తూ ఉంటే వస్తూ ఉందని సంబరపడరాదు,**

**పోతూ ఉంటే పోతుందని బాధపడరాదు."**

**కోరి సాధించరాదు:-** చాలామంది చాలా కోరుకుంటారు, ఇంకా కొంతమంది సంకల్పాలు పెడతారు. ఇంకా కొంతమంది ఎంత కోరుకున్నా రావట్లేదని అడ్డ మార్గాల ద్వారా ప్రయత్నిస్తారు. అధర్మంగా, అన్యాయంగా, అక్రమంగా సంపాదించాలని ప్రయత్నిస్తారు.

కానీ ఆ రకమైన సృష్టి విరుద్ధమైన పనుల ద్వారా సంపాదించడం వల్ల భవిష్యత్తులో అధర్మంగా సంపాదించింది కోల్పోవడమే కాదు, తాను ఇంకా ఎక్కువ నష్టపోవాల్సి వస్తుంది. ఇది మహాభారతంలో చూశాం.

దుర్యోధనుడు అధర్మంగా మాయాజూదంలో పాండవుల రాజ్యం సంపాదించుకున్నాడు. కానీ తర్వాత జరిగిన యుద్ధంలో తాను తన వారందరినీ కోల్పోవడమే కాదు, తన రాజ్యాన్ని కూడా కోల్పోవలసి వచ్చింది. ఎందుకు జరిగింది అంటే అధర్మంగా ప్రవర్తించడమే!

అందుచేత మీరైనా సరే సంపాదించండి కానీ అధర్మంగా సంపాదించ వద్దు. కొంతమంది అడగొచ్చు. ఈ రోజుల్లో ధర్మంగా ఎక్కడ సంపాదించ గలమండి. ఉద్యోగం చేసేవాళ్ళు కూడా అంటారు! నేను ధర్మంగా ఉద్యోగం చేయాలి అంటే నా పై ఆఫీసర్ ఒప్పుకోవట్లేదు అని.

పైగా నా భార్యకు కూడా నేను లోకువైపోయాను! మీ వాళ్ళంతా అపార్ట్మెంట్లు అన్ని కొంటుంటే వాళ్ళ కంటే పెద్ద ఉద్యోగం చేస్తున్నావు నువ్వేంటి ఇలా ఉన్నావు అంటారు. ధర్మంగా ఉంటే రిలేషన్ కూడా పోతుంది, ఇంకా చాలా విచిత్రం! ధర్మంగా ఉన్నాడని చెప్పి ఎవరు మెచ్చుకోరు.

కొన్ని ఉదాహరణలు నా జీవితంలో మొదట్లో చూశాను. ఒక ఎక్సైజ్

ఇన్స్పెక్టర్ ఉండేవాడు. ఆ టైంలో బ్లాక్ మెయిల్ చేసి ఏదో రకంగా లక్షల మీదే వెనకేశాడు. వాడి ఉద్దేశం ఏమిటంటే ఒక్కగానొక్క కూతురు బాగా సంపాదిస్తే అమ్మాయికి మంచి సంబంధం చేసి దాని జీవితాన్ని బాగు చేయొచ్చు కదా అనుకున్నాడు.

మొత్తం మీద సంపాదించాడు. ఒక డి.ఎస్.పి.కి పెద్ద కట్నం ఇచ్చి పెళ్లి చేశాడు. విచిత్రం ఏమిటంటే వాడు శాడిస్ట్ అయిపోయాడు. వీడి కూతురిని రోజు టార్చర్ చేస్తూ నరకం చూపిస్తున్నాడు. వీడు ఎంత సంబరపడ్డాడో అంత ఏడుస్తూ కూర్చున్నాడు. అప్పుడు నాకు అనిపించింది వాడు చేసుకున్నదే వాడు అనుభవిస్తున్నాడు అని.

ఆ టైంలో ఓ తహశీల్దారు మా ఇంట్లోనే రెంట్‌కి ఉండేవాడు. ఆయనకి ఏవైనా ఫ్లడ్స్ గానీ, ఏవైనా ఇబ్బందులు కానీ వస్తే పండగ.

గవర్నమెంట్ నుంచి ప్రజలకు పంచిపెట్టమని బోలెడు వచ్చేవి. అందులో చాలా ఈయన ఇంటికి పంపేసేవాడు. నెల నెలా ఇంటికి ప్రత్యేకించి ఒక వ్యాన్ పంపేవాడు ఇంటికి. ఈయన భీమవరంలో ఉద్యోగం చేసేవాడు, కుటుంబాన్ని ఏలూరులో ఉంచాడు.

ఈయన పేరు మీద ఆస్తి ఉంటే ఎవరికైనా సమాధానం చెప్పాలని కొడుకు ఉంటే కొడుకు పేరు మీద పెట్టాడు. ఇంచుమించు రిటైర్మెంట్ దాకా అలాగే సంపాదించాడు, రిటైర్మెంట్ కూడా అయింది. ఏంటో తెలియదు ఈయనకు, కొడుక్కి పడలేదు. వాడు వీడింటి నుంచి బయటికి వెళ్ళిపోయాడు.

ఆస్తులు అన్నీ కొడుకు పేరు మీద ఉన్నాయి, ఇప్పుడు ఈయన రిటైర్ అయిపోయాడు. తన పేరు మీద ఏమీ లేవు, మనవడు పుట్టాడు. ఎంతో సంబరపడ్డాడు, కానీ వాడిని కూడా కొడుకు వీళ్ళ ఇంటికి పంపేవాడు కాదు. ఆయన ఎంతో బాధపడేవాడు. నా పరిస్థితి ఇలా అయిపోయింది అని.

ఎలా ఉందంటే పరిస్థితి భార్య ద్వారా వచ్చినటువంటి ఒక ఇల్లు మటుకు వుంది అంతే! ఎంత వెనకేశాడో చివరికి ఒక్కటీలేదు. అప్పుడు అనుకున్నాను అధర్మంగా సంపాదిస్తే పరిస్థితి ఇంతే అని.

కానీ ఇంకా కొంతమందిని చూశాను, ధర్మంగా సంపాదిస్తూ కష్టపడుతూ జీవించేవారు. కొన్నాళ్ళకి వాడి పిల్లలలకి వివాహం చేశాడు, ఉద్యోగస్తులకే చేశాడు. అనుకోకుండా వాళ్ళకి ప్రమోషన్ వచ్చి మంచి పొజిషన్ లోకి వెళ్ళిపోయారు. అప్పుడు ఆయన అన్నాడు, నా ధర్మమే నా పిల్లల్ని కాపాడింది అని.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నాను అంటే సదానంద యోగి గారు చెప్పినటువంటి సందేశం మీకు అర్థం కావాలని. ఆయన ఏమన్నారంటే! "కోరి సాధించరాదు".

అడగవద్దు, అధర్మంగా వ్యవహరించవద్దు. నువ్వు గతంలో చేసుకున్న దాన్ని బట్టి ఏది రావాలో, ఎంత రావాలో అంతే వస్తుంది.

ఎంత చేసుకున్నావో అంతలోనే ఉన్నావు, మించి రావాలి అంటే ఇప్పుడు చేసుకో. అందుచేత కోరి సాధించే ప్రయత్నం చేయకండి. రకరకాల బ్లాక్ మెయిల్స్ చేసి గడిస్తున్నారు, ఈ ఆధ్యాత్మికాన్ని అడ్డు పెట్టుకొని సంపాదిస్తున్నారు. ఖచ్చితంగా దానికి తగ్గ ఫలితం తర్వాత అనుభవిస్తారు.

ఇంకోటి చెప్పారు ఆయన "కోరక వచ్చింది కాదనరాదు" అన్నాడు. నీకు అనుకోకుండా కలిసి వచ్చింది, దాన్ని కాదనవలసిన పనిలేదు. నువ్వు అడగకుండా నీకు సహాయం చేశారు దాన్ని నువ్వు కాదనక్కర్లేదు అన్నారు.

ప్రకృతి నీ అవసరాన్ని బట్టి నీ అర్హతను బట్టి నీకు ఎంత సమకూర్చాలో అంతా సమకూరుస్తుంది. చాలామంది అడుగుతారు! వాళ్ళు ఇస్తున్నారు నేను తీసుకోవచ్చా? నువ్వేమీ అడగలేదు, వాళ్ళంతట వాళ్ళు ఇచ్చారు, అందుచేత కాదనవల్సిన పనిలేదు.

ఒకవేళ అవసరానికి మించి నీ దగ్గరికి వస్తుంది. ఇస్తున్నారు, మించి ఉన్నదాన్ని మళ్ళీ పంచు. పత్రిగారి దగ్గర గమనించాను నేను, ఇలా తీసుకుంటారు అలా ఇచ్చేస్తారు.

అలాగే "వస్తూ ఉంటే వస్తుందని సంబరపడరాదు". నీకు లాభాలు రావచ్చు దాని కోసం ఓ సంబరపడవలసిన పని ఏం లేదు, నువ్వు అర్హత సంపాదించుకున్నావు ఆటోమేటిక్ గా వస్తుంది.

అలాగే "పోతూ ఉంటే పోతుందని బాధపడరాదు". శంకరాచార్యుల వారు చెప్పారు కదా? కర్మ బంధాన్ని బట్టే ఉంటాయి, బంధం తీరిపోతే అన్నీ పోతాయి. దానికి బాధపడవలసిన పనిలేదు.

నిన్నటి దాకా ఉంది ఇవాళ పోయింది. అందుచేత వస్తే రావచ్చు, పోతే పోవచ్చు. వచ్చినా చేయవలసింది ఏం లేదు, పోయినా ఏడుస్తూ కూర్చోవల్సింది పని లేదు. ఒకటే గుర్తుపెట్టుకోండి ఉన్నది కూడా శాశ్వతం కాదు. తాత్కాలికంగా నీ అర్హతను బట్టి నువ్వు ఉపయోగించుకోవడానికి ఇవ్వబడింది. దాన్ని ఉపయోగించుకుంటూ ఉన్నదాన్ని 10 మందికి ఉపయోగ పడే పనులకు ఉపయోగించు.

ఆ రకంగా ఎవరు ప్రవర్తించగలరు? అంటే "ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు" అని తెలుసుకున్న వాళ్ళు.

అందుచేత పెద్దలు చెప్పినటువంటి సందేశాలు సామాన్యంగా తీసిపడేసేవి కాదు. అవి మనకి అర్థం కావాలి అంటే మన బుద్ధి బాగా వికసింప చేసుకోవాలి. మీ బుద్ధి ఎంత పెరిగితే ఈ విషయాలన్నీ అంత బాగా అర్థమవుతాయి.

# “కోరికలు తీర్చుకునేవాడు గొప్పవాడు కాదు, కోరికలు అదుపు చేసుకున్న వాడే గొప్పవాడు.”

ప్రతి మానవుడికి మనసు ఉంటుంది. మనసు ఉన్నచోట ఆలోచనలు ఉంటాయి, ఆలోచనలు ఉన్నచోట కోరికలు తప్పకుండా పుడతాయి. కోరికలు మనిషి సహజ స్వభావం. కానీ ఈ కోరికల స్వభావం ఎలా ఉంటుందో మీరు గమనించాలి.

ఒక కోరికను మీరు తీర్చుకున్న వెంటనే, మరొక కోరిక పుడుతుంది, ఆ కోరికను తీర్చుకున్నాక మళ్లీ ఇంకొకటి వస్తుంది. ఎందుకంటే కోరికలు తీర్చుకోవడం వల్ల తగ్గవు, మరింత పెరుగుతాయి. అయితే, ప్రతి కోరికను తీర్చుకోవడం మీకు సాధ్యం కాదు. కొన్ని కోరికలను మీరు సులభంగా తీర్చుకోగలుగుతారు, కానీ మరికొన్ని కోరికలు తీర్చుకోలేరు.

కొన్ని కోరికలు మానవుడి శక్తికి మించినవిగా ఉంటాయి. అలాంటి కోరికలను మనిషి తీర్చుకోలేడు. కానీ ఆ కోరికలు తీరకపోతే, అతడు ఎంతో దుఃఖానికి లోనవుతాడు, అశాంతికి గురవుతాడు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి  “కోరిక మనసుకు చెందినది”. అందుకే, మనసు ఆ కోరికను సులభంగా వదలదు. తీర్చుకోలేని కోరిక అయినప్పటికీ, ఎలాగైనా దాన్ని సాధించాలి అనే పట్టుదల పెరుగుతుంది.

ఆ కోరికను తీర్చుకోవడానికి మనిషి చేయకూడని పనులు చేయవలసి వస్తుంది. తప్పులు చేస్తాడు, పాపాలు కూడా చేస్తాడు. తాత్కాలికంగా కోరిక తీరినా, దాని ఫలితంగా జీవితంలో కష్టాలు, దుఃఖం. అలాగే ఈ కోరికల వల్ల కుటుంబంలో కూడా గొడవలు జరుగుతూ ఉంటాయి. కుటుంబ కలహాలు జరుగుతున్నాయంటే దానికి ముఖ్య కారణం కోరికలే.

భార్య కోరిన కోరికలను భర్త తీర్చకపోతే అక్కడ గొడవ జరుగుతుంది.

అలాగే భర్తకు ఉన్న కోరికలను భార్య కాదన్నా కూడా గొడవే.

మొదట్లో తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో, అనురాగంతో, ఇష్టంతో వాళ్ళు అడగకపోయినా ఎన్నో వస్తువులు ఇస్తూ ఉంటారు. ఇది ప్రేమతో చేసిన పని అయినప్పటికీ, పిల్లలలో ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటు పెరిగే కొద్దీ, పిల్లలు "తల్లిదండ్రులు ఇస్తున్నారు కదా" అనే భావంతో, మరిన్ని కోరికలు కోరడం ప్రారంభిస్తారు. వారు ఎదిగే కొద్దీ వారి కోరికలు కూడా పెరుగుతూనే ఉంటాయి. చదువుకునేటప్పుడు, ఎలిమెంటరీ స్కూల్‌లోనే సెల్‌ఫోన్ కావాలని కోరుతారు. ఇంకా స్కూల్లో సరిగా చేరక ముందే, ఆడుకోవడానికి కూడా సెల్‌ఫోన్ కావాలని అడుగుతారు. ఇవ్వకపోతే అక్కడే గొడవలు మొదలవుతాయి. ఇలా గమనిస్తే, కోరికలు ఎలా చిన్న స్థాయిలో మొదలై, క్రమంగా పెద్ద సమస్యగా మారుతాయి

ఈ కోరికలను తీర్చుకోవడానికి మానవుడు కేవలం సంపాదించడమే కాదు, కొన్నిసార్లు అధర్మంగా కూడా వ్యవహరిస్తాడు. ఎందుకంటే ధర్మంగా సంపాదిస్తే అన్ని కోరికలను తీర్చుకోవడం సాధ్యం కాదు. ఎంత విచిత్రమంటే ఎవరింటికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా ఏదో కొత్త వస్తువులు, చీరలు, బట్టలు, ఇతర సామాన్లు అక్కడ కనిపిస్తాయి. వాటిని చూసినప్పుడు "నాకు కూడా ఇది ఉంటే బాగుంటుంది" అని అనిపిస్తుంది. ఇంటికి వచ్చిన తర్వాత దానిని నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తారు. సరే, అది నెరవేర్చుకున్నారనుకుందాం, తర్వాత ఇంకో ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ ఇంకో కొత్త వస్తువు కనిపిస్తుంది, అదీ నెరవేర్చుకున్నారనుకుందాం.

మళ్ళీ ఇంకో చోటికి వెళ్లినప్పుడు ఇంకో వస్తువు కనిపిస్తుంది. ఇలా చూసిన ప్రతిదీ కావాలని కోరుతూనే ఉంటారు. కానీ చూసిన ప్రతి దాన్ని నెరవేర్చుకునే శక్తి వుండదు.

ఇవన్నీ చేసి చివరికి కష్టాల పాలవుతారు. అలా తన జీవితాన్ని

దుఃఖమయం చేసుకుంటారు. ఎప్పుడూ గొడవలతో సంసారంలో నరకాన్ని సృష్టించుకుంటారు. ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే కోరికల వల్లే వచ్చింది.

అందుచేత మీరు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే **"కోరికలు తీర్చుకునేవాడు గొప్పవాడు కాదు, కోరికలు అదుపు చేసుకున్నవాడే గొప్పవాడు".**

కోరికలు లేకుండా ఎవరూ ఉండలేరు, అవి పుడుతూనే ఉంటాయి, కానీ పుట్టిన కోరికలను అదుపు చేసుకోవాలి.

అదే నిజమైన గొప్పతనం. వాడికి ఉంది, ఇప్పుడు నాకు లేకపోతే ఏముంది? నా అవసరాలన్నీ తీరుతున్నాయి, నాకు ఎలాంటి లోటు లేదు అన్న స్థితిలో మానవుడు ఉన్నప్పుడు ఎలాంటి గొడవలు ఉండవు.

ఇవన్నీ ఎందుకు అంటే కోరికల వల్లే. ఇది ఎందుకు గుర్తుంచు కోవాలంటే, మానవుడిని కష్టాల పాలు చేసేది ఈ కోరికలే. ఎంత కష్టపడి ఒక కోరికను తీర్చుకున్నా, అక్కడితో తృప్తి పడడు. అది పూర్తయ్యాక మళ్లీ ఇంకో కోరిక కోరుతాడు. సైకిల్ లేని మానవుడు "సైకిల్ ఉంటే బాగుంటుంది" అని అనుకుంటాడు, ఎలా అయినా కష్టపడి సైకిల్ సంపాదించుకుంటాడు. కొన్నాళ్లకు మళ్లీ "బైక్ ఉంటే బాగుంటుంది" అనే కోరిక పుడుతుంది. అలా కష్టపడి బైక్ కూడా సంపాదించుకుంటాడు. అక్కడితో ఊరుకుంటాడా? ఊరుకోడు. తర్వాత "కారు కావాలి" అని కోరుకుంటాడు. మొదట చిన్న కారు కొనుగోలు చేస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఇంకా పెద్ద కారు, ఇంకా సౌకర్యంగా ఉన్న కారు కనిపిస్తాయి.

వాటిని చూసి "నాకు కూడా పెద్ద కారు కావాలి" అని కోరుకుంటాడు. కానీ అది తన శక్తికి మించినది అయితే అప్పు చేస్తాడు. చివరికి ఆ అప్పును కూడా తీర్చలేక ఆ కారును తిరిగి అమ్మవలసి వస్తుంది. అమ్మినా కూడా అప్పు పూర్తిగా తీరదు. సంపాదించే దాంట్లో అప్పులు తీర్చడానికే సరిపోతుంది. దాంతో మానవుడు ఎన్నో ఇబ్బందులు పడతాడు. ఇలా గమనిస్తే, ఎవరి

జీవితాన్ని చూసినా ఈ కోరికల వల్ల ఎంతో దుఃఖం అనుభవించవలసి వస్తుంది. అందుచేత  కోరికలు తీర్చుకోవడం కాదు, కోరికలను అదుపు చేసుకోవడం నేర్చుకోవాలి. అలా అదుపు చేసుకున్న వాడే గొప్పవాడు.

మరి కోరికలు ఎలా అదుపు చేసుకోవాలి?" అని మీరు అడగవచ్చు. కోరికలు అన్నవి మనసుకు సంబంధించినవి. అందుచేత ఎవరు మనసును అదుపులో ఉంచుకుంటారో, వారి కోరికలు కూడా అదుపులోనే ఉంటాయి. అప్పుడు వారి జీవితమే మారిపోతుంది. ఇప్పుడు మీరు గమనిస్తే ఈ మార్గంలో సాధన చేస్తున్న వాళ్లలో చాలామంది తమ మనసును అదుపులో ఉంచుకుంటున్నారు. మనసు అదుపులో ఉన్నప్పుడు కోరికలు కూడా అదుపులోనే ఉంటాయి. ఎన్ని కోరికలు వచ్చినా, ఎన్ని విషయాలు చూసినా, "ఇది నాకు నిజంగా అవసరమా?" అని ఆలోచించే స్థితి వస్తుంది. అలా నిజంగా ఎంతో మార్పు వస్తుంది.

కొంతమంది ఇదివరకు మా జీవితం వేరుగా ఉండేది, ఇప్పుడు మా జీవితం పూర్తిగా మారిపోయింది అని అంటారు. ఇది వరకు ఏది వారి అదుపులో ఉండేది కాదు, ఇప్పుడు అన్నీ వారి అదుపులో ఉన్నాయి. దానికి ముఖ్య కారణం  మనసు వారి అదుపులో ఉండడం. దాంతో వారి ఖర్చులు కూడా చాలా తగ్గిపోయాయి.

అందుచేత ఎవరైతే ఈ ధ్యానాన్ని తీవ్రంగా చేస్తారో, వారి మనసు వారి అదుపులోకి వస్తుంది. అందుకే పెద్దలు చెబుతారు ప్రపంచాన్ని జయించిన వాడి కంటే మనసును జయించిన వాడే గొప్పవాడు.

అందుచేత ఎవరైతే ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేస్తారో, వారు మనసును అదుపులో ఉంచుకుంటారు. అప్పుడు కోరికలను కూడా అదుపులో ఉంచుకోగలగుతారు. కోరికలు అదుపులో ఉన్నవాడి జీవితం పూర్తిగా మారిపోతుంది. అంతకంటే ఇంకా కావాల్సింది ఏమీ లేదు.

# పిరమిడ్ మాస్టర్ల 18 ఆదర్శ సూత్రాలు

1. సరియైన ధ్యానం అంటే "ఆనాపానసతి" ధ్యానం చేయడం, అందరి చేతా చేయించడం.
2. సరియైన ఆధ్యాత్మిక పుస్తకాలను చదవడం; వాటినే అందరి చేతా చదివించడం.
3. ధ్యానానుభవాలనూ, పుస్తక జ్ఞానాన్నీ విధిగా అందరూ పరస్పరం పంచుకోవడం.
4. విధిగా పౌర్ణిమ ధ్యానం చేయడం ; అందరిచేతా పౌర్ణమి ధ్యానాన్ని చేయించడం.
5. వీలయినంత మౌనం పాటించడం.
6. వీలయినప్పుడల్లా పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం.
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి.
8. మాంసాహారం ససేమిరా తినకపోవడం! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమిత ఆహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ ఇవ్వడం.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణలో 'డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలు' అన్నది ఏ మాత్రం లేకపోవడం.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ సత్యఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. ఎవరి సమస్యలను వారే, తమ తమ స్వీయ ఆత్మశక్తిని ఉపయోగించి పరిష్కరించుకోవడం.
16. గృహస్థులుగా వుంటూనే, ఎవరి పనులు వారు చూసుకుంటూనే, జీవన్ముక్తిని సాధించడం.
17. అన్ని గ్రామాల లోనూ, అన్ని పట్టణాలలోనూ విధిగా పిరమిడ్ ధ్యానకేంద్రాలు నెలకొల్పడం.
18. పిరమిడ్ మాస్టర్లందరూ తమ తమ ధ్యానానుభవాలను గ్రంథరూపం చేసి విధిగా ప్రచురించాలి.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు- రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) కబీరు సందేశాలు-2 - రూ.60/-
51) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
52) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
53) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
54) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
55) అతీంద్రియ శక్తులు - రూ.60/-
56) ఆలోచించండి - రూ.60/-
57) నిర్వాణ మార్గం - రూ.60/-
58) ధ్యానులకు సూచనలు - రూ.60/-
59) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
60) మమకారం - రూ.60/-
61) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
62) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
63) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
64) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
65) సంకల్పమంటే? - రూ.50/-
66) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
67) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
68) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
69) అరిహంత్ - రూ.50/-
70) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన- రూ.50/-
71) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
72) విదురుని సందేశాలు - రూ.40/-
73) మూడురకాల జీవితాలు - రూ.40/-
74) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
75) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
76) బ్రహ్మం అంటే? - రూ.40/-
77) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం- రూ.40/-
78) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
79) మహాత్ముల సందేశాలు - రూ.40/-
80) సత్యం - రూ.40/-
81) చక్రాలు - రూ.40/-
82) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
83) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
84) మౌన ధ్యానం - రూ.40/-
85) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
86) శాకాహారమే మానవాహారం - రూ.15/-
87) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



ముఖ్యమైన సందేశాలు మీలో మార్పు తీసుకురావడానికి ఎంతో ఉపయోగపడతాయి, మీరు ఆధ్యాత్మికంగా ఎదగడానికి సహాయపడతాయి. ఆధ్యాత్మికంగా ఎదగడం అంటే మనిషిలో సంపూర్ణమైన మార్పు తీసుకురావడం. ఆధ్యాత్మికంగా ఎదిగినప్పుడు మీరు దేన్నైనా తట్టుకోగలుగుతారు.

- "సృష్టిలో మార్పు అన్నది సహజం"
- "ఇతరులలో లోపాలు కనిపిస్తున్నాయి అంటే, నీలో లోపం ఉందనే లెక్క."
- "అంతా ఒక్కటే"
- "అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి?"
- "ఇతరులు ఏదో అనుకుంటారని ఏదీ చేయకూడదు"
- "వర్తమానంలోనే జీవించాలి"
- "జీవితం ఒక నాటకం"
- "చేయవలసినవి చేస్తే, పొందవలసినవి ఆటోమేటిక్‌గా పొందుతారు."
- "త్రికరణ శుద్ధి-అంతరాత్మ ప్రబోధం".
- "తప్పులు చేయని వాడు గొప్పవాడు కాదు, తప్పులు సరిచేసుకునే వాడే గొప్పవాడు"
- "సత్యమే ఎప్పుడూ జయిస్తూ ఉంటుంది, అసత్యం అపజయం పాలు అవుతుంది"
- 'పంచింది పెంచబడుతుంది'
- "ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు"
- "కోరికలు తీర్చుకునేవాడు గొప్పవాడు కాదు, కోరికలు అదుపు చేసుకున్న వాడే గొప్పవాడు."

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.90/-


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |